# మూసీ

# MUSI


◆ Samputi : 25 ◆ Sanchika : 11 ◆ Pages : 64 ◆ Rs. 20

◆ September 2022

UGC Care List
Approved Journal



- కాకి పడిగెల కథన నైపుణ్యం
- బాల సాహిత్యమే భవిష్యత్తుకు దస్తావేజు
- ఆధునిక సాహిత్యంలో మణిపూసలు
- మడమ తిప్పని కార్యవాది - కావ్యశీలి 'గాడిచెర్ల'
- బాల కార్మికుల బతుకు సిత్రం - పల్లెటూరి పిల్లగాడా...
- ఆత్రేయ 'ఈనాడు' నాటక రచనా వైశిష్ట్యం
- శతక కవి - కృష్ణదాసు
- సహజ సాహితీ సర్వజ్ఞులు - పెనుగొండ శ్రీనివాసులు






వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 25 సంచిక : 11
సెప్టెంబర్ - 2022
'శుభకృత్' భాద్రపద మాసం
**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

ISSN 2457-0796



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

కాకి పడిగెల కథన నైపుణ్యం ... డా. పుట్ల యాదేశ్ 7
చెద్దగడియ (బందారం కథలు -10) ... డా. నందిని సిధారెడ్డి 13
బాల సాహిత్యమే భవిష్యత్తుకు దస్తావేజు - డా. పత్తిపాక మోహన్...
మూసీ ముచ్చట ...అట్టెం దత్తయ్య 17
పద్య మనోహరం - 34 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 22
భారతీయీకరణ4 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 23
ఆధునిక సాహిత్యంలో మణిపూసలు ... కందుకూరి భాస్కర్ 26
యాభై సంవత్సరాల జ్ఞాపకాలు (గ్రంథాంతరంగం-16) ... ఘట్టమరాజు 29
మడమ తిప్పని కార్యవాది - కావ్యశీలి 'గాడిచెర్ల' ... డా. దండెబోయిన పార్వతి 32
ఆచార్య మసన చెన్నప్ప సాహిత్య సేవ ... ఆచార్య సూర్యా ధనుంజయ్ 35
బాల కార్మికుల బతుకు సిత్రం - పల్లెటూరి పిల్లగాడా ... డా. కందుల శివకృష్ణ 39
ఆరుద్ర 'ఈనాడు' నాటక రచనా వైశిష్ట్యం ... డా. బాణాల భుజంగరెడ్డి 42
ఇష్టద రాజనాయక శతి - నవ్య శతక ప్రబంధ నిరోష్ఠ్య రచన ... లింగాల అలివేలు 49
శతక కవి - కృష్ణదాసు ... డా. పెబ్బేటి మల్లికార్జున్ 51
సహజ సాహితీ సర్వజ్ఞులు - పెనుగొండ శ్రీనివాసులు ... సుప్పని సత్యనారాయణ 55

### కవితలు

సైనికా! ... అష్టకాల నరసింహరామ శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; ఉపాధ్యాయుడు ... కట్ట రంజిత్ కుమార్ - 6; మనిషి తత్వంగా ... అరుణ ధూళిపాళ - 48; అంటరాని చదువు - డా. కందుల శ్రీను - 48; తలెత్తుకొని బ్రతకాలి ... చితోజు పద్మావతి - 57; అష్టాదశ శక్తిపీఠాలు ... జ్ఞాన ప్రసూనా శర్మ - 58; కలల తుపాకీ ... బొంత అశ్విని - 58; ఘర్ ఘర్ కీ జీఎస్టీ ... వనపట్ల సుబ్బయ్య - 62.

### సమీక్షలు

మట్టి ముత్యాలహారం 'దండ కడియం' ... పెద్దోజు నరేష్ 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office* : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor* : **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# కృతము

చేయుట అనే అర్థంలో కృత శబ్దాన్ని వాడుతుంటాం. చేసే పని మంచిదైతే సుకృతం, చెడ్డదైతే దుష్కృతం. ఈ సృష్టి ఏర్పడే విధానం అంతా తెలియజేసే యుగాన్ని 'కృత' యుగం అని అంటాం. కృతి అంటే రాయబడినది అనే అర్థం. పంచభూతాలతో కూడుకున్న ఒక సమగ్రమైన రచనకు ప్రకృతి అని పేరు. శుభమైన పనులు చేసేది 'శుభకృతం'. చేయడం, రాయడం వంటి భావాలకు మూలమైనది 'కృతము'. కృతాన్ని బట్టి మన జీవన విధానం అర్థం అవుతుంది. సుకృతాలైతే తరువాతి జీవితం ఆనందప్రదమవుతుంది. దుష్కృతాలైతే విషాదమవుతుంది. ప్రకృతికి, పశు పక్షులకు, చుట్టూ ఉన్న సమాజానికి మంచి చేయడమే సుకృతమనుకుంటే ఆ మార్గంలోకి మన ప్రయాణం కొనసాగాలి. తయారు చేయబడిన ప్రకృతిని పాడు చేయడం వంటి పనులు చేస్తే అది వికృతమవుతుంది. కృతమే కర్మగా పరిణమిస్తుంది. దాని నుండి శుభాశుభాలు చర్చించబడతాయి.

విత్తనాన్ని భూమిలో నాటినప్పుడు ఆ విత్తనానికి సరియైన పాంచభౌతిక వ్యవహారాలు దొరికితే మళ్ళీ వందల గింజల రూపంలో మనకు ఫలాన్ని ఇస్తుంటుంది. ఏదైనా భావాన్ని ఈ ప్రకృతిలోకి మనం పంపించినపుడు దానికి కూడా అనుకూలత ఏర్పడిన సమయంలో ఆ భావాలు కూడా వేలాదులుగా మనపైకి వర్షిస్తుంటాయి. భావాన్ని మూడు రూపాల్లో పంపించే అవకాశం ఉంది. చేసే కర్మ (పని) ద్వారా, మాట్లాడే మాటల ద్వారా, మనసులో భావించడం ద్వారా... మూడు రకాలుగా (త్రికరణాల రూపంలో) ఇది వ్యక్తం కావచ్చు. పెట్టిన విత్తనాన్ని బట్టి పంట వచ్చినట్లుగా, పెట్టిన భావాన్ని బట్టి ఈ ప్రకృతి మనకు రూపాన్ని ఇస్తుంటుంది. చేసిన ప్రతి కర్మకూ ప్రతిఫలం తప్పదు. అది శుభమైనా, అశుభమైనా. అన్నీ అనుభవించాల్సి వస్తూనే ఉంటుంది.

ఈనాడు మహా వృక్షాలై లోకానికి అనేక రూపాల్లో తమ దివ్య ఫలాలను, చల్లని నీడలను ఇస్తున్నవన్నీ ఒకానొక రోజుల్లో చేసుకున్న సుకృతాల వల్లనే సాధ్యమౌతాయి. తమ ముండ్లతో తాము ఇబ్బంది పడుతూ, ఇతరులను ఇబ్బంది పెట్టేవి తాము చేసుకున్న దుష్కృతాల వల్లనే అవుతాయి. ఒక వృక్షాన్ని భూమిలో పెట్టి మరో వృక్ష సంబంధ ఫలితాన్ని ఆశించలేము కదా! అదే విధంగా ఒక రకమైన భావాన్ని ఈ ప్రకృతిలో నిక్షిప్తం చేసి మరో ఫలితాన్ని కూడా ఆశించలేం. మన నిత్యజీవన రచనా కర్మ కూడా సుకృతి అయి ఉండాల్సిందే. భావంలో, భాషలో, వ్యక్తంలో అన్నింటిలోనూ సుకృతాలు మాత్రమే చేయాల్సి ఉంటుంది. మన చుట్టూ ఉన్న సంతోషకరమైన బాధాకరమైన, జీవనాలన్నీ పూర్వం వారు వారు చేసిన కృతాల ఫలితాలే.

పరోపకార, దాన, ధ్యానాదులతో తమను తాము సంస్కరించుకుంటూ, శుద్ధి చేసుకుంటూ నిరంతరం ఈ ప్రకృతిని గౌరవిస్తూ, సమాజాన్ని ప్రేమిస్తూ, పశు పక్షులను ఆదరించే వారి జీవన విధానం క్రమంగా ఆనంద ప్రదమౌతుంది. దీనికి వ్యతిరేకమైన జీవన విధానంతో కల్లోలితమైన మనస్సుతో తమను, తమ చుట్టూ ఉన్న సమాజాన్ని, ప్రకృతిని నాశనం చేసే భావం, భాషలతో ఉన్నవాని స్థితిగతులు అధోగతులు కాక తప్పదు. నేటి లోక జీవన విధానమే దానికి మనకు ప్రత్యక్ష సాక్షి. చేసే పనులలో మన రచనలు కూడా ఉంటాయి. దోషాలను మాత్రమే చూస్తే ఫలితాలూ అవే. గుణాలను కూడా చూడగలిగిన రచనల ఫలితాలు కూడా తగినట్లుగా ఆనంద ప్రదాలవుతాయి. చేసిన కృతము 'సుకృతం' కావాలి. రాసిన రచన 'సుకృతి' కావాలి. వాని ఫలితాలు తరువాతి సమాజానికి మార్గదర్శనంగా నిలవాలి. కృతకంగా, కృత్రిమంగా కాకుండా ప్రకృతంగా, ప్రశాంతంగా జీవనం కొనసాగాలి. తరువాతి కాలానికి మార్గదర్శకమవ్వాలి.

# సైనికా!









పుట్టినదేడ భూవలయభూతి వివర్ధన సౌఖ్య రాశులన్
మెట్టిన వారికై తమకు మేలొక యించుక నెంచకుండ, ని
ట్టట్టని లేక సంసరణయం దభిమానము కల్గియుండినన్
గట్టి నిబద్ధ జీవనముగా సరిలేని యశస్సు సైనికా!

తమ జనులెంత సౌఖ్యముల తన్విని తీరక యుండ నీవికన్
శ్రమనొక రక్తపుం గణము జార్చుచు తీర్చుచు జాతి రక్షణో
త్తమమగు నాశయంబుల నుదాత్త పదాత్త నిరూఢ దృష్టి నీ
మమున భువిన్ చరించెదవు మాన్యతమంబగు బుద్ధి సైనికా!

ధరణి ననేక వృత్తుల విధానములన్ గమనించుచుండియున్
తరుణికి సంతుకున్ పితల దారికి దూరము గాగ జీవికన్
నెరపుచు, సాటి వారిదగు నీతికి రీతికి ప్రీతి కెయ్యెడన్
కరువగు నట్టు లుద్యమ నికాయము కాయము గాదె సైనికా!

ఎందర కెన్నియో పదవు లిచ్చెడు నీ ప్రభుతన్ సుఖంబులన్
బొందెడు కోర్కి లేక తమ పుట్టిన దేశము శత్రుపాళిచే
నందఱ గాచు దృష్టి పరమాద్భుత వృత్తిని బూని మంచుపై
నుందమటంచు నేటిన మహోదయ! గొప్పవు నీవు సైనికా!

చెట్టులు కానరావు వనసీమలు కన్నుల గానుపింప వి
ప్పెట్టులు నెక్కడుండవలె, నెప్పుడు నెక్కడి కేగగావలెన్
దట్టపు మంచు కొండల నెదన్ భవనంబుల రీతి నాయకుం
డెట్టన నట్టె సాగెదవు ఏ సుఖమైనను వీడు సైనికా!

శత్రువు వేయు నెత్తులకు జాలిన యెత్తుల నన్ని వేయుచున్
పాత్రపు యుక్తులన్ బతుకు బాటకు తూటు లొనర్చు పట్టుతో
నాత్రము లేక నిద్దురయు నాకలి మంటయు మ్రింగి దాగుచున్
చిత్రపు జీవితమ్మును రుచింపగ కొంటివి నీవు సైనికా!

(అష్టకాల వారి సైనిక శతకము నుండి...)

**అష్టకాల నరసింహా రామ శర్మ**
ఫోన్ : 944 000 8863

# ఉపాధ్యాయుడు ...



భువిఉపాధ్యాయుడనగాను పుణ్యశీలి
జ్ఞానమందించి శిష్యులమానితముగ
తీర్చిదిద్దుచు సతతంబు దీటుగాను
వేత్తయై యలరారును ప్రీతి తోడ!!!

భువి ఉపాధ్యాయుడనగాను బుద్ధిశాలి
భవ్య క్రమశిక్షణను నేర్పి దివ్యముగను
హృదయ లోతుల చదువును పదిలపరచి
భావితరమును నిర్మించు బాధ్యతగను!!!



భువి ఉపాధ్యాయుడనగాను ప్రోద్భలంబు
ఛాత్రులకు నిచ్చి సద్విద్య సంపదలను
అనుదినంబును నందించి యాదరమును
పంచుచుండును మెండుగా వరమువోలె!!!

భువి ఉపాధ్యాయుడనగాను ప్రోత్సహించి
నీతి విలువలు బోధించి నియమముగను
జాతి నిర్మాతలుగ తీర్చి సత్యపథము
నందు విద్యార్థులను పోవునటులజేయు!!!

భువి ఉపాధ్యాయుడనగా ప్రమోదముగను
మంచిచెడ్డల భేదమ్మునెంచి జూపి
సత్ప్రవర్తనతోడను సాగునటుల
శిష్యులను మార్చుచుండును చేవతోడ!!!

**కట్ట రంజిత్ కుమార్**
సిద్ధిపేట, ఫోన్ : 6300 474467




# తుకారాం అభంగం

గురువు లాత్మ జ్ఞానజనులకు
చేతునిదే చరణ వందనము
సదా వారి సన్నిధిలో నుందు
అదే నాకు అమృత 'మందు'

సేవాభావ సుస్వభావము
అచట నేర్చు సుజ్ఞానము
పాఠశాల పాపము కడిగే
గురు సాధువులది ఆ ధామము

దుఃఖిత జనుల దుఃఖము కడగ
కదలి పొమ్మను పాఠము
సాటిజీవుల సేవకు తరలే
తత్వ మానవత్వ పీఠము

తుకా సాధు జనుల భోధలు
అందుకుంటే లేవు యమ బాధలు
గ్రోలి నరుడా ఈ సారము
దాటిపోర మృత్యుకాసారము




**అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్**
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# కాకి పడిగెల కథన నైపుణ్యం

**డా. పుట్ట యాదేశ్,** తెలుగు ఉపాధ్యాయులు, ఫోన్ : 9490143067

ముత్తరాశి కులానికి ఆశ్రితకులం 'కాకిపడిగెలవాళ్ళు'. వీళ్ళు కేవలం ముత్తరాశులకు మాత్రమే 'పటం కథలు' చెప్తూ వాళ్ళు ఇచ్చే త్యాగం(దానం)పై ఆధారపడి బతుకుతారు. వీళ్ళు చెప్పే కథలను సాధారణంగా 'పాండవుల కథలు' అంటారు. అయితే ఇందులో 'ముదిరాజ పురాణం'తో పాటు ఇతర హాస్యకథలు కూడా ఉంటాయి.

కాకిపడిగెలవాళ్ళు చెప్పే కథల్లోని వివిధ ఘట్టాలు బొమ్మల రూపంలో చిత్రించబడిన ఒకటి నుండి రెండు గజాల వెడల్పు, ఇరవై నుండి ముప్పై గజాల పొడువైన వస్త్రపు చిత్రపటాన్ని ప్రదర్శిస్తారు. కథ చెప్తున్నప్పుడు మధ్య మధ్యలో ఆ సన్నివేశాలు గల బొమ్మలను ఆ పటంపై చూపిస్తుంటారు. అందుకే ఈ కథలకు 'పటం కథలు' అనే పేరు వచ్చింది. ఇది ప్రేక్షకులను కథలో మరింతగా లీనం చేయడానికి ఉపయోగపడ్తుంది.

కాకిపడిగెలవాళ్ళు చెప్పే పాండవుల కథలకు మూలం లిఖిత మహాభారతంలో కనబడుతున్నాయి. కాని వాటిలో ఎన్నో అంశాలు, కల్పనలు చేర్చబడ్డాయి. ఈ మార్పులూ, చేర్పులకు ఎటువంటి లఖిత ఆధారాలు లేవు. మహాభారతాన్ని తెలుగీకరించడంలో నన్నయ్య చేసిన పనే ఈ కాకిపడిగెలవాళ్ళూ చేశారు. నన్నయ్య తన ఏలిక అయిన రాజరాజును సంతృప్తి పరచడానికి అతని వంశకర్తలైన పాండవుల చరిత్ర అయిన మహాభారతాన్ని తెలుగులోకి అనుసృజన చేశాడు. కాకిడిగెలవాళ్ళు కూడా తమ పోషకులైన తెలుగొళ్ళ / ముదిరాజులను సంతృప్తి పరచడానికి వారి మూలపురుషులైన పాండవుల కథలు చెప్తున్నారు. తమ ఏలికలను సంతృప్తి పరచడానికి తర్కబద్ధమైన, అంగీరయోగ్యమైన, రసవంతమైన కల్పనలు ఎన్నింటినో జోడించారు. ఏ కాలంలోనైనా ఏలికలను సంతృప్తిపరచడం ఆశ్రితుల ధర్మం కదా!

కాకిపడిగెలవాళ్ళ కథనంలో మరో ముఖ్యమైన విషయం, తమ చుట్టూ నిత్యజీవితంలో జరిగే సంఘటనలను, సంభాషణలను పాండవుల కథల్లో సందర్భానుసారంగా ఇరికించడం. ఇవి కథకు బలం చేకూరుస్తూ కథనం మరింత రక్తికట్టిడానికి ఉపయోగపడ్తాయి. ఈ కాకిపడిగెల కథనకౌశలాన్ని దర్శించడానికి వాళ్ళు చెప్పే పాండవుల కథల్లో **'విరాట పర్వం పటం కథ'**ను పరిశీలిద్దాం.

కాకిపడిగెల కళాకారులు మూలకథను ఆవేశంగా, హాస్యవం తంగా, ఆసక్తికరంగా చెప్పడానికి తమవైన కొన్ని అంశాలను కథనంలో చొప్పిస్తారు. ఉదాహరణకు కొన్ని –



**1. కల్పితాంశాలు**

'విరాటపర్వం పటంకథ' పాండవుల అరణ్యవాసం ముగిసి, అజ్ఞాతవాసం ఆరంభం కావడంతో ప్రారంభమవుతుంది. పాండవులు మారువేషాలు వేసుకొని, విరాటరాజు కొలువులో ఉద్యోగులుగా చేరుదామని నిర్ణయించుకున్న తర్వాత తమ ఆయుధాలను, ఆభరణాలను ఎక్కడ దాచిపెట్టలనే ప్రశ్న ఎదురవుతుంది. ఒక పెట్టెలో పెట్టి, ఓ చెట్టుమీద దాచిపెడితే బాగుంటుందనుకుంటారు. ఇక్కడివరకు లిఖిత భారతంలో ఉన్న కథే. కాని, ఆ పెట్టెను ఎవరు తయారు చేస్తారు? అందుకోసం సహదేవున్ని మాయలూ మంత్రాలు తెలిసిన పాత్రగా కల్పన చేశారు కాకిపడిగెల కళాకారులు. సహదేవుడు ఒక మట్టిబొమ్మను చేసి, మంత్రించిన నీళ్ళు దానిమీద చల్లితే అది ఒక మేదరివాడుగా మారుతుంది. ఆ మేదరివాడు ఒక లంకపొదను సృష్టించి, దాని నుండి మేదరి పెట్టెను తయారు చేస్తాడు. ఇది కాకిపడిగెల కల్పితాంశం. ఇటువంటి కల్పతాంశాలు వీళ్ళు చెప్పే కథల్లో ఎన్నో!

**2. హాస్య ప్రధానం**

ధర్మరాజు ముందుగా తన ఆయుధాలను ఆ పెట్టెలో పెట్టి, తర్వాత తన తమ్ముళ్ళను కూడా వాళ్ళ ఆయుధాలను అందులో పెట్టమని ఆదేశిస్తాడు. అయితే ఈ ఆదేశించడంలో 'పెద్ద నుండి చిన్న' అనే వరుస కాకుండా అర్జున, నకుల, సహదేవుని తర్వాత భీమున్ని ఆదేశిస్తాడు. కాకిపడిగెలవాళ్ళు భీమున్ని చివరగా వెళ్ళేటట్లు చేసి ప్రత్యేకతను చూపించారు. ఇందుకు కారణం, వాళ్ళు చెప్పే పాండవుల కథల్లో భీముడే నాయకుడు. ఒక పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పినప్పుడే దానికి ప్రాధాన్యత రావడం కథన సంప్రదాయం. ధర్మరాజు ఆదేశంతో భీముడు తన ఆయుధాలన్నీ ఆ పెట్టెలో పెడ్తాడు. కాని, ఒక్క గదను మాత్రం తన వద్దనే ఉంచుకుంటాడు. ధర్మరాజు ఎంత బతిమాలినా వినడు. పెట్టనంటే

పెట్టనని పట్టుపడ్తాడు. ధర్మరాజు మాట భీముడు వినకపోయేసరికి ప్రేక్షకుల్లో ఉత్కంఠ కలుగుతుంది. చివరికి కారణం అడుగుతాడు ధర్మరాజు. అప్పుడు భీముడు,**"నా మీదకు ఎవరైన శత్రువులు వస్తే? ఒక్క గుద్దుతో వంద మందిని చంపుతా! ఒక్క తన్నుతో వెయ్యిమందిని చంపుతా! అదే లక్షమంది వస్తే? అప్పుడు గద కావాలి"**అంటాడు. ఈ సంవాదంలో చిరికి భీముడు రాజీపడి, **"నువు పెద్దోడివి, నువ్వడిగినపుడు ఇయ్యక పోతే బాగుండదు"** అని ఇచ్చేస్తాడు. ఇక్కడ భీముని ప్రవర్తన హాస్యవంతంగా ఉంటూనే అతన్ని నాయకునిగా స్థాపిస్తుంది. ఈ సన్నివేశం హాస్యవంతంగా నడపడంలో కాకిపడిగెల కళాకారులు చూపిన కథన కౌశలానికి నిదర్శనం.

### 3. సన్నివేశ కల్పన

కాకిపడిగెల కళాకారులు చేసే సన్నివేశ కల్పన అత్యంత సహజ సిద్ధంగా ఉండి వాస్తవికంగా ప్రస్తుతం జరుగుతున్నట్లే ఉంటుంది.

1. అర్జునుడు జమ్మిచెట్టును వెతకడానికి అడవికి వెళ్తాడు. అడివి అంతా వెతుకుతూ జమ్మిచెట్టు చుట్టూ తిరుగుతాడు. కాని ఆ చెట్టును మాత్రం చూడడు. అప్పుడు ఆ జమ్మిచెట్టే అర్జునుడు తనను చూడడం లేదని బాధపడ్తుంది. ఆ చెట్టుకు అర్జుడంటే చాలా ఇష్టం. "ఓ ప్రియమైన అర్జునుడా!" అని పిలుస్తుంది. అయినా అర్జునుడికి ఆ చెట్టు మాటలు వినబడవు. అతని దృష్టి ఎట్లయినా సరే తన దిక్కు తిప్పుకోవాలని తన కొమ్మలను గళగళమని ఊపుతుంది. అప్పుడు చూస్తాడు అర్జునుడు. జమ్మిచెట్టు అర్జునునిపై ప్రేమ చూపించిందన దం అపూర్వమైన కల్పన. కాకిపడిగెల కళాకారులు జమ్మిచెట్టును మానవీకరించి ఈ సన్నివేశాన్ని ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు.

2. ఆయుధాల పెట్టెను, జమ్మిచెట్టు మీదనే ఎందుకు పెట్టాలి? అనే ప్రశ్నకు కాకిపడిగెలవాళ్ళు కల్పించిన కారణాలు సన్నివేశాన్ని అత్యంత ఆసక్తిదాయకంగా మార్చాయి. ఇది ఎండాకాలం. చెట్లన్నీ ఎండిపోయినయి. జమ్మిచెట్టు మాత్రమే గుబురుగా ఉంది. దానికి ముండ్లున్నాయి. కాబట్టి దానిమీద పెడదామంటారు. ఇది సాధారణ విషయమే అయినా ఒక నమ్మదగిన కారణంగా చూపించారు. ధర్మరాజు ఆ ఆయుధాల పెట్టెను ఆ చెట్టుమీద పెట్టమని భీమున్ని ఆదేశిస్తాడు. అప్పుడు భీముడు హనుమంతునిలాగా చెట్టంత ఎత్తుకు పెరిగి పెట్టెను ఆ చెట్టుపైన పెడ్తాడు. దీనిని రామాయణంలోని హనుమంతుని పాత్రను దృష్టిలో పెట్టుకొని కల్పన చేశారు కాకిపడిగెల కళాకారులు.

3. ఆ ఆయుధాల పెట్టెను ఎవరైనా చూసినా దాని దగ్గరికి వెళ్ళకుండా ఉండడానికి సహదేవుడు దాన్ని దుర్గంధంతో కంపుకొట్టే మాయాశవంగా మారుస్తాడు.ఆ మాయాశవాన్ని చూడగానే పాండవులకు ఏడుపొచ్చింది. పన్నెండేండ్లు అరణ్యవాసంలో పడ్డ కష్టాలు, ఇంకో ఏడాదిపాటు అజ్ఞాతవాసం చేయవలసిన దుస్థితిని తలుచుకొని, ఆ మాయాశవాన్ని పట్టుకొని బోరున ఏడ్చారు. ఈ కల్పన పాండవుల కష్టాలను ప్రేక్షకులకు అనుభూతం చేయడానికి, ఎమోష్నల్‌గా చూపించడానికి చేసిందే కాని కథకు సంబంధించింది కాదు. ప్రేక్షకుల్లో ఎమోషన్ పెంచడానికి ఈ కథకులు చేసే కల్పనల్లో ఇదీ ఒకటి.

4. ఈ కథలో నాయిక అయిన ద్రౌపదిని, కీచకుడు చూసే సన్నివేశ కల్పన అద్భుతం.

సుదేష్ణాదేవి ఇంటి ముందు వాకిట్లో, చుట్టూ పరదాలు కట్టుకొని, దాసివాళ్ళకు ముగ్గులు వేయడం నేర్పుతుంటుంది ద్రౌపది. అక్క ఇంటికి వచ్చిన కీచకునికి ఆ పరదాల కింది నుండి ద్రౌపది పాదాలు కనబడుతాయి. ఆమె అందమైన కాళ్ళ మెరుపులకు కీచకుని కళ్లు జిగేలుమని కింద పడిపోతాడు. అందుకు కారణం, ఆకాశం నుండి చుక్క తెగిపడిందో, సూర్యకాంతి కిందపడ్డదో, చంద్రకాంతి పడ్డదో అనుకుంటాడు. ఆ కాళ్ళు, నారదుడు చెప్పిన అమ్మాయివే కావచ్చని అనుకుంటాడు. దగ్గరికి వెళ్ళి పరదాలు తొలగించి చూస్తాడు. ద్రౌపది ధగధగ మెరిసిపోతుంటుంది. ఆమె నడుము సింహం నడుములాగా పిడికిట్లో పట్టేటంతే ఉందంట! కీచకుడు అక్కడే నిలబడి, నారదుడు చెప్పినట్లు ఆ అమ్మాయే తనను పెండ్లి చేసుకుంటుందని కలలు కంటూ ఉంటాడు. అతన్ని గమనించిన ద్రౌపది అక్కడి నుండి వెళ్ళిపోతుంటే కీచకుడి కళ్లల్లో అమృతం పోసినట్లు అనిపించిందంట!

వాకిలి చుట్టూ పరదాలు కట్టుకొని ద్రౌపది ముగ్గులు వేయడం, ఆ పరదాల కింది సందులోనుండి ఆమె పాదాలు కనబడడం, ఆ తెరలను తొలగించి చూస్తే ధగధగ మెరిసిపోతున్న ఆమె ఆకారం కనబడడం మొదలైన వర్ణనలు కీచకుడికి ఓ అద్భుతాన్ని చూపించడా నికి చేసినవి. ఈ వర్ణన నేటి సినిమాలోని దృశ్య చిత్రీకరణలాగా ప్రేక్షకులకు దర్శనమిస్తుంది.

### 4. పిట్టకథలు

కాకిపడిగెల కళాకారులు పాండవుల కథలు చెప్తూ, కథాకథనంలో ఒక రసం ముగిసిన అనంతరం ప్రేక్షకులను మరో రసాస్వాదనకు సిద్ధం చేయడానికి ప్రయత్నిస్తారు. అందుకు ప్రధాన కథకు అధనంగా కొన్ని పిట్టకథలు జోడిస్తారు.

పాండవులు మాయాశవాన్ని పట్టుకొని ఏడుస్తుంటే, ఆ బాట గుండా వెళ్తున్న గొల్లొళ్ళు చూస్తారు. ఏమైందోనని దగ్గరికి వచ్చి పాండవులను చూసి ఆశ్చర్యపోతారు. **"వీళ్ళు ఎక్కడి నుండి వచ్చార్రా? హెూలి ఆడినట్లు రంగులు వేసుకున్నారు!"** అని అనుకుంటారు. ఇక్కడ రంగులు వేసుకున్నది పాండవులు కాదు. కథకులూ, వంత పాడేవాళ్ళు. వాళ్ళే పాండవులుగా నటిస్తున్నారు. కథలో లీనమైన ప్రేక్షకులను బయటికి తేవడానికి పాత్రలను వదిలి వాస్తవ లోకంలో ఉన్న కళాకారుల మీదికి వారి దృష్టిని మళ్ళించడానికి గొల్లొళ్ళ ఈ మాటలు ఉపయోగపడ్డాయి. పాండవులు, తమ కష్టాలను మాయా

శవంలో చూసుకొని ఏడ్చినపుడు, ప్రేక్షకుల్లో కరుణ రసం ఉద్భవించింది. ప్రేక్షకులు ఆ కరుణరసం నుండి తేరుకొని సాధారణ స్థాయికి వస్తే గాని ప్రధానకథ ముందుకు సాగదు. అందుకే, ప్రేక్షకులను కొద్దిసేపు నవ్వించడానికి, గొల్లలు సృష్టించబడ్డారు. ఆ గొల్లల పాత్రధారులుగా కథకుడు, వంతకులు చేసే హాస్యవంతమైన సంవాదం కన్నీళ్ల పర్యంతమైన ప్రేక్షకుల ముఖాలపై హాస్యపు జల్లులు కురిపిస్తుంది. బరువెక్కిన ప్రేక్షకుల హృదయాలు తేలికపడ్డ తర్వాత ప్రధాన కథను మళ్ళీ కొనసాగిస్తారు.

**5. పాత్ర సృష్టి**

కాకిపడిగెల కళాకారులు భారతకథలను రసవంతంగా చెప్పడానికి ఎన్నో రకాలుగా మార్పుచేర్పులు చేస్తారు. అవసరమైతే కొత్త పాత్రలను సృష్టిస్తారు. కాని, ఎన్ని రకాలుగా మార్చి చెప్పినా అసలు కథామూలాన్ని మాత్రం మార్చరు. ఇందుకు ఉదాహరణగా కీచకవధ ఘట్టంలో నారద పాత్ర సృష్టిని చెప్పవచ్చు. కీచకుడు, భీముని చేతిలో చావాలి అనేది మూలాంశం. ఈ ఘట్టంలో నారద పాత్రను ప్రవేశపెట్టడం వల్ల గంభీరమైన సన్నివేశాలను కూడా హాస్యవంతంగా, ఆసక్తికరంగా చెప్పే అవకాశాలను సృష్టించారు కాకిపడిగెల కళాకారులు.

పురాణాలలో కలహాలు సృష్టించే పాత్రగా అందరికి సుపరిచితమైనది నారదునిపాత్ర. కాబట్టి నారదున్ని కీచకవధ ఘట్టంలో వాడుకున్నారు కాకిపడిగెల కళాకారులు. నారదుడు కీచకునిపై కక్ష పంచుకోవడానికి హేతుపూర్వకమైన ఒక సన్నివేశాన్ని కల్పించారు. ఎలాగైనా కీచకున్ని చంపాలనే కసిని పెంచుకున్నాడు నారదుడు. కాని అతన్ని చంపడం తనవల్ల కాదు. కీచకున్ని చంపగల మొనగాడు భీముడొక్కడే. భీముడు కీచకున్ని చంపాలంటే వాళ్ళిద్దరికీ మధ్య వైరం రావాలి. ఆ ఇద్దరి మధ్య వైరం రావాలంటే కీచకుడు ద్రౌపదిని మోహించాలి. అది జరగాలంటే ముందు కీచకుడు ద్రౌపదిని చూడాలి. ద్రౌపది ఉన్నది అతని అక్క సుదేష్ణ ఉన్న నగరం నక్షత్రపురిలో. కాని, కీచకుడు అక్కపై కోపంతో నక్షత్రపురికి వెళ్ళక పన్నెండేండ్లయ్యింది. కీచకున్ని నక్షత్రపురికి పంపించడానికి నారదున్ని ప్రవేశపెట్టారు కాకిపడిగెల కళాకారులు. కీచకుడు ఆ ఊరికి వెళ్ళడానికి నారదుడు రకరకాలుగా ప్రేరేపించి చూస్తాడు. మీ అక్క, బావ, అల్లుడు, కోడలు అందరూ చచ్చిపోయారని కూడా చెప్పి చూస్తాడు. ఈ మాటలను కీచకుడు నమ్మినట్లే నమ్మి 'అక్కడికెళ్తే, పాండవ భీముడుంటాడేమో, నన్ను చంపుతాడేమో' అని భయపడ్తాడు. ఇట్లా నారదునికీ కీచకునికి మధ్య జరిగన సంవాదం హాస్యరస ప్రధానంగా సాగి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. లిఖిత భారతంలో కీచకుడు భీరుడు కాడు. కాని, కాకిపడిగెల పాండవుల కథలో అతడు భీరుడు. అందులోనూ భీముడంటే విపరీతమైన భయం. కీచకున్ని ఇంత భీరునిగా చిత్రించడంలో కాకిపడిగెల ప్రధానోద్దేశ్యం ప్రేక్షకులను నవ్వించడమే.



కీచకుడు, భీముని గురించి భయపడుతుంటే నారదుడు పాండవులు చచ్చిపోయారని చెప్తాడు. అప్పుడు కీచకుడు, పాండవులు మంచివాళ్ళేనని, "ఎంతమంచిగుండ్రి! ఎంతతెలివిగల్లోల్లు! అందులో ధర్మరాజు బతుకనుండె! వాడు మంచోడే. అర్జునుడు బతుకనుండె, వాడు మంచోడే. నకుల సహదేవులు బతుకనుండ్రి, వాళ్ళు మంచోళ్ళే" అంటూ పాండవులను గొప్పగా ప్రస్తుతిస్తాడు. కాని, "చాల పొద్దుగాల కర్రోడు భీముడు చావాల్సి ఉండే!" అంటాడు. ఈ మాటలను బట్టి, కీచకునికి పాండవుల్లో ఒక్క భీమునిపైనే కోపముందని తెలుస్తుంది. కాకిపడిగెల వర్ణనలో కీచకుని పాత్ర కర్ణుని పాత్రలాగా ఉదాత్తంగా చిత్రీకరించబడింది.

నక్షత్రపురికి వచ్చిన కీచకుడు అక్క సుదేష్ణ ముందు కూర్చుంటాడు. కాని, అక్కను చూడకుండా ఆమె వెనుక ఉన్న ద్రౌపదినే చూస్తుంటాడు. ఆ సమయంలో, ద్రౌపది 'సూర్యుడా! నువు పొడవకు నేనే పొడుస్తా! చంద్రుడా! నువు పొడవకు నేనే పొడుస్తా!' అంటున్నట్లుందంట! కాకిపడిగెల కథన నైపుణ్యానికి ఈ వర్ణన మచ్చుతునక. అక్క ఎంత పిలిచినా కీచకుడు పలుకడు. ద్రౌపది ధ్యానంలోనే ఉంటాడు. "నీ రాజ్యం బాగుందా? నీ ఊరు బాగుందా? నీ గుర్రాలు బాగున్నాయా? నీ ఏనుగులు బాగున్నాయా?" అని ఎన్ని విధాలుగా అడిగినా కీచకుడికి వినబడదు. కాని, కీచకుడే "అక్కా! నీ వెనుకున్నదెవరు?" అని అడుగుతాడు. సుదేష్ణ, ఆమె దాసిది అని అంటే, "దాన్ని ఎంతకు కొన్నావో చెప్పు, నేను కొంట. ఆమె నిలువెత్తు ధనం పోస్తా"అంటూ ఆశపడ్తాడు.

ఇట్లా, అక్కా తమ్ముళ్ళ మధ్య జరిగే ఈ సంవాదం ఆసక్తికరంగా సాగుతుంది. సుధేష్ణ స్త్రీవాద దృక్పథంతో మాట్లాడగా కీచకుడు ఉత్తముడైన ప్రేమికుడిగా వాదిస్తాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెను పెండ్లి చేసుకొని తీసుకెళ్తానని పట్టుపడ్తాడు. ఈ మాటల్లో కీచకుని స్వచ్ఛమైన కాంక్ష ప్రస్ఫుటమవుతుంది.

ద్రౌపది పారిపోతుంటే కీచకుడు అడ్డుపడి తనను పెండ్లి చేసుకొమ్మని పట్టుపడ్తాడు. ద్రౌపది 'తండ్రీ! తండ్రీ!' అని ఎంత



ప్రాధేయపడినా వినిపించుకోడు. చివరికి విసుగెత్తిన ద్రౌపది "ఓరి దుర్మార్గుడా" అని తిడ్తే "ఆహా! నా చెవుల్లో అమృతం పోసినట్లుంది" అని సంబరపడ్తాడు. అతని ప్రవర్తనకు మండిపడిన ద్రౌపది "మూత్రం పోసినట్లు లేదా?!" అంటుంది. ఎంతో గంభీరంగా సాగుతున్న ఈ సంవాదంలో ద్రౌపది అన్న మాటలు ప్రక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతాయి. గంభీరమైన సందర్భాలను కూడా కాకిపడిగెల కళాకారులు ఎంతో హాస్యవంతంగా చెప్తారనడానికి ఇది ఒక ఉదాహరణ.

ద్రౌపది తప్పించుకొని పారిపోయిన తర్వాత, ఇంటికి వచ్చిన కీచకున్ని అక్క సుధేష్ణ విపరీతంగా మందలించింది. "నీ పదిహేను మంది భార్యల దగ్గర లేనిది దీని దగ్గరేముందిరా?" అని నిలదీస్తుంది. ఈ మాటలు కాకిపడిగెల స్త్రీవాద దృక్పథానికి అద్దం పడ్తున్నాయి. ఈ మాటల్లో సుధేష్ణదేవి వ్యక్తిత్వ ప్రదర్శన కనిపిస్తుంది. ఆమె ఎన్ని మాటలు చెప్పినా వినకపోయేసరికి కీచకున్ని "నువ్వు నా తమ్ముడివి గాదు, వెళ్ళిపో మూర్ఖుడా!" అని తిట్టి పంపిస్తుంది. ఈ మాటలు స్త్రీ గౌరవానికి, స్త్రీ వ్యక్తిత్వానికీ అద్దం పడ్తున్నాయి. సుధేష్ణ పాత్ర చిత్రణ లిఖిత సాహిత్యంలో కంటే కాకిపడిగెల కథన శిల్పంలోనే మరింత మనోహరంగా, మహోన్నతంగా తీర్చిదిద్దబడింది.

### 6. హేతువుల కల్పన

కీచకున్ని చంపించాలని నారదుడు కక్ష కట్టాడని ఒక హేతు పూర్వకమైన సన్నివేశాన్ని సృష్టించారు కాకిపడిగెలవాళ్ళు.

1. నారదుడు ఒకసారి కీచకుని దర్శనానికి వెళ్ళినప్పుడు ఏ హడావిడి లేకుండా సాధారణంగా ఆహ్వానిస్తాడు. ఆ రాత్రి నారదునికి, అతడు శాకాహారి కావడంతో పచ్చిపులుసుతో భోజనం పెడ్తాడు. నారదుడు కూడా తృప్తి పడ్తాడు. కాని, కీచకుడికే తృప్తి ఉండదు. రాత్రి పడుకున్న తర్వత నిద్రలోనుండి లేచి **"అరె! తాతకు పచ్చి పులుసుతో భోజనం పెట్టిన. మరి పొద్దున కూడా పచ్చిపులుసుతోనే పెడ్తే నాదేం పేరు?"** అని ఆలోచించుకొని మాంసంకూరతో భోజనం పెట్టాలని నిర్ణయించుకుంటాడు. అనుకున్నదే తడవుగా ఆ అర్ధరాత్రే అందరినీ నిద్రలేపి వేటకు తీసుకెళ్తాడు. ఆ వేటకు నారదున్ని కూడా తీసుకెళ్తాడు. ఆ రాత్రంతా ఎంత వెదికినా ఒక్క యాట కూడా దొరకదు. ఆ అడవిలోనే వాళ్ళకు పొద్దెక్కుతుంది. నారదుడు ఓ బావి దగ్గరికి వెళ్ళి స్నానం చేసి, సూర్యనమస్కారం చేసుకుంటుం టాడు. నారదుడు కనిపించకపోయేసరికి దారితప్పిపోయాడని భావించి అతన్ని వెతుకుతూ కీచకుడు ఆ అడివంతా తిరిగుతాడు. ఎక్కడా నారదుడు కనిపించడు. ఎంత పిలిచినా నారదుని నుండి సమాధానం రాదు. ఇంతలో కీచకుని ఏనుగుకు దాహమైతే అక్కడున్న బావి దగ్గరికి తీసుకెళ్తాడు. ఆ బావి దగ్గరే సూర్యనమస్కారం చేసుకుంటున్న నారదుడు కనిపించేసరికి కీచకుడికి విపరీతమైన కోపం వస్తుంది. నేను ఎంత పిలిచినా పలుకవా? అని నారదుని జుట్టుపట్టుకొని గుంజుకొచ్చి కొరడాలతో కొట్టిచ్చిస్తాడు. నారదుడు కోపించి **"పాయక పన్నెండేండ్లకు పాండవ భీమునిచే చత్తువురా!"** అని శపిస్తాడు.

ఇక్కడ కీచకుడు, భీముని చేతిలో చావడానికి కారణం నారదుని శాపమేనని ఒక హేతుబద్ధమైన కథను కల్పించారు కాకిపడిగెల వాళ్ళు. వీళ్ళు చెప్పే ప్రతీకథ ఇట్లా హేతుబద్ధంగా ఉండి, ఉత్కంఠతతో, హాస్యవంతంగా ఉండి ప్రేక్షకులను అలరిస్తుంది.

2. భీముడి పేరెత్తుతేనే కీచకుడు భయపడిపోతుంటాడు. అందుకు కారణంగా భీముడు, కీచకునికి భయం పుట్టించిన ఓ సన్నివేశాన్ని కల్పించారు.

ఒకసారి, హోళీపండుగకు పాండవులు వెళ్ళిన ఊరికే కీచకుడు కూడా వెళ్తాడు. అక్కడ భీముడు, కీచకున్ని చూసి 'నీకు నాకు వైరం' అని పందెం వేసుకొని కీచకుని చేతిలో ఐదాకులు, ఐదు పోకలు, ఖర్జూరం, బొట్టు, పసుపు, కుంకుమ ఉన్న పల్లెం అందిస్తాడు. అది విడియం అనుకొని కీచకుడు తీసుకోబోతే భీముడు చావు దెబ్బలు కొడ్తాడు. ఆ పోరాటంలో భీముని చేతికి రక్తం కారుతున్నా కిలకిల నవ్వుతూ అట్లే నిలబడడం చూసి కీచకుని గుండెలు పగిలిపోయి భీరుడైపోతాడు. కోటగుమ్మాన్ని గట్టిగా పట్టుకున్న కీచకున్ని, అతనికి రక్షణగా నిలబడ్డ వందమందిని భీముడు అవలీలగా చిత్తుచిత్తు చేసి, అతన్ని నాగలోకంలో పడేటట్లు విసిరికొట్టాడ్తాడు. **"ఓయ్ సింహబలా! నా జోలికొస్తే సంపుతా!"** అంటూ మీసం దువ్వుకుంటూ

వెళ్ళిపోయాతాడు. అప్పటినుండి భీముడంటేనే కీచకునికి విపరీతమైన భయం పట్టుకుంటుంది.

3. ద్రౌపది తప్పించుకొని పారిపోతుంటే కీచకుడు అడ్డు పడినపుడు,**"తండ్రీ! తండ్రికి బిడ్డతో ఏమైనా పని ఉంటుందా?"** అని అతని మనసు మార్చాలని చూస్తుంది. కాని కీచకుడు, ద్రౌపది మాటలకు విపరీత అర్థాలు తీస్తూ హేతువులు చూపిస్తాడు. **'బ్రహ్మ కూతురు వరస కూడా లేదా'** అంటాడు. **"త్రిమూర్తులు సరస్వతీ, లక్ష్మి, పార్వతులను సృష్టించారు. అంటే త్రిమూర్తులకు వాళ్ళే మవుతారు? తండ్రులవుతారు! మరి వాళ్ళను పెండ్లి చేసుకోలేదా?!"** అని తండ్రి కూతురును పెళ్ళిచేసుకుంటే తప్పులేదని వాదిస్తాడు. కీచకుడి వితండవాదానికి కూడా హేతువులను చూపించడం కాకిపడిగెల కళాకారుల కౌశలానికి నిదర్శనం.

### 7. భవిష్యత్ సంఘటనల సూచన

భీముడు వంటలవాడుగా విరాటరాజు కొలువుకు వచ్చినపుడు అక్కడ సింహబలుడు కూడా ఉంటాడు. భీముడు లక్ష పుట్ల భోజనం చేస్తానంటే విరాటరాజు ఆశ్చర్యపోయి అంత తిండి తిని ఏంచేస్తావని అడుగుతాడు. అప్పుడు భీముడు, **"అడవి సింహాలను పట్టి బయటకు పడేస్తా, ఏనుగుతొండం పట్టి బయటకు పడేస్తా, అధిక సింహబలున్నైనా పట్టి గుద్ది చంపుతా"** అంటాడు. భవిష్యత్తులో భీముడు, సింహబలున్ని గుద్ది చంపుతాడన్న విషయం ప్రస్తావించడం వల్ల భావి కథాసూచన చేసినట్లయ్యింది.

అట్లే సహదేవుడు, విరాటరాజు కొలువులోకి వచ్చి, అతనికి పంచాంగం చూస్తూ, ఓ ఇంటి అమ్మాయి మీ ఇంటికి వస్తుంది, ఆ అమ్మాయి మీద మీ దగ్గరివాడు నేత్రం పెడ్తాడు, ఒక రోజున, ఆ ఒక్కడు చావక వందమందిని చంపుతాడని చెప్తాడు. ఈ మాటలు, భీముని చేతిలో, కీచకునితోపాటు అతని వందమంది తమ్ములు కూడా చస్తారనే విషయం సూచించబడింది.

### 8. హీరోయిజం

కీచకుడు పాండవుల గురించి మాట్లాడుతూ, 'వాళ్ళందరూ మంచివాళ్ళేగాని భీముడొక్కడు చచ్చిపోతే బాగుండు' అంటాడు. అక్కడే మారువేషంలో వున్న భీముడు ఆ మాటలు విని కోపం పట్టలేక హుమ్మని మూలిగితే ఆ శబ్దానికి ఏనుగులు గొలుసులు తెంచుకుని పారిపోయాయంట! ఈ వర్ణన అతిశయోక్తిగా ఉన్నా భీముని హీరోయిజాన్ని ప్రదర్శిస్తుంది.

పాండవులకు మారువేషాలు వేసి విరాటరాజు కొలువులోకి పంపడానికి వచ్చిన యమధర్మరాజు **"అంతా కుశలమేనా!"** అని అడుగుతాడు. అందరూ కుశలమేనంటారు. కాని, ఒక్క భీముడు మాత్రం అసహనం ప్రకటిస్తాడు. **"ఎక్కడి సంతోషం నాయిన.**





**కదుపునిండ బువ్వ తినక పన్నెండేండ్లయ్యింది. యుద్ధం లేక పన్నెండేండ్లయ్యింది. నా వొళ్ళంతా నసిమిరి పెడ్తుంది. నీ దున్నపోతును నా మీదికి పంపియ్యి. ఒక పట్టుపట్టి దాన్ని అణిచేస్తా"** అంటాడు. ఇట్లా భీముని చేత ప్రత్యేకంగా మాట్లాడించడం, బల ప్రదర్శన చూపించడం హీరోయిజం ప్రదర్శించడానికే.

అట్లే భీముడు, విరాటరాజు కొలువులోకి వస్తుంటే, కొండలు కదులు తున్నాయని, గుట్టలు కదులుతున్నాయని, చెట్లు కదులు తున్నాయని వర్ణిస్తారు. ఇట్లా, ఒక పాత్ర బలాన్ని అతిశయోక్తిగా వర్ణించడం హీరోయిజం అనిపించుకుంటుంది.

భీముడు ఊర్లోకి వచ్చేసరికి జనమంతా వెళ్ళి కుంకుభట్టు వేషంలో ఉన్న ధర్మరాజు చెప్తున్న మాటలు వింటుంటారు. భీమున్ని ఎవరూ పట్టించుకోరు. దాంతో అతనికి రోషం వస్తుంది. జనాన్ని తన దిక్కు తిప్పుకోవాలని తన పాదాన్ని భూమి మీద బలంగా వేస్తే అది పిడుగు పడ్డట్లు పడ్తుంది. ఆ చప్పుడుకు భవనాలు కూలిపోతున్నాయంట! అవతలి మిద్దెలు ఇవతల, ఇవతలి మిద్దెలు అవతల పడ్తున్నాయంట! అయినా జనం మాత్రం ధర్మరాజునే చూస్తున్నారంట! ఇక లాభం లేదని, విరాట్ రాజు ముందలికి వెళ్ళి మళ్ళీ తన కాలును భూమి మీద దబ్బున వేస్తే ఆ రాజు సింహాసనం పైనుండి కింద పడి ఏదో భూకంపమొచ్చిందని భయపడిపోయాడంట! ఎదురుగా కొండలాగా ఉన్న భీమున్ని చూసి, 'వీన్ని ఏ తల్లి కన్నదో' అని ఆశ్చర్యపోయాడంట! ఇట్లా భీముని పరాక్రమాన్ని అతియోక్తిగా వర్ణించి ప్రేక్షకులకు ఆహ్లాదం కల్గిస్తారు.

**9. ధాతృకుల వృత్తిని స్పృశించడం**

పాండవులు తమ ఆయుధాలను మాయాశవంలో దాచి, జమ్మిచెట్టు మీద దాచిన తర్వాత ఒక సందేహం కలుగుతుంది. ఇది ఎండాకాలం. ఎవరైనా గొల్లలు నీడకోసం ఈ చెట్టుకిందికి వస్తే? ఈ పెట్టెను చూస్తే? సొమ్ముల్ని తీసుకొని, ఆయుధాలు పడేసిపోతారు. అవి ఎండకు ఎండి, వానకు నాని పాడైపోతాయిగదా! అని పాండవులు ఆలోచనలో పడ్డారు. ఇక్కడ పాండవులు బాధపడేది సొమ్ములు పోతాయని కాదు, తమ ఆయుధాలు పాడైపోతాయని. ఈ ఆయుధాలు కాకిపడిగెలవాళ్ళ ఆశ్రితకులమైన ముత్తరాసుల కులవృత్తికి చెందినవి. అందువల్ల ధాతృకులస్థులను కథలో లీనం చేయడానికి అక్కడక్కడ ఇటువంటి సందర్భాలను సృష్టిస్తారు.

**10. వర్ణనలు కల్పించడం**

కాకిపడిగెల కళాకారులు సందర్భోచితంగా చేసిన వర్ణనలు అద్భుతరసవంతంగా ఉన్నాయి. కుంకుభట్టుగా మారువేషం వేసుకున్న ధర్మరాజు విరాటరాజు కొలువులోకి వెళ్ళడానికి సిద్ధమౌతాడు. ఒక్క అడుగు ముందుకు వేయగానే విరాటరాజ్యంలోని వాతావరణమంతా ఒక్కసారిగా మారిపోయిందంట!

ధర్మారాజు ఎండలో వెళ్తున్నాడని మేఘాలు ఎండను కమ్మేశాయి. వడగాలి చల్లని పిల్లగాలిగా మారింది. ముత్యాలవాన పడింది. ఎండిన చేలు ప్రాణం పోసుకున్నాయి. ఎండిన చెరువుల్లో నీళ్ళు నిండాయి. ఇట్లా, 'చల్లని ధర్మరాజు చల్లని కాలాన్ని పట్టుకొని నక్షత్ర పట్టణం (విరాటనగరం) వస్తున్నాడు' అంటూ వర్ణిస్తారు. ఇట్లా ఆ నగరంలో అన్ని శుభసూచకాలే కనిపించేసరికి అక్కడి జనం, ఏ దేవుడు మా ఊరికొస్తున్నడో! లేక ధర్మరాజే మా ఊరికి వస్తున్నాడో! అనుకొని ఆ మహాపురుషుడిని ఆహ్వానించడం కోసం ఊరినంతా అలంకరిస్తారంట. ఇంత పెద్ద కల్పన ప్రాచీన సాహిత్యంలో కూడా కనిపిస్తుందో లేదో! సందర్భోచితంగా చేసిన ఈ వర్ణన ధర్మరాజు గొప్పదనాన్ని తెలుప డానికి ఎంతగానో ఉపయోగపడ్తుంది.

అట్లే ద్రౌపది సైరంధ్రి వేషంలో వెళ్తుంటే చేసిన వర్ణన ఆమె కష్టాలను స్ఫురణకు తెస్తుంది. ఆమె ఆ రాజభవనంలోకి, అరణ్యాలు దాటుకుంటూ, ప్రవాహాలు దాటుకుంటూ వెళ్ళిందంట! ఈ వర్ణన పాత్ర మానసిక ప్రవృత్తిని అనుభూతం చేస్తుంది. ఈ పర్వంలో ప్రధానమైనది కీచకవధనే. దానికి కారణం ద్రౌపదే. అందువల్ల ద్రౌపది ప్రవేశాన్ని కష్టాల వాతావరణంగా చిత్రించారు.

**11. హాస్య ప్రాధాన్యత**

నారదుడు కష్టపడి కీచకున్ని అక్క దగ్గరికి వెళ్ళేటట్లు చేస్తే, తీరా అతడు బయలుదేరే ముందు అన్నీ దుశ్శకునాలే ఎదురౌతాయి. స్నానం చేసిన తర్వాత పొడి వస్త్రం కట్టుకోబోతే అది జారి కింద పడింది. బొట్టు పెట్టుకుందామని సీస తీస్తే జారి కింద పడింది. బువ్వ తిందామని చూస్తే చేతిలోని ముద్ద కింద పడింది. కిరీటం పెట్టుకొని బయటికి వస్తుంటే దర్వాజ తగిలి కింద పడింది. తీరా బయటికి వచ్చాక నల్లపిల్లి ఎదురైంది. ఇన్ని దుశ్శకునాలు ఎదురైనందున 'నేను పోనంటే పోను' అని భీష్మించుకొని కూర్చుంటాడు కీచకుడు. అప్పుడు నారదుడు ఆ శకునాలన్నీ మంచివేనని రకరకాల హేతువులు చెప్పి ఒప్పిస్తాడు. ఈ సంవాదం హాస్యపూర్వకంగా ఉండి ప్రేక్షకులను నవ్విస్తుంది.

**12. కథలో మార్పు**

లిఖిత భారతంలో, కీచకుని మోండితనానికి తట్టుకోలేక సుధేష్ణనే ద్రౌపదిని అతని ఇంటికి పంపుతుంది. కాకిపడిగెల కళాకారుల కథలో కీచకుని ఇంటికి సైరంధ్రి వెళ్ళదు. కీచకుడే సైరంధ్రి దగ్గరికి వెళ్తాడు. కథలో ఈ మార్పు చేయడం కోసం ముందే ఒక సూచన చేస్తారు కాకిపడిగెల కళాకారులు. ద్రౌపది, సైరంధ్రి వేషంలో సుధేష్ణ ఇంట్లో దాసిగా కొలువు కుదిరేటప్పుడు **"నేను ఏ పని పడితే ఆ పని చేయను. ఎవరైనా శుభలేఖ రాసి, గిది తీస్కపోయి గా ఊరికాడ ఇచ్చిరమ్మంటే వెళ్ళేదాన్నికాదు. నేను పరమ బుద్ధిమంతురాలిని. నీ వద్ద నేనున్నని వేరే ఇంటికి పొమ్మంటే పోను"** అని కచ్చితమైన నిబంధన పెడ్తుంది. ఈ విషయం ఇక్కడ చెప్పడం వల్ల తర్వాతి కథను మార్చి కీచకుడే ద్రౌపది దగ్గరికి వచ్చేటట్లు చేయడానికి తగిన కారణం కల్పించబడింది.

ఇట్ల కాకిపడగెల కళాకారులు చెప్పే ఏ కథను పరిశీలించినా తమవైన కొన్ని ప్రత్యేకతలతో ప్రేక్షకులను అలరిస్తూ రసవంతంగా కథనాన్ని నడిపిస్తారని రుజువు చేయవచ్చు.

**ఆధార గ్రంథాలు**

1. తెలుగులో కుల పురాణాలు ఆశ్రిత వ్యవస్థ
   -ప్రొ.పులికొండ సుబ్బాచారి
2. కాకిపడిగెల పాండవుల కథలు - ప్రొ.ననుమాస స్వామి
3. తెలుగువారి జానపద కళారూపాలు
   - డా.మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
4. తెలుగు జానపద సాహిత్యం - పురాగాథలు
   - డా.రావి ప్రేమలత
5. పటం కథలు - కథకులు - డా. గడ్డం వెంకన్న

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

బండారం కథలు -10

# చెడ్డ గడియ

**డా. నందిని సిధారెడ్డి,** ఫోన్ : 9440 381148



జయమ్మ మరణవార్త విని ఆ వాడంతా ఆశ్చర్యపోయింది. అంతగా జబ్బు పడిందీ లేదు. రోజుల తరబడి పడుకున్నదీ లేదు. ఉన్నట్టుండి ఎట్లా చనిపోయిందో ఎవరికీ అంతు బట్టలేదు. ఎప్పుడూ ఎంతో హుషారుగా ఉండే జయమ్మ అందరినీ ఆప్యాయంగా పలకరించేది. ఎవరింట్లో పని ఒత్తిడి ఉన్నా తను వెళ్ళి అడగకుండానే ఆ పనిలో సాయం చేసేది. ఇరుగుపొరుగువాళ్ల మంచీ చెడ్డా వినేది. వాళ్ల కష్టాలు విన్నప్పుడు కన్నీళ్లు పెట్టుకునేది. వాళ్ల సంతోషం చూసి మురిసిపొయ్యేది. కొన్ని కొన్నిసార్లు కొరతపడిన వస్తువులు, పదార్థాలు సర్ది తృప్తిపడేది.

జయమ్మ నడీడు మనిషి. కొంచెం నల్లగా ఉన్నా అందంగానే ఉండేది. ఇంటిపనులూ, పొలం పనులూ ఏమాత్రం అలసట పడకుండా పూర్తిచేయటం ఆమెకిష్టం. అత్తామామల నెన్నడూ ఒక్కమాట అని ఎరుగదు. వాళ్లేమన్న నోరు జారినా మౌనంగా భరించేది. భర్త రాజిరెడ్డి టీచరు. ఉద్యోగానికి వెళ్లటానికి ఏ సమయానికి ఏ ఏర్పాట్లు చూడాలో పొందికగా, ఓపిగ్గా సమకూర్చేది. గట్టిగా ఎదురుపడి మాట్లాడింది కూడా ఉండదు. అది ఊరు గనుక అనురాగం ప్రదర్శించటానికి అనేక హద్దులుండేవి. నిదానంగా భర్త కళ్లలో కళ్లు పెట్టో, ముఖంలో ముఖం పెట్లో చూసే అవకాశమూ లేదు. భర్తకు ఇద్దరు తమ్ములు. మరుదలు అవసరాలు గమనించటంలో వెనుకాడిన సందర్భమే లేదు. చిన్నమరిది కన్నారెడ్డిని కన్నబిడ్డలా చూసుకునేది. గుట్టుచప్పుడు కాకుండా ఇంటిని నడుపుకొస్తున్న జయమ్మంటే ఆ ఊర్లో అందరికీ ఇష్టమే.

ఇళ్లలో తాము చేస్తున్న పనులు విడిచిపెట్టి జయమ్మను చూడటానికి రాసాగారు. దర్వాజ పక్కన అరుగు మీద గడ్డి పరిచి, బొంత వేసి, జయమ్మ శవాన్ని ఉంచారు. పైన నిండా షోలాపూర్ శద్దర్ కప్పారు. ఒకటి రెండి ఈగలు ముసురుతున్నాయి. తలాపున కుందెన... కుందెనలో దీపం. జయమ్మ ప్రశాంతంగా నిదుర పోతున్నట్టే ఉంది గానీ, చనిపోయినట్టు లేదు. ఆమె ఇద్దరు పిల్లలు ఏడుస్తూ దీనంగా కూచుని అమ్మను కదుపుతున్నారు. ఇంట్లో అందరి ముఖాల్లో విషాదం గోచరిస్తున్నది.

వచ్చినవాళ్లు జయమ్మ మంచితనాన్ని గుర్తు చేసుకొంటూ కళ్ళకు నీళ్ళు పెట్టుకుంటున్నారు. కొంగు అడ్డం పెట్టుకొని అయ్యో పాపం అంటున్నారు. వచ్చేవాళ్లు, పొయ్యేవాళ్లు ఇంటినిండా కమ్ముకోవటం వల్ల గాలి ఆడటం లేదు. చిన్నమరిది గుండెల్లో దు:ఖం ఆగటంలేదు.

జయమ్మ తల్లిదండ్రులిద్దరూ చనిపోయి చాలాకాలమైంది. అన్న, మరికొందరు దగ్గరి చుట్టాలు రాగానే అంత్యక్రియలు ప్రారంభమయ్యాయి. ఐదారుగురు ఆడవాళ్లు పాతచీర చాటు పట్టి జయమ్మకు చివరిస్నానం చేయించారు. కొత్త బట్టలు కట్టారు. చుట్టాలు జయమ్మను పడుకోబెట్టారు మరుదులు, దగ్గరి చుట్టాలు పాడె లేపారు. అంతగా ఏమీ తెలియని జయమ్మ కొడుకు చేత కుండ పట్టించారు. డప్పు చప్పుళ్ళ మధ్య దరువు ఆటల మధ్యా జయమ్మ శవయాత్ర ఘనంగానే జరిగింది. ఆడవాళ్లు, మగవాళ్లు, వృద్ధులు, పిల్లలు సహా ఊరంతా కదిలి జయమ్మను సాగనంపారు. కాష్టం కాలుతుంటే వాతావరణమంతా శోకం ఆవరించింది.

చీకటి పడే సమయానికి అక్కడక్కడా గుసగుసలు మొదలైనాయి. జయమ్మ ఎట్లా చనిపోయింది. ఆ వాడ ఈ వాడ సందుల్లో కూమలల్లో ప్రశ్నలు, ముచ్చట్లు. 'చనిపోయిన తర్వాత ఎందుకీ పనికిరాని ముచ్చట్లు? అన్నదో పెద్దవ్వ. 'మనం ఊకోంగనే లోకం ఊకోవన్నా ఎవల నోరు ఎవలు ఆపుతరు' అన్నది ఇంకొకామె. "అత్త కోడలు మీద బంగారం దొంగతనం పెట్టిందట. జయమ్మ లోపల్లోపల కుమిలి కుమిలి పొయ్యిందట. వారం నుంచి కొట్లాటేనట. బంగారం తెస్తెనే ఇంట్ల ఉండాలె. లేకపోతె లేదని సక్తు చేసిందట. ఏం జెయ్యాల్నో రెండు తులాల బంగారం ఎట్ల తేవాల్నో, ఎవలకు జెప్పుకొనుడు ఇష్టం లేక ఉరిపెట్టుకున్నదట" ఒకామె తనకంతా తెలుసున్నట్టు చెప్పుకొచ్చింది. "నువ్వు నోరు మూసుకో. తెలువంది తెలిసినట్టు చెప్పితెట్లనే" అన్నది పక్కామె. అట్లా గుంపుకో గుసగుస నడుస్తున్నది.

"గట్లకాదే. జయమ్మ సెరిసగం రాత్రి లేచి బయటికి పోతుండెనట. బయటికి పోతున్నదేమోనని కొన్నిరోజులు ఊకున్నరు. తర్వాత దినాం పోతుంటె అనుమానం వొచ్చింది. భర్త మెల్లగా చప్పుడు కాకుంట పొయ్యి చూసిండు. జయమ్మ సావుకారోల్ల పెరట్లకు పోయింది. సావుకారి అంత రాత్రిల వొచ్చిండట. వాళ్లిద్దరు కల్సుకున్నప్పుడే బొగడు రాజిరెడ్డి పొయ్యి పట్టుకున్నడట. జయమ్మను గుంజుకొచ్చి, గుంజకు కట్టేసి కొట్టింగ్రడట. తెల్లారి ఎవలన్న చూస్తరని అగ్రలేసింగ్రడట. అత్త, మరిది, భర్త ముగ్గురు వారం నుంచి కొట్టుడేనట. ఎట్ల బతుకుతదిగ. వాళ్లే సంపింగ్రు. గుమాను రాకుంట నడిపిచ్చింగ్రు" ఇంకొకామె ఇంకొక మచ్చట తీసుకొచ్చింది. "ఇగ సప్పుడు జెయ్యకు. ఎవలన్న ఇంటె నీ మీదికొస్తది. ఎవలు యాడవోతె మనకెందుకు పా".

రకరకాలుగా అమ్మలక్కల ముచ్చట్లు సాగుతున్నాయి. కొందరు మగవాళ్లు కూడా గుసగుసలు తప్పించుకోలేకపోయారు. ఎవరికి తోచింది వారు, ఎవరికి వినిపించింది వారు మరికొందరితో పంచు కుంటుంటే రాత్రి గడుస్తున్నది. తిని ఒకచోట చేరి బీడీలు తాగుతున్న యువకుల గుంపు మరో విధంగా ముచ్చటించుకుంటున్నారు.

"పాపయ్య లేడా. వాడు రాజిరెడ్డింటి బట్టలుతికేది. మొన్న వోటాలు మారినప్పుడు పాపయ్య ఇట్లు మారిండు. బట్టలుతికి బతుకుడు ఇష్టం లేక రెండెకురాల జాగ సొల్లల్ల కొనుకున్నడు. అది పొయ్యి పొయ్యి రాజిరెడ్డి గుడ్డం పక్కన్నే. ఆడ వొచ్చిందంట పంచాయితి. మొన్నటిదాంక బట్టలుతికినోడు పక్కన ఎవుసం పెట్టేటాల్లకు కాపోల్లకు నచ్చలేదు. ఆయనింత టీచరాయె. జర ఉంటది గద. గట్టుకాడి లొల్లి. జర జర ముదిరిందట. పాపయ్యకు జరన్ని మంత్రాలొస్తయిగద. జయమ్మ మీద ఊదిండు. ఒకట్రెండు సార్లు జయమ్మ సేను పనికి పోయినపడు మంత్రిచ్చిన నిమ్మకాయలు, జీడిగింజలు, గవ్వలు కనబడ్డయట. ఆ ముచ్చట రాజిరెడ్డికి చెప్పేనట. కన్నారెడ్డి ఊగిపోయెన. ఇది ఎవలకు చెప్పరాదు. ఇనరాదు. పాపయ్యగాడు జయమ్మకు మంత్రాలు ఊది శాతబడి చేసిండని, మంత్రాల దెబ్బకీ జయమ్మకు జరం పట్టుకున్నదట. ఆడికి ఇంకెవనికో మొన్నరాత్రి జూపెట్టింగ్రడట. కని, తక్కువ గాలే. భయమో, బద్దోగని జయమ్మ చచ్చిపొయ్యింది.

మూడోరోజు. పిట్టకు పెడితే పిట్ట ముట్టలేదు. పిల్లల ఏడుపు ఏ దేవునికీ ముట్టలేదు. జయమ్మ ఇంట్లో వాళ్ల ముఖాల్లో విషాదం నల్లగా పేరుకున్నది. రాజిరెడ్డి జయమ్మ వియోగంలోంచి కోలుకోవ టం లేదు. కన్నారెడ్డి లోపల తెలియని కోపమేదో మరుగుతున్నది. చుట్టాలు, స్నేహితులు ఊరడిస్తున్నా ఆ ఇల్ల కుదుట పడటం లేదు. వదినపట్ల అభిమానం కన్నారెడ్డిని నిలువనీయటం లేదు. పగలయినా, రేయయినా వదినే కదులుతున్నది.

కన్నారెడ్డి అందరితో కలుపుగోలుగా ఉంటాడు. తను తరచుగా ప్రయోగించే ఛలోక్తులకు స్నేహితులంతా మురసిపోతుంటారు. తన ఈడువాళ్లు తన వాగవాళ్లు చాలామంది తనతో సరదాగా ఉంటారు. మూడోరోజు బంధువులు కావలసినవాళ్లు దావత్ చేశారు. కన్నారెడ్డికే కాదు. తనతో కూచుని తాగినవాళ్లందరికీ కాస్త ఎక్కువే అయింది. గుంపు తరుగుతున్నట్టు అనిపించినా తిరిగి తిరిగి పెరుగుతూనే ఉన్నది. రాత్రి మరింత ముదిరేదాకా మత్తుతో మంతనాలతో గడిచింది.

పొద్దు పెరుగుతున్నది. అనుమాండ్ల దగ్గర వాతావరణం అనుమానంగా కనిపిస్తున్నది. ఊరు మసలుతున్నది. ఇంటిముందు అడ్డంగా వేసిన రాతికని మీద కూచుని ఆలోచిస్తున్నాడు పాపయ్య. చలి చలిగా అనిపిస్తున్నది. ఎండకు కూచున్నా సుస్తుగా ఉన్నది. తలపోటు క్షణక్షణానికి పెరుగుతూ ఇబ్బంది పెడుతున్నది.

ఐదారుగురు యువకులు అకస్మాత్తుగా పాపయ్య మీదికొచ్చారు. కూచున్నవాన్ని కూచున్నట్టే ఎత్తిపడేశారు. 'అమ్మా' అని అరిచాడు. పొయ్యి దగ్గర్నుంచి ఉరికొచ్చింది పాపయ్య భార్య. 'అయ్యా మా కాళ్ళు మొక్కుత. ఆయన్నేమనకుండ్రి. జరమొచ్చి శాత గాకుంటున్నడు. రెండ్రోజుల నుంచి తింటలేడు. నోట్ల నీళ్లు వోస్తలేడు. 'ఏమనకుండ్రి. బాంచెన్' అంటూ బతిమిలాడుతూ కాళ్లు మొక్కబోయింది. ఇద్దరు ఆమెను పట్టుకొని లాగిపడేశారు. 'అనుమాండ్ల కాడికి నడువు బాడుకావ్. ఆడ మాట్లాడుదాం' అనుకుంటూ పాపయ్యను ముందుకు దొబ్బారు. అటు పడిపోయాడు. "ఏందయ్య, నాకూ మీతోనేం పంచాయతయ్య". 'ఏందో ఆడనే చెప్పుదువు పా' రెట్టపట్టి ఈడ్చారు. బనీను చిరిగింది.

"నావోల్లు నల్గురు రానీ, వాళ్లను తోలుకొని వొస్తపాండ్రి"

"నీ పెండ్లాం దోలుకొస్తది. పా, నువ్వయితె నడువు. నువ్వు జేసిన పనికి ఇంక యిశారం జెయ్యాల్నా". "నా తప్పేందో జెప్పుకుంట ఈ జులుమేందయ్య". "ఇగ మాటలొద్దుపా" అనుకుంటూ ముందుకు దొబ్బుతూ, లాగుతూ నడుస్తున్నారు. అట్లా పాపయ్యను బజారులోంచి లాక్కొస్తుంటే ఎవరూ అడ్డుకోలేదు. ఆడవాళ్లు 'అయ్యో' అంటున్నా అడ్డుపడలేదు. ఆ వాడ... మరో వాడ... పాపయ్య అతన్ని తోసుకుంటూ వాళ్లు.... వాళ్ల వెనుక మొత్తుకుంటూ పాపయ్య భార్య. ఆ వెనుక ఏడుస్తూ చంటిపిల్లాడు.....

ఊర్లో జరిగే అనేక ఉత్సవాలకు, సంఘటనలకు అనుమాండ్లు సాక్షి. పెద్దరాయి చెట్టు. ఏండ్ల వయసు మోస్తున్నట్టు. కింద హనుమంతుని విగ్రహం. కొంచెం చందనం మరికొంచెం కొంగలరెట్ట, చిత్రవిచిత్రంగా వుంది. విశాలమైన అరుగు. అరుగును ఆనుకొని మరో అరుగు. అప్పటికే జనం గుమికూడి ఉన్నారు. పిల్లలు వొచ్చి అరుగుమీద చేరారు. యువకులు ఆవేశంతో దడికట్టి ఉన్నారు. ఆడవాళ్లు గబగబ నడుస్తూ చేరుకుంటున్నారు. కర్రసాయంతో వృద్ధులు, పెద్దలు చేరుకున్నారు.

పాపయ్యను చూడగానే కన్నారెడ్డి ఊగిపోయాడు. ఎగిరెగిరి తన్నాడు. పాపయ్య బక్కగా, ఉన్న బలం కోల్పోయి పడిపోయాడు. "నా తప్పు జెప్పకుంట ఈ తన్నుడేందయ్యా". పాపయ్య భార్య కన్నారెడ్డ కాళ్ళు పట్టుకున్నది. "సచ్చిపోతడు పటేలా – పానం బాగలేదు". "సచ్చిపోని, ఉండి ఇంక ఎందర్ని సంపుతడు" "నేను జంపిన్నా... ఎవల జంపిన. ఎవలమీదయినా నాకేం పగ". 'సంపెతందుకు ఆయన దగ్గరేమున్నదయ్యా. బాంచెన్ దయ తల్సుండ్రి... ఉత్తపున్యానికె జస్తె మేమాగమైతం. వరుసగా అందరి కాళ్లు పట్టుకుంటున్నది. ఎవరూ కనికరించలేదు. "ఏం గావాల్నె ఇంకా – మంత్రాలు నేర్సిండు గద. మంత్రం జేసి మందిని జంపితె చూసుకుంటూ ఉండాల్నా. దొంగనా కొడుకు సస్తెనే ఊరుకు మంచిది".

"ఏ గుళ్లె జొర్లుమంటె ఆ గుళ్లె జొస్త. ఇదే అనుమాండ్ల కాడ ఏ ప్రమాణం జెయ్యమంట ఆ ప్రమాణం జేస్త"

"నీ ప్రమాణం ఎవలకు గావాల్రా. జయమ్మను ఎందుకు జంపినవు?" అడిగాడో పెద్ద మనిషి. "ఆమెకు నాకేల పగనయ్య. ఆమెనెందుకు జంపుత". "అంటె పగుంటె జంపుతవన్నట్టే గద".

"ఇంక జూసుడేందిరా. ఈ అదుగుడేంది? వీడెట్ల ఆమెను జంపిండో వీన్ని అట్లనే జంపాలె" అసలు విషయం చెప్పాడు కన్నారెడ్డి దోస్తు.

"తప్పయితది బిడ్డా. వానికేమన్నయి వాడు జస్తె ఊరు పేరు కరావైతది. చంపినోళ్లకు సజా అయితది. ఏదన్న ఉంటె మాట్లాడుదాం. సర్ది చెప్పబోయాడు పెద్దమనిషి.

"అయ్యా, ఆయన అనుభవంతో జెప్తున్నాడు. ఆ పటేలు మాటన్నా ఇనుండ్రి" ఒక ముసలామె అన్నది.

"ఇంక మాటలేంది? ముచ్చటేంది? వీడుంటె ఎందరి పానం తీస్తడో ఉంచొద్దు. ఊరు నాష్నమైతది...."

'ఎయ్యండ్రి' అన్నారెవరో గుంపులోంచి

అంతే. వరుస పిడిగుద్దులు. పాపయ్య అశక్తుడయ్యాడు. పాపయ్య భార్యను నలుగురు యువకులు దూరంగా లాక్కపోయారు. ఆవేశంతో యువకులు ఇష్టమున్నట్టు తంతున్నారు. కొడుతున్నారు. పెద్దమనిషి అడ్డురాబోతే ఆయనను ఈడ్చి పడేశారు.

"అరేయ్. వాడు మామూలోడు కాదు. మంత్రాలు జదివితె మనమెవలమో జస్తం. వాడు అట్ల సావడు. వాని బలం పండ్లల్ల ఉంటది. పండ్లు పీకేస్తె మంత్రాలు పనిజెయ్యయి".

పండ్లు రాలగొట్టెటందుకు రాయి తెచ్చి కొట్టారు. రెండు పండ్లు విరిగిపోయాయి. నెత్తురు కారుతున్నది. ఆడవాళ్లు ఏడువబోయి ఆపుకున్నారు. "విరిగిన పండ్లతో చదివినా మంత్రం పారుతది. పటకారు తెచ్చి పీకెయ్యండ్రి పండ్లు. అట్లయితె మంత్రం పారది".

గణపతి వెళ్లి పటకారు తెచ్చాడు. పటకారుతో పట్టి పీకాడు. రాలేదు. మరో పన్ను విరిగింది. శానం, సుత్తె తెచ్చి విరగ్గొట్టుకుంటూ పండ్లు పీకుతున్నాడు. గణపతికి పూనకం వచ్చింది. పాపయ్యకు స్పృహ పోయింది. అవస్థ భరించలేకపోతున్నాడు. ఎవరు ఎక్కడ కొడుతున్నారో తెలువదు. ఏం కానున్నదో వాళ్లకు తెలువదు. మంత్రాలు ఉంటాయో ఉండవో తెలియదు. పారుతాయో పారవో తెలువదు. ఒక్కటే పాపయ్య మంత్రగాడు ఊర్లో ఉండొద్దు.

పాపయ్య ఆయాసం పట్టలేక కుడిచేయి లేవనెత్తాడు. 'అగో చూసిండ్రా. చెయ్యి పైకెత్తి ఏదో అన్నాడు. అక్కడ పశువు చచ్చి పోయింది. వాడట్లా చెయ్యెత్తి ఇంకేదో అంటే మనండ్ల ఎవరో ఒకలు జస్తరు. చేతులు ఆడించుకుంట ఇరిసెయ్యండ్రి" పటకారు చేతులకు పట్టి లాగారు. అటు విరిచి ఇటు విరిచి చేతులు పగడొట్టారు. భయపడుతున్నారు. భయపెడుతున్నారు.

"నాలికె. ... నాలికె తెరుస్తండు. నాలికె తింపుతండు"

రంపం తెచ్చి నాలుక కోశారు. 'కండ్లు. అగొ చూస్తండు. కత్తితో కనుగుడ్లు పెరికేశారు. 'కేసయితదుర్రా' అన్నాడు పెద్దమనిషి. "కానీ జేళ్ల గూసుంటం వీని పీడ పోవాలె".

ఏమన్యాయం. ఎవలు మాట్లాడరు. గట్ల జంపుతుంటె ఎవరు నోరు తెరువరు" ఒకామె

"ఆయనె మనిషి గాద. గోద కంటె అధ్వాన్నం జేస్తండు?" ఇంకొకామె. ఎవరి మాటలు ఎవరికి వినిపించటం లేదు. ఆవేశంలో ఉన్నవాళ్లు ఎవరూ పట్టించుకోదల్చుకోలేదు.

"ఊరికేదో మూడింది. గిట్లెట్ల. వీళ్లకేందో పొయ్యే కాలం. వీళ్లకు మూడింది"

పాపయ్య నిర్జీవంగా పడి ఉన్నాడు. నెత్తుటి మడుగు చూస్తూ అనుమాండ్లు నివ్వెరపోయాడు.

ఊరు మాట్లాడబోయి మాట్లాడలేక, పడలేక, చూడలేక మూగవోయింది. పోలీసులొస్తారు. వొచ్చారు. ఐదుగురు ఆవేశపరుల్ని పట్టుకపోయారు. జయమ్మ చనిపోతే బాధ పడ్డది ఊరు, పాపయ్యను చంపుతుంటే పాపమన్నది ఊరు. యువకుల్ని పట్టుకపోతుంటే కతపడ్డది ఊరే.

జయమ్మ ఎట్లా చనిపోయిందో, పాపయ్యనెందుకు చంపారో, వాళ్లు జైలుకెళ్లి ఏం సాధించారో తెలియక, తెలుసుకోలేక, ఊరు పట్టుకున్నది. గడియ. ఒకో గడియ.

## సాధన పంచకమ్

**వాక్యార్థశ్చ విచార్యతాం శృతిశిర: పక్షః సమాశ్రీయతాం**
**దుస్తర్కా త్సువిరమ్యతాం శృతిమతస్తర్కోకను సంధీయతామ్।**
**బ్రహ్మైవాస్మి విభావ్యతాం అహరహర్గర్వ: పరిత్యజ్యతాం**
**దేహేఽహమ్మతి రుజ్ఝ్యతాం బుధజనైర్వాద: పరిత్యజ్యతామ్॥**

**తాత్పర్యం :** 1. వేదాంత వాక్యములను చక్కగా విచారణ చేయవలెను. 2. వేదాంతము లేక ఉపనిషత్తులు నిర్ణయించిన సిద్ధాంతమునే ఆశ్రయింపవలెను. 3. చెడు తర్కమును విడనాడ వలెను. 4. వేద సమ్మతమైన తర్కమునే (యుక్తినే) అనుసరిపవలెను. 5. నేను బ్రహ్మమునే ఐ ఉన్నాను అని చక్కగా భావన చేయవలెను. 6. ఎప్పటికప్పుడు గర్వమును త్యజింపవలెను. 7. దేహమే నేను అనెడు భావమును విడిచిపెట్టవలెను. 8. బుధజనులతో వాదించుటను మానివేయవలెను.

### వివరణ

**6. అహరహః గర్వః పరిత్యజ్యతామ్ –**

రేయింబవళ్ళు అనుక్షణము గర్వమును విడిచిపెట్టవలెను. గర్వము – అహంకారము చాలా చెడ్డది. ఎదుటివారికంటే నేను ఎక్కువ అని, వారికి లేనివి నాకు ఉన్నవి అని భావించి నప్పుడే మనిషిలో అహంకారం తలెత్తుతూ ఉంటుంది. అందుకే నాకు ధనము, జనము, యౌవనము ఉందని విర్రవీగకు. కాలం ఒక్క నిమిషంలో ఈ సర్వాన్ని హరించివేస్తుంది సుమా! మాయా మయమైన ఈ జగత్తు నుండి విడివడిపోయి బ్రహ్మపదమును పొంది తరించుమని భజగోవింద స్తోత్రంలో శ్రీ శంకర భగవత్పాదులు ఈ విధంగా బోధించారు.

**మా కురు ధనజన యౌవన గర్వం హరతి నిమేషాత్ కాలః సర్వమ్**
**మాయామయమిదం అఖిలం హిత్వా బ్రహ్మపదం త్వం ప్రవిశవిదిత్వా ॥ భజగోవిందం॥**

నేను అనే అహంకారం వల్ల నాది అనే భావన కలుగుతుంది. నాది అనేదే లేని దుఃఖాన్ని తెచ్చిపెడుతుంది. కావున రేయిం బవళ్ళు అనుక్షణము తనలో గర్వం – అహంకారం తలెత్తకుండా జాగ్రత పడుతూ దానిని ద్రుంచి వేయవలెను.

## సత్సంగం

### అన్వేషణ



కుండలిని సుషుమ్న ద్వారా పైకి ఎక్కేట్టు చేయడానికి ప్రాణాయామాన్ని ఉపయోగిస్తాడు యోగి, జ్ఞానికి గల మార్గం, అన్వేషణే. ఈ పద్ధతి వల్ల ఆ మనస్సు ఆత్మలో లీనమైనప్పుడు కుండలిని, లేక శక్తి తనంతట తానే లేస్తుంది – అది ఆత్మకి భిన్నం కాదు కదా!

కుండలిని సహస్రారంలోకి పంపటానికి యోగులు ఎంతో ప్రాధాన్యమిస్తారు. ప్రాణం శరీరంలోకి ఊర్ధ్వ భాగం ద్వారా చొచ్చుకుంటుందని శాస్త్ర వాక్యం. దాని ననుసరించి వియోగం అట్లాగే ఏర్పడిందనీ, యోగాన్ని (కలయికని) సాధించాలంటే దానికి వ్యతిరేక మార్గం కావాలని అంటారు. అందువల్ల, యోగాభ్యాసంవల్ల ప్రాణాలనన్నిటినీ కూడగట్టుకొని యోగసిద్ధికి ఊర్ధ్వభాగానికి రావాలంటారు. ఇక, జ్ఞాని చెప్పేది ఇది; యోగి దృష్టిలో దేహం ఆత్మకి భిన్నం. ఈ విభేదాన్ని ఒప్పుకుంటే, సంయోగానికి యోగాభ్యాసం అవసరం అంటాడు యోగి.

దేహం మనస్సులో ఉంది – దానికి స్థావరం మెదడు. మెదడు పని చేయటం కూడ ఇంకెక్కడి నుంచో వచ్చే రశ్మి వల్లనేనని యోగులు కూడా ఒప్పుకుంటారు. జ్ఞాని ఏమంటాడంటే, "ఆ రశ్మి ఏదో ఒక మూలాన్నుంచే వచ్చి యుండాలి, కాబట్టి, ఆ మూలానికే నేరుగా వెళ్ళాలి, వేరే ప్రదేశాలకి కాదు, ఆ మూలమే హృదయం, "ఆత్మ" అని. ఆత్మ బయట ఎక్కడ నుంచో వచ్చి దేహంలో ఊర్ధ్వభాగం ద్వారా చొరబడదు. అది ఎల్లప్పుడూ కాంతివంతమే, స్థిరమే, నిశ్చలమే. దానికెప్పుడూ పరివర్తనమంటూ లేదు. ఏ మార్పూ ఉండని ఆత్మనుండే ఉదయించే శరీరానికీ, మనస్సుకీ మనిషి తనని తాను పరిమితం చేసుకుంటాడు. కాని, ఈ రెంటికీ మార్పు ఎప్పుడూ ఉంటుంది. ఈ తప్పు తాదాత్మ్యాన్ని వదులుకోవాలి. అది జరిగితే ద్వైతమంటూ లేని సత్యం, ప్రకాశమానమైన ఆత్మ గోచరిస్తుంది. సహస్రార మీద ఏకాగ్రత పెట్టుకుంటే తప్పకుండా సమాధి వస్తుంది.



అయినా, వాసనలు ధ్వంసం కావు. అందువల్లనే, యోగి ఆ సమాధి నుండి మేల్కొని తీరుతాడు. అతనికి బంధాల నుండి విముక్తి లభించలేదు. కనుక! సమాధి అవస్థలోని ప్రశాంతతని భంగపరచుకోకుండా ఉండటానికి అతను తన వాసనలను తుడిచి పెట్టేసుకోవాలి. అందువల్ల అతను సహస్రార నుండి జీవనాడి ద్వారా హృదయంలోకి వెళ్తాడు. అంటే సుషుమ్నకి ఒక వంపు ఉందన్నమాట. మూలాధార చక్రం వద్ద ప్రారంభమై, సుషుమ్న ద్వారా, సహస్రార వరకూ ప్రాకి అక్కడ ఒక వంపు తిరిగి హృదయం లోకి దిగుతుంది. ఈ హృదయాన్ని యోగి చేరుకోగానే, సమాధి పూర్తవుతుంది. అంటే, ఆఖరి చక్రం – హృదయమన్న మాట.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# బాల సాహిత్యమే భవిష్యత్తుకు దస్తావేజు – డా. పత్తిపాక మోహన్

ఇంటర్వ్యూ ... డా॥ అట్టెం దత్తయ్య ... ఫోన్ . 9494715445

**బాల్యోత్తరదశ నుండి సాహిత్యం పట్ల, సమావేశాల పట్ల మక్కువను పెంచుకున్నవారు. సాహిత్యాన్నే ఉపాసిస్తూ, అధ్యయనం చేస్తూ, పరిశోధించనవారు. కష్టాలవైపున నిలబడి కవిత్వాన్ని రాసినవారు. సాహిత్యంలో గల అన్ని ప్రక్రియల అంచులుముట్టి, పిల్లల కారణంతో, పెద్దల ప్రేరణతో బాలసాహిత్యంలోకి ప్రవేశించినవారు. వృత్తిలో విశ్వసాహిత్యాన్ని, ప్రవృత్తిలో బాలసాహిత్యాన్ని అందిస్తూ, సృజిస్తూ ముందుకు సాగుతున్న వారి కృషికి కేంద్రసాహిత్య అకాడమీ 2022 సంవత్సరానికి గాను 'బాలల తాత బాపూజీ' పుస్తకానికి బాలసాహిత్య పురస్కారాన్ని ప్రకటించిన సందర్భంగా.... డా. పత్తిపాక మోహన్ గారితో డా. అట్టెం దత్తయ్య 'మూసీ' ముచ్చట.**



**1. అస్తిత్వవాద సాహిత్యంలో చాలా చురుకుగా రాసిన మీకు బాల సాహిత్యం వైపుకు వెళ్ళాలని ఎందుకు అనిపించింది.**

నేను పుట్టి పెరిగింది సంప్రదాయ చేనేత కుటుంబంలో. నేను చేనేత వృత్తిని చేయకపోయినా మా ఇంట్లోని పవర్‌లూం వృత్తి వ్యాపారం, మా ఖార్ఖానాలో పని చేసే కార్మికులతో స్నేహం, బాల్యం నుండి ఖార్ఖానాలోనే ఆడుకోవడం వంటివి నన్ను వృత్తికి దగ్గరగా చేశాయి. అట్లానే అందులోని సాధకబాధకాలు కూడా తెలిశాయి.

నేత వృత్తి కుటుంబ నేపథ్యంగా ఎదిగిన నేను మా సిరిసిల్ల, నా చిన్నతనంలో నేను చూసిన నేత కార్మికుల ఆత్మహత్యలు, చిన్నాభిన్నమైన బతుకులు నన్ను కదిలించాయి. మొదటగా 'ఆకలి చావుల స్టేట్‌మెంట్' పేరుతో నేత జీవితాలపై కవిత రాశాను. తరువాత అనేక సందర్భాల్లో నేత కార్మికులు, రైతులు, విశ్వకర్మలు, పాలమూరు వలస కూలీల గురించి రాశాను. ఒకానొక విషాద సందర్భంలో 'తెగినపోగు' పేరుతో చేనేత బతుకుల మీద దీర్ఘ కవిత రాశాను. విమర్శకులు దీనిని చేనేతల జీవితాల మీద వచ్చిన తొలి దీర్ఘకవిత అన్నారు. ఇలా నా వృత్తిని గురించి, వృతికార్మికుల గురించి రాయడంతో నన్ను అస్తిత్వవాద కవిగా పిలిచారు. తరువాత 'కఫన్' (శవంపైన కప్పే వస్త్రం) పేరుతో చేనేతలు, అందులోంచి ఎదిగిన వ్యక్తులు, వాళ్ళు గెలుచుకున్న జీవితాల గురించి నానీలు రాశాను. అప్పటి నుండి ఇప్పటి వరకు నా అస్తిత్వాన్ని రాసుకుంటూనే ఉన్నాను. ఇదేకాదు పార్లమెంట్‌లో ఒక ఎం.పి దక్షణ భారతీయుల రంగు గురించి కామెంట్ చేసినప్పుడు కూడా బలంగానే రాశాను.

ఇక బాల సాహిత్యం వైపుకు మళ్ళడం అంటారా, అది యాదృచ్ఛికమే అయినా అందుకు పునాదులు మాత్రం మా ఇంటి నుండే వచ్చాయి. 1997–98లో ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ (టి)లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో తెలుగు రెసిడెంట్ టీచర్‌గా ఉద్యోగం చేయడంవల్ల అది మరింత విస్తృతమైంది. అక్కడి అమాయక అడవి మల్లెల వంటి పిల్లలు అడిగే ప్రశ్నలు నన్ను ఆశ్చర్యపరిచేవి. అన్నీ తెలిసిన వాళ్ళకు బాలల కథల వంటివి తెలియదు. వాళ్ళకు సాహిత్యాన్ని, కథలను, కవిత్వాన్ని పరిచయం చేయాలన్న ఆలోచనతో కథలు, గేయాలు వినిపించే వాడిని. ఈ క్రమంలోనే వాళ్ళకు తెలుగు కవులను పరిచయం చేసేందుకు రోజుకొక కవిని గురించి రాసి వినిపించేది. ఒక సందర్భంలో ఈ విషయాన్ని బాల సాహితీవేత్త తిరునగరి వేదాంతసూరికి తెలపగా వాటిని దాదాపు మూడు సంవత్సరాలపాటు 'పిల్లల కోసం మన కవులు' పేరుతో వార్త దిన పత్రిక 'మొగ్గ'లో వేశారు. డా.సామల సదాశివ, దేవులపల్లి ప్రభాకరరావు, డా.నలిమెల భాస్కర్, రెడ్డి రాఘవయ్య, ద్వానా శాస్త్రి మొదలు అనేక మందికి నచ్చాయి. ఎన్నో ఉత్తరాలు వచ్చేవి. అందులోనూ బడి తమ్ముళ్ళ చెల్లెల ఉత్తరాలు మరింతగా నాకు స్ఫూర్తినిచ్చాయి. పిల్లలమర్రి పినవీరభద్రుని గురించి రాసినప్పుడు వాళ్ళ వంశీకుడు ప్రత్యేకంగా వచ్చి నన్ను కలిశాడు. తరువాత డా. సదాశివగారి ఆదేశంతో, వారిచ్చిన 'కితాబు' ముందుమాటగా పుస్తకంగా వేశాను. ఇదే సమయంలో నాతోపాటు ప్రముఖ విమర్శకుడు ఎం.నారాయణశర్మ కూడా పిల్లల కోసం రెండేండ్లు శతకాలు పరిచయం చేశాడు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాలో తెలుగు సంపాదక ఉద్యోగం నాకు మరింతగా దోహదపడింది. నిరంతరం పుస్తకాల మధ్య, పుస్తకాల కోసం ఉద్యోగం చేయడం, అందులో బాల సాహిత్యం ప్రధానంగా ఉండడం వంటివి ఇప్పటి ఈ ప్రతిష్టాత్మక బాల సాహిత్య పురస్కారం దాకా నన్ను నడిపించాయి.

**2. బాల సాహిత్యం రాయడానికి మీకు ప్రేరణ ఎవరు?**

మా బడికి విశాలాంధ్ర వారి వ్యాను తరచూ వచ్చేది. అందులో రూపాయికి, యాభై పైసలకు రష్యా రాదుగ, ప్రగతి ప్రచురణాలయాలు వేసిన పిల్లల పుస్తకాలు తెలుగులో ఉండేటివి. అవి కొనుక్కునేవాణ్ణి.

వీటితో పాటు అప్పటి ఇతర బాల సాహిత్యం ప్రభావం 1980ల నుండి నా మీద ఉంది. ఒక్క నామీదే కాదు మా పత్తిపాక పరివారం లోని ఇంచుమించు నా వయసు వారందరి మీదా ఉండేది. అందుకు అనేక కారణాలున్నాయి, నా విషయంలో మొదటిది, మా తాత తల్లి, మా ముత్తవ్వ పత్తిపాక నర్సవ్వ నన్ను తన ఒడిలో కూచోబెట్టుకుని ఎన్నో పాటలు పాడి వినిపించేది. అందులోనూ బతుకమ్మ పండుగ సమయంలో ఎన్నో పాటలు పాడేది. లయ నన్ను ఆకర్షించేది. రెండవది, మా పెద్దతాత పత్తిపాక విశ్వనాథం. మా ఇందిరక్క కోసం చందమామతో తెలుగులో ఆ సమయంలో వచ్చే దాదాపు అన్ని వార పత్రికలు, నవలలు తెప్పించేవాడు. వచ్చినరోజే వాటిని కుట్టించి బైండింగ్ చేయించేవాడు. నేను చదవడం నేర్చుకున్నప్పటి నుండి ఆ చందమామలన్నీ నా సొంతం అయ్యాయి. మూడవ ప్రభావం, పోలియో వల్ల నడవలేని మా ఇందిరక్క నవలలు, కథలు చదివి తన రాట్నం ముందు కూర్చునే మా పిల్లలందరికి చెప్పేది. నేనైతే ఎక్కువ సమయం అక్కడే గడిపేవాడిని. నాల్గవ కారణం, మా దేవునమ్మ అంటే మా తాత సోదరి జక్కని అన్నమ్మ. జీవితాన్ని పాండురంగ విఠలుని భజనలకు, మలయాల సద్గురు గీతాశ్రమ కృష్ణుని సేవకు అంకితం చేసింది. తను బాల్యం నుండి భక్తుల కథలు మా పిల్లలందరికి చెప్పేది. నాకు 'రామరామ శతకం' మొదలు అనేక శతకాల నుండి లెక్కలేనన్ని పద్యాలు నేర్పింది. దీనికి తోడు ఇంటి ముందు జరిగే గణపతి ఉత్సవాలు, సిరిసిల్లలో జరిగే పండుగలు, పీర్ల పండుగ, బతుకమ్మ పండుగ వంటివి వేసిన ప్రభావం కూడా ఉంది. ఇటీవల మా పిల్లలు వేసిన ప్రభావం తక్కువేమీ కాదు.

**3. బాల సాహిత్యంలో మీకు ఎప్పుడో రావాల్సిన అవార్డు ఆలస్యమైందని అంటున్నారు కొందరు.... మీరేమంటారు.**

అటువంటిదేమీ లేదు. అయితే గత అయిదు సంవత్సరాలుగా అన్ని వడపోతల్లోంచి ఫైనల్ లిస్టులోకి వచ్చిన వాటిలో నా పుస్తకాలు ఒకటో, రెండో తప్పకుండా ఉంటున్నాయి కాబట్టి నన్ను ప్రేమించే మిత్రులు లేదా నా బాల సాహిత్యం నచ్చిన మిత్రులు అభిమానంతో అలా అని ఉండొచ్చు. అకాడమి పురస్కారం ఎంపిక కొద్దిగా భిన్నమైంది. ఎంపికలోనూ తేడా ఉంటుంది. నూరు శాతం పారదర్శకంగా ఉంటుంది. వివిధ దశల్లో జరిగే వడపోతల్లో నిలబడి మన రచన చివరికి రావడం మామూలు విషయం కాదు. అయితే నా పేరు, రాయలసీమ మిత్రుడు ఎం.హరికిషన్ నాలుగైదుసార్లు రావడం వల్ల అలా అనుకొని ఉండొచ్చు.

**4. వృత్తి, ప్రవృత్తి రెండింటికి అనుబంధం ఉండడం వల్లనే మీరు చాలా పుస్తకాలు ప్రచురించ గలుగుతున్నారా.**

కొందరికి కొన్ని అవకాశాలు కలిసి వస్తాయి. నాకు అటువంటిదే నా ఉద్యోగం. వివిధ ప్రక్రియల్లో నా స్వీయ రచన, సంపాదకత్వం, అనువాదాలుగా ఇప్పటికి నా పేరు మీద చిన్నా, పెద్ద పుస్తకాలు, పిల్లల పుస్తకాలు అన్నీ కలిపి 72 వచ్చినయి. ఇందులో బాల సాహిత్యం మొదలు కవిత్వం వరకూ, విమర్శ మొదలు అనువాదాల వరకూ ఉన్నాయి. అంతేకాక గూడూరి సీతారాం కథలు మొదలుకుని, పిల్లలు రాసిన పుస్తకాల వరకు నేను సంపాదకులుగా తెచ్చినవీ ఉన్నాయి. మీరన్నట్లు వృత్తిరీత్యా నేషనల్ బుక్ ట్రస్ట్ కోసం అనువాదం చేసిన చిన్న చిన్న పుస్తకాలు 30 వరకు ఉన్నాయి. నా వృత్తి నాకు నిరంతరం ఇతర భారతీయ భాషాకారులతో కలిసి ఉండే, చదివే అవకాశం కల్పించింది. అదృష్టం అనే మాటను నమ్మను కానీ, నాకు అది అందివచ్చిన గొప్ప అవకాశం. నేను ఎన్.బి.టిలో చేరే కంటే ముందే మారసం ద్వారా నలభైకి పైగా నావి, ఇతరులవి పుస్తకాలు ప్రచురించినప్పటికీ నా ఉద్యోగం, దేశవిదేశాల్లో పుస్తక యాత్రలు, జర్మన్ బుక్ హౌజ్ వంటి సంస్థలు పుస్తక ప్రచురణ గురించి నిర్వహించిన కార్యశాలలు ఈ రంగంలో మరింత నన్ను నేనే మలచుకునేందుకు అవకాశం కల్పించాయి.

**5. మీ పెళ్ళికి కూడా పుస్తకం ముద్రించారట.**

అవును, మా సిరిసిల్ల మానేరు రచయితల సంఘం మిత్రులు నాకు, నా జీవన సహచరి సిరిసిల్ల చందనకు పెండ్లి కానుకగా 'పెళ్ళి పుస్తకం' పేరుతో పెద్దల ఆశీస్సులను అక్షరాశీస్సులుగా అందించారు. ఇందులో మహాకవి సినారె, ఆచార్య ఎన్.గోపి, డా.వేముగంటి, ఆచార్య కసిరెడ్డి, డా.రాళ్ళబండి మొదలుకుని నా చిన్ననాటి మిత్రులు, ప్రముఖ కవులు రాసిన అక్షరాశీస్సుల కవితలు ఉన్నాయి. దీనిని సిద్ధిపేటలో, పెళ్ళి మండపంలో ఆచార్య ఎన్.గోపి, డా. కాపు రాజయ్య, డా.వేముగంటి నరసింహాచార్యులు, బి.ఎస్.రాములు, గూడూరి సీతారాం, జూకంటి జగన్నాథం, డా.నలిమెల భాస్కర్, డా.నందిని సిధారెడ్డి, కనపర్తి రామచంద్రాచార్యులు సమక్షంలో మా పెళ్ళి పెద్ద, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సి. నారాయణ రెడ్డిగారు ఆవిష్కరించారు.

**6. మీ సృజనకు, మీ పరిశోధనకు ఏటువంటి సంబంధం ఉంది.**

నేను ప్రాయికంగా సృజనకారుణ్ణి. తరువాతే పరిశోధకుడిని. తొలి నుండి కవిత్వంతో పాటు విమర్శ, అనువాదాల వైపు నేను చూస్తూనే ఉన్నాను. 1997లోనే 'పిల్లల కోసం మన కవులు' పేరుతో తెలుగు కవుల గురించి రాసిన. తరువాత సాహిత్య వ్యాస సంపుటి 'కౌముది' తెచ్చిన. 1995లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ పూర్తి చేసి, 1997లో పిహెచ్.డిలో చేరిన. ఏదో ఒక కవినో, పుస్తకాన్నో కాకుండా ఏదైనా ప్రక్రియ పైన నిలిచిపోయేలా పరిశోధన చేయమని మహాకవి డాక్టర్ సి.నారాయణ రెడ్డి గారు సూచించడంతో, 'తెలుగులో గజల్ ప్రక్రియ-సమగ్ర పరిశీలన' అంశంపై ప్రస్తుత తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి, ఆచార్య తంగెడ కిషన్‌రావుగారి పర్యవేక్షణలో పూర్తిచేసి డాక్టరేటు పొందాను. పరిశోధన సమయంలో

నేను గజల్ ఛందస్సు గురించి మాత్రా ఛందస్సుతో పాటు ఇతరాలు ఎంతో ఆసక్తిగా చదివేవాణ్ణి. ఆ కొద్దిపాటి లయాత్మక జ్ఞానం, మిత్రులు ఎం. నారాయణశర్మ, తుమ్మూరి రాంమోహన్‌రావుల ప్రోత్సాహం గేయ రచనను మరింత సులభతరం చేశాయి. అదే ఇప్పుడు నేను బాల గేయాలు, గేయ కథలు రాయడానికి ఉపయోగపడుతోంది.

ఇప్పుడు సాహిత్య చరిత్రలో నమోదుకాని తెలంగాణ బాల సాహితీమూర్తుల సాహిత్యాన్ని సేకరిస్తున్నాను. అలా ఇప్పటికి ముప్పైరెండు మంది ఎక్కడా నమోదుకాని బాల సాహిత్యకారులను తెలంగాణ సోయితో పరిచయం చేశాను. ఇంకా పరిశోధన, విషయ సేకరణ జరుగుతోంది. భవిష్యత్తులో విస్మృతికి గురైన మరికొంత మంది తెలంగాణ బాల సాహిత్యకారులను తప్పక గుర్తిస్తాం.

**7. 'లాక్‌డౌన్' కవితా సంపుటి బాగా ప్రసిద్ధి పొందింది. దాని గురించి కొన్ని మాటలు చెప్పండి.**

మిత్రులతో కలిసి 'ఖడ్గధార', 'సముద్రం' వంటి సంకలనాలే కాక, 1993–96 మధ్యలో ఉస్మానియా తెలుగుశాఖ విద్యార్థుల కవితా సంకలనాలు 'కవితా పాంచజన్యం', 'తొలకరి చిత్రాలు' ప్రచురించాను. నా స్వీయ కవిత్వం 'బంతిపూలు' తెచ్చాను. తరువాత 'పచ్చబొట్టు' మొదలు 'లాక్‌డౌన్' వరకు కవిత్వ పుస్తకాలు తెచ్చిన.

అయితే, తొలి విడత లాక్‌డౌన్ సందర్భంగా రాసిన కవితలను 2020లో 'లాక్‌డౌన్' పేరుతో సంపుటిగా తెచ్చిన. ఇందులోని 'చెమట పాదాల నడక', 'లాక్‌డౌన్' కవితతో పాటు పోలీసులపై రాసిన కవితలు ఎక్కువగా పేరుతెచ్చి పెట్టాయి. ఈ సందర్భంగా వివిధ పత్రికల కోసం రాసిన కవితలు పలు సంకలనాల్లో కూడా అచ్చయ్యాయి. మన తరం చూసిన ఒక మహా విషాదాన్ని రేపటి తరం కోసం కవిత్వ రూపంలో డాక్యుమెంటుగా మలిచాను.

**8. మీరు నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా వంటి జాతీయ సంస్థలో ఉన్నత స్థానంలో ఉన్నారు. ట్రస్ట్ నుండి భవిషత్తులో ఎటువంటి సాహిత్యాన్ని తీసుకువద్దామనుకుంటున్నారు.**

నా ప్రవృత్తికి, నా వృత్తి తోడవ్వడం యాదృచ్ఛికంగా వచ్చిన అవకాశమే అయినా, నన్ను నిరంతరం పుస్తకాలతో, భారతీయ భాషా సాహిత్య సంస్కృతులతో మమేకమయ్యే అవకాశం కలిగించింది. పుస్తకాల విషయానికి వస్తే అన్ని సీరిస్‌ల రచనలతో పాటు బాల సాహిత్యం మా ట్రస్టులో ప్రధానమైంది కూడా. నాకంటే ముందు వందలాది పుస్తకాలు ఇతర భారతీయ భాషల్లోంచి తెలుగులోకి, తెలుగులోంచి ఇతర భాషల్లోకి వెళ్ళాయి. ఇంకా వెళ్తున్నాయి. నేను ఆదాన్–ప్రదాన్, ఇతర సీరిస్‌లతో పాటు కొద్దిగా ఎక్కువగానే బాల సాహిత్యం ప్రచురణ, కార్యశాలలు, బుక్ ఫెయిర్‌ల వంటి వాటిపై శ్రద్ధ పెట్టాను. మా కేటలాగు చూస్తే ఇటీవల వచ్చిన బాల సాహిత్యం గురించి తెలుస్తుంది. కేవలం అనువాదాలే కాదు, మౌళిక రచనలు




అనేకం వచ్చాయి. ఈ యేదాది మరికొన్ని వస్తున్నాయి. వాటి పేర్లు ఇక్కడ చెప్పలేను.

**9. ఈ అవార్డు మీ తర్వాత కానీ, మీ ముందు కాని ఇంకెవరికైనా వస్తే బాగుండు అనుకున్నారా.**

అటువంటివారు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, తెలుగేతర ప్రాంతాల్లోనూ అనేక మంది ఉన్నారు. నా ముందు తీసుకోవాల్సినవారు కూడా ఉన్నారు. అయితే వాళ్ళు ఏండ్లుగా బాలసాహిత్యం రాస్తున్నప్పటికీ అనేక సాంకేతిక కారణాల వల్ల వారివారి పేర్లు అకాడమి పరిశీలనకు వెళ్ళకపోయి ఉండొచ్చు. ఉదాహరణకు ఆయా రచయితలు అనేక పుస్తకాలు ప్రచురించినప్పటికీ అకాడమి పురస్కార పరిశీలన కొరకు అడిగిన సమయానికి సరిపోయేట్టు వాళ్ళ పుస్తకాలు లేకపోవడం, కొన్నిసార్లు పుస్తకాలు ఉన్నా అకాడమి అడిగిన సాంకేతిక వివరాలకు సరిపోయేట్టు, అంటే యునిసెఫ్ నార్మ్స్ ప్రకారం అడిగే నిర్ణీత పుటలు వంటివి లేకపోవడం వంటివాటితో పాటు ఇంకా అనేక రకాల అంశాలు వాళ్ళ పుస్తకాలు అకాడమి పరిశీలనకు వెళ్ళకపోవడానికి కారణం కావచ్చు. ఇక్కడ పేర్లు చెబితే ఆ లిస్టు చాంతాడంత అవుతుంది. తెలంగాణలో దాదాపు ముప్పైమందికి పైగా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇంచుమించు అదే సంఖ్యలో ఉన్నారు. ఇంకా తమిళనాడు మొదలుకుని అన్ని రాష్ట్రాల్లో కూడా బాలల కోసం తపస్సుగా రాస్తున్నవారి సంఖ్యకు కొదువ లేదు.

**10. ఆధునిక సాంకేతికమాయలో పడుతున్న బాలలకు ఎటువంటి సాహిత్యం కావాలి.**

పెద్దల కోసమో, యువతరం కోసం రాయడం సులభం. బాలల కోసం రాయడం ఒకరకంగా కత్తిమీద సాము వంటిదే. బాల సాహిత్యంలో రచయిత ఎంచుకున్న వస్తువు మొదటగా పిల్లలకు నచ్చేదిగా, పసి మనసులు మెచ్చేదిగా ఉండాలి. బాలలకు అదించే సాహిత్యం గోరుముద్దల్లాగా, పాలగోకులాగా ఉండాలి. నాకు నా బాల్యంలో చందమామ కథల్లోని దయ్యాలు, మాంత్రికులు, విఠలాచార్య సినిమాలోని ట్రిక్కులు, ప్రత్యక్షంగా చూసిన సురభి నాటకాల్లోని

మాయలు అద్భుతాలుగా తోచేవి. నేటి పిల్లలు అలాకాదు అరచేతిలో ఫోనులో లక్షల మైళ్ళ దూరంలోని అంతరిక్షంలో, అమెరికాలో ఏం జరుగుతుందో చూస్తున్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన యుగ ఫలితాలను అనుభవిస్తున్నారు. వీళ్ళు ఏది రాసినా స్వీకరించే దశలో లేరు. స్పైడర్‌మాన్లు, హారీ పోటర్, బెంటెన్, వింపీకిడ్‌ల వంటివి కూడా చదువుతున్నారు. చూస్తున్నారు. బాలల కోసం రాయడం ఎంత కష్టమో, వస్తువును ఎంచుకోవడం కూడా అంతే కష్టం మరి! మౌలిక స్థాయిలో భాష, వస్తువు, విషయం, వివరణ, అంశాలు, పరిసరాలు, పాత్రలు, సంఘటనలు ఉండాలి. కేవలం నీతి చెప్పడం కోసం ఏదో ఒక విషయాన్ని, వస్తువును ఎంచుకుని రాస్తే అది పిల్లలకు నచ్చుద్దని అనుకోను. బాల సాహిత్యం ప్రత్యేకమైంది. బాలలకు నచ్చే అంశాలు, వాళ్ళను ఆకట్టుకుని, ఆసక్తిని, ఆనందాన్ని, వినోదాన్ని, విజ్ఞానాన్ని కలిగించేదిగా ఉండాలి. అద్భుతాలు, జంతువులు సరేసరి, వీటితో పాటు పిల్లలకు సంబంధించిన కథలు, అంశాలు ఉంటే వాళ్ళను ఆకర్షిస్తాయి. తద్వారా విజ్ఞానం, వినోదం కలుగుతాయి. అంతేకాక పిల్లలకు అందేట్టుగా, అర్థం అయ్యేట్టుగా వాళ్ళ మానసిక, వయోస్థాయిని అనుసరించి వివిధ సామాజిక అంశాలు, వివిధ విషయాలు చెప్పొచ్చు. అంతేకాక గతంలో మనకు ఉమ్మడి కుటుంబాలు, అమ్మలు, తాతలు, అత్తల ద్వారా అనేకమైన విలువలతో కూడిన జీవన విధానం లభించింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు కాబట్టి బాలల కోసం రాస్తున్న సాహిత్యం జీవన మూల్యాలు పెంచేవిగా ఉండాలి. అనేక కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా మైక్రోఫ్యామిలీలు ఎక్కువవుతున్నాయి. ఉద్యోగాల రీత్యా, ఇతరత్రా ఉమ్మడి కుటుంబాలను వదిలి దూరంగా చిన్న చిన్న కుటుంబాలుగా ఉంటున్నాం. ఈ నేపథ్యంలో పిల్లలను అలరించడమేకాక, దారి చూపేందుకు, విలువలను గురించి తెలిపేందుకు పుస్తకం ఉపయోగపడుతుంది.

**11. మీ కవిత్వ, సాహిత్య, ప్రచురణ ప్రస్తావన గురించి... రెండు మాటలు...**

ఏడవ తరగతి చదువుతున్నప్పుడు నేను నా తొలి కవితను 1986లో మా తెలుగుసార్ శ్రీ టంకసాల దేవదాస్‌రావు గారి ప్రోత్సాహంతో 'ఓటు' గురించి రాశాను. తరువాత మా సిరిసిల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీ కోటగిరి జలంధర్ సార్, తాళ్ళపల్లి రామస్వామి, దేవదాస్‌రావుసార్ వల్ల మైక్ పట్టుకుని పాఠశాల సభలను సమన్వయం చేయడం మొదలు పెట్టాను. మూడున్నర దశాబ్దాలకు ముందే కవిగా, వ్యాఖ్యాతగా మా సిరిసిల్లలో నా పరిచయం జరిగింది.

నా మొదటి పుస్తకం 'ఖడ్గధార' ప్రచురించాను. మా సిరిసిల్లలో కవి మిత్రుడు ఎలగొండ రవి వాళ్ళ నారాయణ ప్రింటింగ్ ప్రెస్‌లో ఎక్కువ సమయం గడిపేవాణ్ణి. నాకు ముద్రణ మీద అప్పుడే ఆసక్తి ఏర్పడింది. అప్పటికే మా కవిత్వం అన్ని పత్రికల్లో వస్తోంది. పుస్తకం వేస్తే బాగుంటుందని నలుగురు కవి మిత్రులం ఎలగొండ రవి, సామల మహేశ్, నేను పుస్తకం తెచ్చాం. కొంత కాలం మా ఊళ్ళో కేవలం సాహిత్యం అచ్చు వేసుకునేందుకు గ్రాఫిక్స్ కూడా స్థాపించి, నడిపించాను.

**12. మీలో కనిపించే సంప్రదాయ పద్ధతులకు కారణం – ప్రేరణం**

బాల్యం నుండి నన్ను అన్నింటిలో ప్రభావితం చేసింది మా తాత బ్రహ్మశ్రీ పత్తిపాక శంకరయ్య పంతులు. పదమూడేండ్ల మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో వేదం నేర్చుకున్నాడు. పురోహితుడు, సిద్ధాంతి, అచలయోగి. అచలంలో హైదరాబాద్ దళితత్రయంలో ఒకరైన శ్రీ అరిగె రామస్వామిగారి శిష్యుడు. తరువాత వ్యాపారంలో స్థిరపడ్డారు. నాకు ఓనమాలకు ముందే వేమనను, కబీరును పరిచయం చేశాడు. 'అఆఇఈ'లు దిద్దకముందే పాండురంగ విఠలుని భజనలు నేర్పాడు. మా ఇంట్లో ప్రతిరోజు అర్ధరాత్రి వరకు అనేక విషయాలపై మా తాత, ఆయన మిత్రులు, శిష్యులు చర్చలు జరిపేవారు. నేను అవి వినేవాణ్ణి. అర్థం కాలేదు కానీ వింటూ పడుకునేవాణ్ణి. దీనికి తోడు ప్రతి గురు పౌర్ణమి రోజున తాత ఆయన గురుసోదరులు హిందూ, ముస్లింలు అందరూ కలిసి మా ఇంట్లో చేసే గురుపూజ నన్ను బాగా ఆకట్టుకునేది. అది బాల్యంలోనే నన్ను మిక్కిలి ప్రభావితం చేసింది.

**13. మీ కుంటుంబ నేపథ్యం, రచనలు, సాహిత్యస్ఫూర్తిని వివరిస్తారా.**

నేను ప్రారంభంలోనే చెప్పినట్టు మాది నేత వృత్తిగా గల కుటుంబం. మా బాపు పత్తిపాక లక్ష్మీరాజం, అమ్మ గంగాబాయి. నాకు ఇద్దరు చెల్లెండ్లు, వేంకటలక్ష్మి, చంద్రకళ. ఒక తమ్ముడు ముక్తేశ్వర్. నా జీవన సహచరి సిరిసిల్ల చందన. హిందీ ఉపాధ్యాయిని, హిందీ బాల సాహిత్యంలో పిహెచ్.డి చేస్తోంది. పెద్ద కొడుకు అభ్యుదయ్ శంకర్, చిన్నోడు అనిరుధ్ శంకర్. మా తాత ముత్తాతల నుండి చేనేత, పవర్‌లూం బట్టల ఉత్పత్తి వ్యాపారంలో ఉన్నాం. మా బాపు బట్టల వ్యాపారంతో పాటు రెండు పర్యాయాలు సిరిసిల్ల పురపాలక సంఘం కౌన్సిలర్‌గా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా, సెస్ డైరెక్టర్‌తో పాటు వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్నారు. అమ్మ గృహిణి.

రచనల విషయానికి వస్తే విద్యార్థి దశలోనే ప్రారంభించినప్పటికీ డిగ్రీ తరువాత అది పరిణతి చెందింది. అందుకు మహాకవి సినారె, తరువాత డా.ఎన్.గోపి, డా.నలిమెల, జూకంటి జగన్నాథంగార్ల స్ఫూర్తి, ప్రోత్సాహం తోడైంది. అలిశెట్టి కవిత్వం నచ్చేది. 'ఖడ్గధార' నుండి నేటి వరకు వివిధ ప్రక్రియల్లో పదమూడు పుస్తకాలు వచ్చాయి. మిత్రుడు ఎం.నారాయణశర్మతో కలిసి కొంతకాలం విమర్శవైపు పనిచేశాను. బాల సాహిత్యంలో పదకొండు పుస్తకాలు వచ్చాయి. పిల్లల కోసం అనువాదాలు పలు సంస్థల కోసం ముప్పై వరకు తెచ్చాను. వివిధ సంకలనాలు, సంపాదకత్వాలుగా వచ్చినవి ఇరవై నాలుగు వరకు ఉన్నాయి. తొలి రచన 'పిల్లల కోసం మనకవులు' పేరుతో సామల సదాశివ ఆదేశంతో అచ్చువేశాను. తరువాత 'చందమామ

రావే', 'వెన్నముద్దలు', 'అఆ..ఇఈ', 'ఒక్కేసి పువ్వేసి చందమామ', 'ఆకుపచ్చని పాట', 'పిల్లల కోసం సినారె కథ', 'జయహో! బాల సాహిత్యం'తో పాటు అకాడమి పురస్కారానికి ఎంపికైన 'బాలల తాతా బాపూజీ' వచ్చింది. నమస్తే తెలంగాణలో ప్రతి ఆదివారం తెలంగాణ భాషలో వస్తున్న దేశవిదేశాల కథలు, 'తెలంగాణా బాల సాహితీ శిఖరాలు', 'తెలంగాణలో బాల సాహిత్య వికాసం' త్వరలో రానున్నాయి. తెలంగాణలో తొలి నుండి జరిగిన బాల సాహిత్య వికాసం, బాల సాహిత్యకారుల గురించి 'జయహో! బాల సాహిత్యంలో' చూపించే ప్రయత్నం చేశాను. అంతేకాక, తెలంగాణలో, తెలుగు రాష్ట్రాల్లో జరిగిన, జరుగుతున్న వికాసంతో పాటు బాల సాహిత్య రచనల వికాసం దిశగా సాగిన అనేక అంశాలు చర్చించాను. నేను నా తోటి బాల సాహిత్యకారులను కోరేది ఒక్కటే, మనం రాస్తున్న సాహిత్యం మొదట పిల్లలకు అందేట్టుగా చూడాలి. తరువాతది పాఠకులైన పిల్లల పని.

ఈ ఆజాదీకా అమృతోత్సవం నా 'బాల సాహిత్య జీవిత రజతోత్సవం' (1997-2022), 'జన్మదినోత్సవం స్వర్ణోత్సవం' (1972-2022). ఈ సమయంలోనే నాకు సాహిత్య అకాడమి పురస్కారం లభించింది. నేను ఇరవై అయిదేండ్లుగా పిల్లల కోసం రాస్తున్నాను. నా అనుభవం చిన్నదే కాని నడిచిన నడక పెద్దది. కేవలం పుస్తకాలే ప్రధాన మనోవికాస సాధనాలుగా ఉన్న దశ నుండి నేటి సాంకేతిక ప్రపంచంలో పుస్తకం కనిపించదేమో అన్న భయం వరకు నేను చూశాను. అయితే నేడు వస్తున్న పుస్తకాలు, రచనలు బాలలు సాహిత్యాన్ని ప్రేమిస్తారన్న నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. మరో వైపు హేతువు లేకుండా రాస్తున్న రచనలు పిల్లల మీద ఏ ప్రభావాన్ని చూపుతాయోయని భయం కూడా కలిగిస్తున్నాయి. అయినా ఎక్కువగా చక్కని ఉత్తమ సాహిత్యం వస్తుండడం కూడా నా వంటి తల్లితండ్రులకు ఊరటనిచ్చే విషయం.

**14. 'మూసీ' పత్రికతో మీకున్న అనుబంధం గురించి చెప్పండి.**

'మూసీ'తో నాకున్న అనుబంధం ఎంత చెప్పినా ఒడవని ముచ్చట. మూసీతో అనుబంధం అంటే, 'శాసన ఋషి' బి.ఎన్.శాస్త్రి గారితో ఉన్న అరుదైన బంధమే. నేను 1993లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం.ఎ.తెలుగులో చేరినప్పుడు నా సీనియర్ డా.భిన్నూరి మనోహరితో పరిచయం కలిగింది. తను శాస్త్రిగారి కూతురని తెలియగానే వారివద్దకు తీసుకువెళ్ళమని అడిగిన. అలా 1994 జనవరి నుండి శాస్త్రిగారు శివైక్యం చెందేవరకు వారి ఆశీస్సులు నాకు లభించాయి. ఆ విషయం 2000లో వచ్చిన నా పిహెచ్.డి థీసిస్‌లోనూ రాశాను. సిరిసిల్లకు వెళ్ళని ప్రతి ఆదివారం ఉదయం తొమ్మిది, పది గంటల మధ్య వారి మధ్య వాలిపోయేవాణ్ణి. వారితో నాకు అనేక జ్ఞాపకాలు ఉన్నాయి. అలాగే 'మూసీ'తోనూ. ఆ సమయంలోనే ఆగిపోయిన మూసీని తెచ్చే విషయం వారు మా అందరితో చెప్పేవారు. నేను కాగజ్‌నగర్‌లో ఉద్యోగంలో చేరేవరకు మూసీతో అన్ని విధాలుగా నాకు ప్రత్యక్ష అనుబంధం ఉంది. శాస్త్రిగారితో మాట్లాడుతున్నప్పుడు వారు చరిత్ర రచనలో తెలంగాణకు జరిగిన అనేక మోసాలను గురించి చెప్పేవారు. వాటిని తరువాత యూనివర్సిటీలో జరిగే 'టెల్సో' (తెలంగాణ లిబరేషనల్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్) సమావేశాల్లో ప్రస్తావన వచ్చినప్పుడు ప్రస్తావించేవాణ్ణి. శాస్త్రిగారి అనుమతితో, వారు చెప్పిన పలు విషయాలను **'చరిత్ర రచన లోనూ తెలంగాణకు దగా'** పేరుతో




1996 డిసెంబర్, ఆదివారం ఆంధ్రభూమిలో ప్రచురించాను కూడా. శాస్త్రిగారి వంటి వారితో అనేకసార్లు కలిసి కూర్చోవడం, కలిసి భోంచేయడం, అప్పుడప్పుడు మందలింపులు దొరకడం వంటివి ఇప్పుడు జ్ఞాపకం వస్తే గర్వంగా ఉంటుంది. ఇక సరదా అయిన విషయం చెబుతాను. నేను యునివర్సిటీకి వెళ్ళేంతవరకు ఇడ్లీ తినకపోయేవాణ్ణి. అది నాకు నచ్చకపోయేది, అవసరమైతే ఉపవాసం ఉండేవాణ్ణి కానీ తినక పోదు. శాస్త్రిగారు దాదాపుగా ఇడ్లీయే తినేవారు. ఇవ్వాళ ఇడ్లీ నా ప్రధాన ఆహారాల్లో ఒకటి. కారణం శాస్త్రిగారు నాకు అలవాటు చేశారు. ఇలా అనేకం ఉన్నాయి. వారితో కలిసి ప్రయాణం చేసాను, కలిసి ఉన్నాను. డా.సినారె, గూడూరి, సదాశివ, వేముగంటి, జి.రాములు వంటి ప్రాతఃస్మరణీయుల్లో ఒకరైన శాస్త్రి గారిని మళ్ళీ ఒకసారి మనసారా యాజ్జేసుకునే అవకాశం కల్పించినందుకు షుక్రియా దత్తు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11 (22) హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# పద్యమనోహరం - 34

గన్నమరాజు గిరిజామనోహర్ బాబు
వరంగల్, ఫోన్ : 994 901 3448

'ఆంధ్ర నగరీ' యని అల్లారు ముద్దుగా
పిలిచె విద్యానాథు డెలమి నీమె
అల్లుని స్వేచ్ఛకై నెల్లూరి నెఱజాణ
పఠియించె నిచటనే భారతంబు
జాను తెనుంగున శైవ ప్రబంధముల్
మొలకెత్తి యిచటనే మొగ్గ తొడిగె
సుందార మందార సుమదామ మొక్కటి
పోతన గ్రుచ్చె నీ పొలము నందు
ఆర్ద్ర హృదయాన నెందరో ఆంధ్ర కవులు
ఆలపించిరి యిచటనే ఆత్మగీతి
తలచినంతనె మేనెల్ల పులకరించు
అక్కటా! వాటి శోభయేమాయె నేడు.

కీ.శే. దేవులపల్లి రామానుజరావు గారు రచించిన ఒకే ఒక్క పద్యకృతి "పచ్చతోరణము" లోని ఈ పద్యం ఓరుగల్లు ప్రాభవాన్ని గురించి తెలిపిన పద్యం. రామానుజరావు గారు గొప్ప కార్యదక్షుడు, బహుగ్రంథకర్త. వారు భావకవిత్వం తెలుగు నెలలో వీరవిహారం చేస్తూ ఒక మహోద్యమంగా విస్తరిస్తున్న కాలంలో కలం పట్టిన వారు గనుక తొలుత తమపై ఉన్న భావకవిత్వ ప్రభావానుగుణమైన పద్యరచన చేశారు. వాటి సంకలనమే ఈ 'పచ్చ తోరణము' అనే పద్య సంపుటి. కేవలం 21 ఖండికలతో భాసించే ఈ సంపుటిలో అడుగడుగున వీరికున్న కవిత్వ ప్రతిభ ద్యోతకమవుతుంటుంది.

ఓరుగల్లు నగర మాతను 'ఆంధ్ర నగరీ' అని సంభావిస్తూ గౌరవించిన నాటి మహావిద్వన్మూర్తి విద్యానాథుని పిలుపులోని ఔన్నత్యం, తన ప్రభు కోరికతో తిక్కన మహాకవి తన భారతాన్ని గణపతి దేవ చక్రవర్తికి చదివి వినిపించి మెప్పించి నేలయొక్క గరిమ, జాను తెనుగులతో పాటు అనేక నూతన తెలుగు సాహిత్య ప్రక్రియలకు ఆద్యుడై, తొలి అడుగులు వేసిన తెలుగు కవి పాల్కురికి సోమన్న నడయాడిన భూమి ఘనత, మందార మకరంద సదృశ భాషా సౌందర్యం ప్రస్ఫుటించే భాగవతం రచించిన పోతన్న వెలసిన పుణ్యభూమి, వీరే కాక తెలుగు మహాకవులెందరో పుట్టి తమ ఆర్ద్ర కవితలను తెలుగువారి శరీరాలు పులకరించే రీతిలో రచనలు చేసిన మహా మహిమాన్వితమైన నాటి శోభ ఈనాడు కనిపించడం లేదేమి?" అంటూ ఈ కాకతీయ నగరాన్ని, కాకతీయ వైభవాన్ని ఈ నేలలోని సాహిత్య విశిష్టతను జ్ఞాపకం చేసే ఈ గొప్ప పద్యం ద్వారా రామానుజరావు గారు అనేకానేక భావాలను చదువరి గుండెల్లో మొలకెత్తే విధంగా రచించారు.

పారతంత్ర్యంలో చిక్కుకున్న భారతజాతిలో ఉవ్వెత్తున దేశ భక్తిని రేకెత్తించి, ఉద్యమంలోకి ఉరకలెత్తించిన ఘనత సాహిత్యానికి దక్కింది. భావకవిత్వం గత వైభవ స్ఫురణను కలిగించే రీతిలో కవిత్వాన్ని సుసంపన్నం చేసింది. దాన్ని ఆచరణలో పెట్టే నాటి మహాకవులు, ఎన్నో కావ్యాలను రచిస్తూ ఈ దేశ ఔన్నత్యాన్ని, ఇక్కడి పౌరుషాన్ని గొంతెత్తి గానం చేశారు. ఆ మార్గంలోనే దేవులపల్లి వారు ఈ ఖండకావ్యంలో ఇటువంటి ఖండికలు రచించారు. ఓరుగల్లు ఘనత, ఓరుగల్లు చరిత్ర, ఓరుగల్లు పౌరుషము, ఓరుగల్లు సాహిత్య ప్రతిభ తెలుగువారి కందరికీ తెలిసిందే, కానీ మరిచిపోయిన ఈ విషయాలను నాటి అస్వతంత్ర భారతంలోని తెలుగువారికి మరోసారి జ్ఞాపకం చేసే భావ్యతను ఒక కవిగా, ఒక దేశభక్తునిగా, ఒక స్వాతంత్ర్యోద్యమ కార్యకర్తగా దేవులపల్లి వారు నెత్తికెత్తుకొని ఇటువంటి గొప్ప రచనను చేశారు. వారిలో ఈ ఉదాత్తమైన ఆశయాలు లేని పక్షంలో ఇంతటి స్ఫూర్తినిచ్చే పద్య రచన చేయలేరు. నాటి చరిత్రతో పాటు నాటి సాహిత్య చైతన్యాన్ని కూడా ఈ పద్యం స్పష్టపరిచింది. అందుకే వారు "ఆత్మగీతి" అన్న శబ్ద ప్రయోగం చేశారు. ఇక్కడి అస్తిత్వాన్ని చెప్పుకోవలసిన బాధ్యతను గుర్తు చేశారు. ఇక్కడే గొప్ప అలంకార శాస్త్రం ఆవిర్భవించిందని, ఇక్కడే శతకం, ద్విపద, ఉదాహరణ ప్రక్రియల వంటి అనేక నూతన ప్రక్రియలు పుట్టాయని, భాగవత రచన పుట్టిన నేల ఇదే యని ఘంటాపథంగా చెప్పడం వెనుక కవి భావన స్పష్టమవుతుంది.

ఇటువంటి స్ఫూర్తినిచ్చే పద్య ఖండికలు నాటి భారత దేశంలోని కష్టాలను, కన్నీళ్ళను, స్వాతంత్ర్య ఉద్యమాన్ని, సారథియైన గాంధీ మహాత్ముణ్ణి గురించి, కవుల బాధ్యతలను గురించి చెప్పిన ఖండికలతో ఈ 'పచ్చతోరణము' ఉత్తమ ఖండకావ్యమై వెలిగింది. అనేక గ్రంథాలను రచించిన మాన్యులు కీ.శే. దేవులపల్లి రామానుజరావు గారు కేవలం ఒకే ఒక పద్యకావ్యం రచించినా వారిలోని 'కవి' ఎంతటి ప్రతిభామూర్తియో ఈ ఖండకావ్యం ప్రమాణంగా తెలుసుకోవచ్చు.



# భారతీయీకరణ – 4

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

### "భారతీయీకరణ" ఎందుకు?

ఒక భావనగా, దానిని అమలు పరిచే ఒక కార్యక్రమంగా భారతీయీకరణ కోసం ఇచ్చిన పిలుపు దేశంలో సంకీర్ణ ప్రతిస్పందనలను కలిగించింది. నానాటికీ దేశంలో పెచ్చు పెరుగుతున్న విచ్ఛిన్నకర, వినాశకర శక్తుల ప్రాబల్యాన్ని గమనించి ఖిన్నులు అవుతున్న భారతీయులు– జాతీయ భావం దేశభక్తి కలవారు– ప్రస్తుత పరిస్థితులకు అత్యవసరమయిందిగా భావించి సహర్షంగా ఈ పిలుపునందుకున్నారు. కాగా, భారత జాతీయత అంటేనే అదిరిపడే కమ్యూనిస్టులు, వారిని అనుసరించి సాగిపోయే విదేశ విధేయత గల వర్గతత్వవాదులు ఈ పిలుపు పట్ల దేశంలో కలిగిన అనుకూల స్పందన చూసి బెదిరిపోయినారు. దీనితో ఈ భావనపై దీనిని బలపరిచే వారిపై వారు చేసే విమర్శ పతాక స్థాయికి పెరిగింది. వీరి బలం మీదనే లోకసభలో తన బ్రతుకు నిలబెట్టు కుంటున్న శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభుత్వం వారి ధోరణిలోనే పడిపోయింది. శ్రీమతి ఇందిరాగాంధీ అమాయక రీతిలో భారతీయు లను భారతీయీకరించడమంటే మీ ఉద్దేశ్యం ఏమిటి? అని అడుగుతూ, అతి నిందా పూర్వకంగా లోకసభలో ఈ భావనపై దాడి చేయడం ప్రారంభించినారు. ఈ విమర్శకుల ప్రధాన లక్ష్యం భారత జాతీయ భావనను బలహీనపరచడమే. ఈ విమర్శలను ప్రేరేపించే కారణం మరొకటి ఉన్నది. ఎన్నికలలో మత వర్గాల వారి సహాయం వీరికి అవసరం. అందుకని మత వర్గాలలో– ప్రధానంగా ముస్లింలలో ఒక విధమయిన భయాందోళనలను రేకెత్తించి, వారికి తామే రక్షకులుగా, స్నేహితులుగా, తమ అవసరాల





దృష్ట్యా అభినయిస్తున్నారు. భారతీయీకరణ అంటే, అల్పసంఖ్యాక మత వర్గాల వారిని దేశంలో నుంచి వెళ్లగొట్టడమనీ, ముస్లింలను, మళ్లీ వారి తాతల మత విశ్వాసాలలోకి మార్చమనీ స్వప్రయోజన పరులయిన వీరు దుర్ వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

అందువల్ల ఈనాడు భారతదేశంలో జాతీయీకరణ యొక్క ఆవశ్యకత కలగడానికి మూలమయిన సందర్భాలను, పరిస్థితులను అర్థం చేసుకోవలసి ఉన్నది. అదే సందర్భంలో, సమాజంలోని కొన్ని వర్గాలలో స్వార్థపరులు బుద్ధిపూర్వకంగా సృష్టించిన సందేహాలను, అపోహలను తొలగించవలసిన అవసరం గూడా కలుగుతున్నది.

భారతీయీకరణ అంటే, ప్రతి భారతీయుడిని ఉత్తమ భారతీయు డిగా, ఉత్తమ దేశభక్తుడిగా, ఉత్తమ జాతీయవాదిగా తయారు చేయడ మని అర్థం చేసుకోవడం మొట్టమొదట అవసరం. ఇదివరకే జాతీయాస్తులుగా ఉన్న పరిశ్రమలను జాతీయం చేయడం, యుగాల తరబడిగా కవులూ, తత్త్వవేత్తలూ, మనుష్యులను మానవీకరించ

దానికి ప్రయత్నించడం ఇట్లాంటివో, భారతీయులను భారతీయీకరించడ మన్నది కూడా శాబ్దికంగా, అలంకారంగా కూడా సరిగ్గా అట్లాంటిదే. ఇట్లా కాకుండా, భారతీయీకరణ గూర్చి అన్యథా భావించడం భారతీయతా రాహిత్యాన్ని, లేదా భారతదేశాన్ని పటిష్టం చేసే విషయంలో వ్యక్తిగతమయిన వ్యతిరేకతను మాత్రమే సూచిస్తుంది. భారతదేశాన్ని బలహీనపరచవలెననీ, ముక్కలు ముక్కలుగా చేయవలెననీ అనుకునేవారు ఇంకా కొందరు ఈదేశంలో ఈనాడు గూడా ఉన్నారు. తెలిసో తెలియకో భారతీయైక్యతను విచ్ఛిన్నం చేసే శక్తులూ కొన్ని ఉన్నాయి. ఇవన్నీ భారతీయీకరణ భావననూ, దాన్ని అమలు పరిచే కార్యక్రమాన్నీ ఈ నాటి భారతదేశంలో బాగా వ్యాప్తిలోకి తీసుకురావలసిన అత్యవసర స్థితిని నిరూపిస్తున్నాయి.

సంయోజక, విభాజక శక్తులు రెండూ ఏక కాలంలోనే ప్రతి దేశంలోనూ ఉంటాయనే విషయం అందరికీ తెలిసిందే. సంయోజక శక్తులు ఏమాత్రమూ ప్రభావం కలిగించలేనంతగా బలహీనమయి, విభాజక శక్తులు ప్రబలమయిపోతే విచ్ఛిన్నత దానిననుసరించి ఇంకా రకరకాల దుష్పరిణామాలు తప్పవు. అందువల్లనే, ఈ విభాజక-సంయోజక శక్తులను స్పష్టంగా, విడివిడిగా నిరూపిస్తూ, వాటి స్వరూప స్వభావాలనూ తెలియజేస్తూ, విభాజక శక్తులను అణచి, సంయోజక శక్తులను ప్రోత్సహించడమే ప్రతిదేశంలోనూ మేధావులకూ, కార్యశీలురకూ ప్రధాన కర్తవ్యమయిపోయింది. ఈ సంయోజక శక్తుల సమిష్టి స్వరూపమే జాతీయత అని వ్యవహరింపబడుతున్నది.

ఈ ద్వివిధశక్తులు ఈనాడు భారతదేశంలోనూ ఉన్నాయి. భారతదేశం అతి విస్తృతమయినదేకాక, అతి ప్రాచీనమయినది కూడ. అందువల్ల స్వయం సమృద్ధమయిన భాషలు ఈ దేశంలో చాలా ఉన్నాయి. భారత రాజ్యాంగంలోని 8వ అధికరణం సంస్కృత, హిందీ, కాశ్మీరీ, పంజాబీ, బెంగాలీ, అస్సామీ, ఒరియా, మరాఠీ, గుజరాతి, సింధు, ఉర్దూ, తెలుగు, కన్నడ, తమిళ, మళయాళ భాషలు పదిహేనింటిని అధికారికంగా గుర్తించింది. వీటిలో డోగ్రీ, మణిపురీ, మైథిలీలను గూడా చేర్చవలెనని ఉద్యమాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ మూడూ, ఇంకా వేరు వేరు ప్రాంతాలకు చెందిన అనేక ఉపభాషలూ ఆయా ప్రత్యేక ప్రాంతాలలో వ్యవహరింపబడుతూ, స్వీయ సాహిత్యం కలిగి ఉండడం కారణంగా ఇవి విశిష్ట భాషలుగా గుర్తించబడుతున్నాయి. దక్షిణ ప్రాంతంలోని తెలుగు, కన్నడ, తమిళ, మలయాల,భాషలు తప్ప, దేశంలోని మిగిలిన భాషలన్నీ చరిత్ర గతి ననుసరించి వైదిక సంస్కృతంలో నుంచి పరివర్తితమయినవే. పాళీ మొదలయిన ప్రాకృత భాషలు సంస్కృతం నుంచి వికసించగా ఆ ప్రాకృతాల నుంచి ఆధునిక భారతీయ భాషలు వికసించినయి. ఉర్దూ తప్ప మిగిలిన దేశీయ భాషలన్నీ సునిశ్చిత, సునిర్దిష్ట ప్రాంతాలల్లో వ్యవహరింపబడుతున్నయి. ఉర్దూ అన్నది హిందీ యొక్క ఒక శైలి మాత్రమే. కాకపోతే, అందులో పర్షియన్, తురుష్క, అరబ్బీ మూలక పదాలు చాలా వచ్చి చేరినయి. మిగిలిన భారతీయ భాషలన్నింటి నుంచీ ఉర్దూను స్పష్టంగా విభేదించి చూపే లక్షణం, అది- ఉర్దూ - భారతీయ భాషలన్నింటిలోనూ సమంగా ఉన్న అక్షరాలలో కాకుండా, పర్షియన్ అక్షరాలలో వ్రాయబడడమే. ఉర్దూను మాతృభాషగా వ్యవహరించే ప్రాంతం అంటూ ఏదీ లేదు. తురుష్కులు, మొగలులు పరిపాలించే కాలంలో దర్బారుభాషగా, సైనికభాషగా వృద్ధి పొందిన ఈ ఉర్దూభాష, ఆయా రాజుల రాజధానులయిన ఢిల్లీ, లక్నో వంటి మహానగరాలలో వ్యవహరింపబడుతున్నది. అది ఇప్పుడు జమ్మూ- కాశ్మీర్ రాష్ట్రంలో రాజ్యభాషగా స్వీకరించబడింది. అయితే, అక్కడ దానికి ఆ రాజ్యభాషా ప్రతిపత్తి ఎంతకాలం నిలవ కలుగుతుందనేది సందేహాస్పదమే. ఎందుకంటే, కాశ్మీరీభాషకు సుదీర్ఘచరిత్ర ఉన్నది. స్వీయ సాహిత్యమూ ఉన్నది. అందుకని కొంచెం వెనుక ముందులుగా దానికి లభించవలసిన న్యాయమయిన ప్రతిపత్తిని అది తప్పక పొందుతుంది. డోగ్రీ విషయం కూడా ఇంతే.

ఈనాడు పశ్చిమ పంజాబ్, సింధ్, ఫక్తూనిస్తాన్, బెలూచిస్తాన్ లతో ఏర్పడ్డ పశ్చిమ పాకిస్తాన్ ఉర్దూను అధికారభాషగా స్వీకరించింది. అయితే, పంజాబీ, సింధీ, పుస్తో భాషలకు విద్యా విషయికంగానూ, వ్యవహార విషయికంగానూ లభించవలసిన న్యాయమైన ప్రతిపత్తి కోసం ఆయా ప్రాంతాల్లో ఉద్యమాలు దినదినం పెరుగుతూనే ఉన్నాయి. కొద్ది రోజులలోనే ఈ భాషలు గూడా, ఇవి వ్యవహరింపబడే పశ్చిమ పాకిస్తాన్ ప్రాంతాల్లో- తూర్పు పాకిస్తాన్ లో బెంగాలీవలె రాజ్యభాషలుగా అంగీకరింపబడుతాయని భావించవచ్చు.

ఇంతటి విశాలమయిన భారతదేశంలో ఇన్ని విభిన్న భాషలు, ఉపభాషలు అభివృద్ధి పొందడంలో ఆశ్చర్యం ఏమీలేదు. ప్రాచీన భారతీయ భాషా తత్వవేత్తలేకాక, ఆధునిక పండితులు గూడా అంగీకరించినట్లు, ప్రతి ఏడెనిమిది మైళ్ల దూరానికీ భాష యొక్క ఉచ్ఛారణలో యాసలో మార్పు కొంత వస్తూనే ఉంటుంది. అందువల్ల ఈ పద్నాలుగు భాషలు వ్యవహరింపబడే ప్రాంతాలలో గూడా అనేక ఉపభాషలు ఏర్పడుతున్నాయి. కాలక్రమంగా అవి కూడా విశిష్ట భాషలుగా అభివృద్ధి పొందవచ్చు. శతాబ్దాల తరబడిగా ఇన్ని విభిన్న భాషలున్నా గూడా, భారతదేశంలో ఈనాడున్నట్లుగా, భాషాసమస్య ఏనాడు ఉత్పన్నం కాలేదు. దీనికి రెండు కారణాలున్నయి. ఇన్ని విభిన్న భాషలున్నాగూడా, దేశంలోని వివిధ ప్రాంతాల మేధావులు, సంస్కృతీ ప్రవర్తకులూ ఉపయోగించే ఒక ఉమ్మడి భాష ఉండటం మొదటి కారణం. అశోకుని మరియు అతని వారసుల కాలంలో పాళీ ప్రాకృత భాష అమలులోకి వచ్చేదాకా, శతాబ్దాల తరబడిగా ఈ పాత్రను సంస్కృతం నిర్వహించింది. పాళీభాషలో ఉన్న అశోకుని శాసనాలతో బాటు దేశవ్యాప్తంగా సంస్కృత భాషా శాసనాలు గూడా కనిపిస్తున్నయి. దీనివల్ల ఆకాలంలో దేశం మొత్తం మీద ఆ రెండు

భాషల సార్వజనీనత సువ్యక్తమవుతుంది. క్రీస్తుశకం ప్రారంభిక శతాబ్దాలలో హీనయాన బౌద్ధాన్ని వెనుకకు త్రోసి మహాయాన బౌద్ధం పరివ్యాప్తం కావడంతో మళ్లీ సంస్కృతం తన స్థానాన్ని పొందింది. ఆ తరువాత పాళీ సంస్కృతాల స్థానంలో, వాటిని తప్పించి, తన వివిధ రూపాలతో హిందీ నెలకొన్నది. దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన రామానుజ జ్ఞానేశ్వరుడు, నానక్, కబీర్, తులసీదాస్, చైతన్యుడు మొదలయిన ఆచార్యులూ, పండితులూ అందరూ ఈ భాషను సమంగా పోషించినారు. అందువల్ల ఈ దేశంలో ఏనాడు భావ వినిమాయానికి గానీ, ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రజల రాకపోకలకు గానీ భాష ఏ విధమయిన హద్దులూ, ఆటంకాలూ కలిగించలేదు. ఇక, దేశపు రాజకీయ వ్యవస్థతో భాష ఏనాడు ముడివడి ఉండక పోవడం రెండవ కారణం. వేరు వేరు రాజుల, రాజవంశాల పాలనలో దేశంలోని పలు ప్రాంతాలు చేరి ఉండేవి. కానీ ఏనాడు ఈ ప్రాంతాలు– రాష్ట్రాలు– భాష ప్రాతిపదిక మీద ఏర్పడి ఉండలేదు. పలు రాష్ట్రాలు బహుభాషా రాష్ట్రాలుగా ఉండేవి. రాష్ట్రంలోనూ, ఇతర రాష్ట్రాలతోడి సంబంధాలలోనూ పండితులకు, పాలనా నిర్వాహకులకు సంయోజక భాషగా సంస్కృతం ఉపయోగపడేది. ఆయా ప్రాంతాల్లో గౌరవింపబడే రాజులకూ, దేశం మొత్తంమీద గౌరవింపబడే పండితులకూ మధ్య ఉండే భేదాన్ని ఆనాటి ప్రజ స్పష్టంగా గుర్తించింది. ఈ అంశాన్నే చాణుక్యుడు అర్థశాస్త్రంలో సొగసుగా చెప్పినాడు.

**"స్వదేశే పూజ్యతే రాజా, విద్వాన్ సర్వత్ర పూజ్యతే"**

రాజు స్వదేశంలోనే గౌరవించబడుతాడు. పండితుడు అంతటా గౌరవించబడుతాడు.

ఈ స్థితి, దేశంలోని కొన్నిభాగాలు విదేశీయ పాలనలోకి పోయినప్పుడు గూడా సాగుతూనే ఉండేది. కాకపోతే, తురుష్కులూ, మొగలులూ సంస్కృతాన్ని తొలగించి దాని స్థానంలో పర్షియన్ భాషను దర్బారు భాషగా చేసినారు. పూర్వపు మౌర్య, గుప్త సామ్రాజ్యాలలో మాదిరిగానే వీరి సామ్రాజ్యంలోనూ భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాలు ఏనాడు ఏర్పడలేదు. పాలన సౌలభ్యం లేదా సైనిక వ్యూహరచనా సౌలభ్యం వంటి అంశాలే ప్రాంతాల విభజనలో ప్రాధాన్యం వహించేవి. ఆంగ్లేయులు తమ అధికారాన్ని దేశం మీద వ్యాపింపజేసిన తరువాత గూడా ఇదే పద్ధతి కొనసాగించబడింది.

భారతదేశం మొత్తంమీద ఆంగ్లేయుల ఏకాధికారం స్థాపితమయిన తరువాత, అధికారస్థాయిలో దర్బారులలో, రాష్ట్రాల మధ్య వ్యవహారాలలో పర్షియన్ స్థానాన్ని ఆంగ్లభాష ఆక్రమించింది. కాలక్రమంగా ఆంగ్లేయ విద్యావిధానం దేశంలో వ్యాపించినకొద్దీ, ఆంగ్లం తెలిసిన విద్యావంతులు రూపొందినారు.

1857లో జరిగిన సాయుధ పోరాటం విఫలమయిన తరువాత, ఆంగ్లపాలన నుండి విముక్తికోసం సాగిన భారతీయ స్వాతంత్రోద్యమం ఒక కొత్త మలుపు తిరిగింది. ప్రజలలో శాంతియుతంగా చైతన్యం కలిగించడం, అదేవిధంగా ఆందోళనలు నిర్వహించడం అవసరమ యింది. స్వదేశీ, సహాయ నిరాకరణ, శాసనోల్లంఘనం వంటి ఉద్యమాలు కొంతలో కొంతయినా సఫలంగా సాగించడానికి ముందు, ప్రజలలో రాజకీయ ప్రబోధం కలిగించడానికి ఎన్నో దశాబ్దాలు పట్టింది. ఈ ఉద్యమాలు నడపడానికి ముందుగా అవసరమయిన, ప్రధానమయిన రాజకీయ చైతన్యం ప్రజలలో కలిగించడానికి దేశంలో విలీనీకరించి, వాటిని వేరు వేరు వర్గాలుగా ఏర్పాటు చేయడం అనే పనిలో దేశాన్ని ఏకఖండంగా రూపొందించే మహాకార్యంలో మునిగిపోవడం వల్ల, ఆ పని నుంచి ప్రజల దృష్టిని మళ్ళించే ఏ అంశాన్ని గూర్చి గూడా ఆలోచించే అవకాశమే ఆయనకు కలుగలేదు.

అయితే, పండిత జవహర్ లాల్ నెహ్రూను గూర్చి ఇట్లా చెప్పడానికి వీలులేదు. ఆయనను రాజనీతివేత్త అనడంకన్నా రాజకీయవేత్త అనడం బావుంటుంది. స్వేచ్ఛావాద, అంతర్జాతీయతా వాదాలలో ఆయన యొక్క సాహసోపేతమయిన పోకడల పలుచని పొరల మాటున ఎగిసిపడే వ్యక్తి ప్రాధాన్యతత్వం, చౌకబారు ప్రసిద్ధి కోసం తహతహ పాటు స్పష్టాస్పష్టంగా ఆయనలో దాగి ఉండేవి. 1950లో సర్దార్ పటేల్ మరణం వల్ల వాటిని నియమించగల, నిరోధించగల ఏక మాత్రశక్తి తొలగిపోవడంతో, భారతీయ సమస్యలన్నింటికీ సర్వాధికారాలు గల ఏకైక పరిష్కర్త అయిపోయినాడాయన. అందువల్ల, భాషా రాష్ట్రాలను ఏర్పరచడానికి ఆయన నిర్ణయించనప్పుడు, వాటి ఏర్పాటును ఆపగలశక్తి ఏదీ లేకపోయింది.

ఒకసారి భాషారాష్ట్ర సూత్రం ఆమోదింపబడిన తరువాత, మహారాష్ట్ర– గుజరాత్, పంజాబ్– హరియానాల విషయంలో రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సంఘం చేసిన మినహాయింపులు ఎక్కువకాలం నిలువలేక పోయినాయి. పరిస్థితులను తీవ్రతరం చేసి, భాషా తత్వాన్ని ఉదృతం చేయడానికి మాత్రమే ఆ మినహాయింపులు ఉపకరించినయి. కొన్ని భాషా రాష్ట్రాలు ఏర్పడడానికి ముందూ, వెనుకా చెలరేగిన హింసాకాండ, పరస్పర ద్వేషం,ఆ దారిలోనే వివిధ రాష్ట్రాలలో మితిమీరిన ప్రాంతీయతత్వం దేశాన్ని అరలరలుగా విడిపోయే స్థితికి తెచ్చింది.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11 (26) హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# ఆధునిక సాహిత్యంలో మణిపూసలు

**కందుకూరి భాస్కర్,** పెద్దపల్లి జిల్లా, ఫోన్ : 9441557188

ప్రాచీన కాలం నుండి అత్యాధునికయుగం వరకు పరిశీలిస్తే, తెలుగు సాహిత్యములో వెలసిన పద్యము, గద్యములతో పాటు వచన కవితకూ ఓ ప్రత్యేక స్థానం ఉంది. వచనం క్రమంగా అనేక మార్పు చేర్పులకు గురియవుతూ, విభిన్న రూపములతో చిన్న చిన్న(మినీ) కవితలుగా పుట్టుకొస్తున్నాయి. వీటిలో కొన్ని కాలగర్భంలో కలిసిపోగా, మరికొన్నింటికి కవిపండితుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తోంది. "కట్టే కొట్టే తెచ్చే" అన్నట్లు, ఇవి సామాన్యులకు సైతం తేలికగా అర్థమయ్యేలా ఉండడం వలన, ప్రజలకు తొందరగా చేరువవు తున్నాయి. కొన్ని రకాల లఘు కవితలలో ఎలాంటి నియమ నిబంధనలు ఉండవు. మరికొన్ని అక్షరం, ప్రాస, పాద నిర్బంధాలతో ముడిపడి సాహిత్యాకాశంలో వెలుగులీనుతున్నాయి.

శైవకవి పాల్కురికి సోమనాథుడి ద్విపదలు, గురజాడ అప్పారావు ముత్యాల సరాలు, ఆరుద్ర కూనలమ్మ పదాలు, యన్. గోపి నానీలు, సుగం బాబు రెక్కలు, భీంపల్లి శ్రీకాంత్ మొగ్గలు వంటి కవితా భాగాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇంకా గాలి నాసర రెడ్డి, ఇస్మాయిల్, పెన్నా శివరామకృష్ణ, రూప్ కుమార్, తలతోటి పృథ్విరాజ్ తదితరుల వలన విదేశాల నుండి వచ్చిన హైకూలు ప్రకాశిస్తున్నాయి. దాశరథి, సినారె, రెంటాల వేంకటేశ్వర రావు, సూరారం శంకర్, కిరణ్ కుమార్ గద్వాల్ వంటి ఎందరో కవులు గజల్లను అభివృద్ధిలోకి తెచ్చారు. తిరుమల శ్రీనివాసాచార్య, సామల సదాశివ, ఏనుగు నరసింహారెడ్డి మొదలగువారితో రుబాయిలు స్థిరబడ్డాయి. ఆ మార్గంలోనే "శ్రీపద" కలం పేరు గల వడిచర్ల సత్యం రూపొందించిన "మణిపూసలు" అనే నూతన కవితా ప్రక్రియ కూడా ఇటీవలి కాలములో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఎంతోమందిని కదిలించి, సృజన పథమువైపు నడిపిస్తున్నది.

**కవిపరిచయం**

తెలుగు పండితుడైన వడిచర్ల సత్యం మంచి పేరున్న కవి. పలు రకాలైన కవితా ప్రక్రియల్లో 16 పుస్తకాలు రచించారు. 2011లో రంగారెడ్డి జిల్లా ప్రశాసనం ద్వారా "ఉత్తమ ఉపాధ్యాయుడిగా" ఎన్నికై, "బాలల మిత్రుడు"గా ప్రశంసింపడినాడు. "కాగ్నా కళా సమితి" ని స్థాపించి, సారస్వత సేవను కొనసాగిస్తున్నాడు. వీరిని రాష్ట్రావతరణ ఉత్సవాల్లో భాగంగా "వికారాబాద్ జిల్లా స్థాయి విశిష్ట కవి"గా తెలంగాణ ప్రభుత్వం, తేది 02.6.2018నాడు యాబైవేల నగదు పురస్కారంతో ఘనంగా సత్కరించింది.

**మొదటి మణిపూస**

చాలా మంది సాహితీ పెద్దల ప్రశంసలను అందుకున్న "శ్రీపద" కలము నుండి మొలకెత్తిన అంకురమే మణిపూసలు. ఇవి విద్యావేత్తలు, పండితులు, విమర్శకుల చేత గుర్తింపును పొంది, అనతికాలంలోనే ఊహించని విధంగా వ్యాపించి, అగ్రభాగమున నిలిచాయి. మాత్రాఛందస్సు, అంత్యానుప్రాస లక్షణాలతో నిర్మితమైన మణిపూసలు లయాత్మకంగాను, గానాత్మకంగాను ఉండటం వలన పాఠకులు అక్కున చేర్చుకున్నారు. ఇప్పుడిప్పుడే కలంబట్టిన వారిని మొదలుకొని, ప్రసిద్ధి చెందిన కవివరేణ్యుల దాకా మణిపూసలు రాయడం గమనార్హం. అత్యల్ప వ్యవధిలోనే రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఈ ప్రక్రియలో అనేక పుస్తకాలు వచ్చాయి. ఇంకా వస్తున్నాయి.

**"గాలి లేకపోయినా**
**నీరు లేకపోయినా**
**సృష్టికి చలనంబు లేదు**
**కాంతి లేకపోయినా!"** అంటూ వడిచర్ల సత్యం ఒంటరిగా పాఠశాల ఆవరణలో కూని రాగాలు తీస్తున్న వేళ అనుకోకుండా అలవోకగా తన మదిలో నుంచి దొర్లిన ఈ మణిపూస, సరళ సుందర శోభితమై, అలతి అలతి పదాలతో ఒక క్రమపద్ధతిలో సాగింది. సులభ గ్రాహ్యమైనది. ఇదే ఈ ప్రక్రియను ప్రారంభించడానికి మూలకారణమైన మొట్టమొదటి మణిపూస.

**మణిపూసల నియమాలు**

1. ఇందులో నాలుగు పాదాలుంటాయి.

2. 1, 2, 4 పాదాల్లో అంత్యానుప్రాస మరియు 10, 11, 12 మాత్రల నుండి ఏదైనా ఒక సంఖ్యనే ఉపయోగించాలి. అనగా 1వ పాదంలో ఎన్ని మాత్రలుంటే 2, 4 పాదాల్లో కూడా అన్నే మాత్రలు ఉండాలి.

3. 3వ పాదానికి అంత్యానుప్రాస లేకుండా 10 నుండి 12 వరకు ఎన్ని మాత్రలైనా వుండవచ్చు.

4. 3, 4 పాదాల్లో కవితా మెరుపుండాలి.

(లఘువు (I) ను ఒక మాత్ర, గురువు (U) ను రెండు మాత్రలుగా లెక్కిస్తారు.)

అయితే అన్ని పాదాల్లో 10 నుండి 12 వరకు మాత్రల హద్దు, మూడో పాదంలో సడలింపు ఉంది. ఈ ప్రత్యేకత వలన మణిపూసలను తొమ్మిది రకాలుగా రాయడానికి అవకాశం ఏర్పడింది.

కావున మణిపూసలను విభిన్న సాహిత్యాంశంగా పరిగణించడం చేతనే వందలకొద్ది కవి పండితులు అనుసరిస్తున్నారు. ఈ విధానమును లబ్ధప్రతిష్ఠులైన అవధానులు కూడా ఆదరిస్తున్నారు.

**జీవ లక్షణాలు**

**"సారళ్యము, క్లుప్తత, మాత్రల కొలత, అంత్య ప్రాసలాకర్షణ, కవితా మెరుపు, సూటిదనము, పరిమిత పదాల కూర్పు, శిల్ప సౌందర్యము, గానయోగ్యమైన లయ, ముక్తక స్వభావము, తక్షణ భావ స్ఫురణ, లఘు రూపము"** అనేవి మణిపూసల జీవలక్షణాలుగా చెప్పవచ్చు. ఇటువంటి కారణాల చేతనే ఇవి ఆబాలగోపాలాన్ని అలరిస్తున్నాయి. కవన క్షేత్రంలో వెల్లువలా విస్తరిస్తున్నాయి.

**మణిపూసల గురించి ప్రముఖ సాహితీవేత్తల స్పందనలు**

వడిచర్ల సత్యం సృష్టించిన మణిపూసలు తెలుగు సాహిత్యంలో అమూల్య రత్నాలవలె భాసిల్లుతున్నాయి. సామాజిక బాధ్యతతో కొన్ని వందలమంది కవులు అనేక అంశాలతో వీటిని విపరీతంగా రాస్తున్నారు. వర్తమాన కవులకు, రాబోవు కవులకు మణిపూసలు ఒక చక్కని వేదికగా మారడం హర్షించదగ్గ శుభపరిణామం. సాంప్రదాయక పునాదులపై రూపుదిద్దుకున్న ఈ అపూర్వ ప్రక్రియ నవతరం కవులకు ఒక వరంలా మారింది. కనుకనే ఎందరో కవులు, పండితులు, సాహితీవేత్తలు, విమర్శకులు దీనిపై వ్యక్తం చేసిన అభిప్రాయాలను, ఆలోచనలను గమనిస్తే, ఆధునిక తెలుగు సాహిత్యంలో మణిపూసల వైభవం ఏమిటో, ప్రభావం ఎటువంటిదో స్పష్టంగా తెలుస్తుంది.

"మాత్రా నియమాలు అంత్యానుప్రాసలు, కవితా మెరుపులు వంటి లక్షణాలతో సృష్టించబడిన మణిపూసలు సాహిత్య లోకంలో అడుగు పెట్టడం కవితా ప్రియులకు లాభదాయకమని" ప్రసిద్ధ కవి దొరవేటి చెన్నయ్య అభిప్రాయపడ్డారు. **"మణిపూసలు తెలుగు సాహిత్యానికి వెన్నపూసలు"** అని శతావధాని మలుగ అంజయ్య చమత్కరించారు. డా.తిరునగరిగారు **"మాత్రాఛందస్సులో ఉన్న మణిపూసలు సాహిత్యంలో మనగల్గుతాయి"** అనగా, డా. అమ్మంగి వేణుగోపాల్ **"కొత్తగా కవిత్వం రాస్తున్న కవులనే కాకుండా, వరిష్ఠులను కూడా మణిపూసలు ఆకర్షిస్తాయనడంలో అతిశయోక్తి లేదు"** అని చెప్పారు. ఆచార్య సూర్య ధనంజయ గారు **"బడిపిల్లల నుండి పండితుల వరకు ఈ ప్రక్రియలో రాస్తున్నారు. ఇది ఎంతో అభినందనీయం"** అన్నారు. **"రుబాయీల సాంప్రదాయమున్నప్పటికీ మాత్రా నియమం వల్ల మణిపూసల ప్రక్రియ సామాన్యుని దగ్గరికి చేరింది. తక్కువ మాత్రల్లో కవిత చెప్పడమే మణిపూసలకున్న ప్రత్యేకత"** అని ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు.




**"మణిపూసల ప్రక్రియ అనతికాలంలోనే ప్రముఖులైన పండితుల ప్రశంసలందుకొని ఆధునిక తెలుగు కవితా రూపాలలో అగ్రభాగాన నిలిచింది"** అని తూర్పు మల్లారెడ్డి ప్రకటించగా, **"ఈ మణిపూసల ప్రక్రియలో పదిమందిని ఆకట్టుకునే జాడలు మిక్కిలి ఉన్నాయి. కాబట్టి మనగల్గుతుంది"** అని బైస దేవదాస్ పేర్కొన్నారు. **"ప్రారంభించిన యాభై రోజుల్లోనే శతాధిక కవులు అనుసరించిన ప్రక్రియ మణిపూసలు ఒక్కటే కావడం చాలా అరుదైన విషయం. ఇది నా నలభై ఏండ్ల సాహిత్య అనుభవంతో చెబుతున్న మాట"** అని సహస్ర పద్యకంఠీరవ చిక్కా రామదాసు అభిప్రాయ పడ్డారు.

ప్రముఖ సాహితీ విమర్శకులు దాస్యం సేనాధిపతి **"సాహితీ పూదోటలో మరో సుమం వడిచర్ల మణిపూసలు"** అని కీర్తించారు. **"వడిచర్ల నుండి సృజించబడిన ఈ ప్రక్రియ వందల మంది ఔత్సాహికులను ఆకర్షించి, వారిచే వేల మణిపూసలను రచింపజేసింది"** అని రాపోలు సీతారామ రాజు వ్యాఖ్యానించారు.

**"తెలుగు సాహిత్యంలో వడిచర్ల సత్యం తీసుకొచ్చిన ఒక మైలురాయి వంటి అద్భుతమైన ప్రక్రియ మణిపూసలు. ఇది కవిత్వానికి మరింత చేర్పును కలిగిస్తుందని నేను కచ్చితంగా భావిస్తున్న. ఇందులో ఎలాంటి సందేహం అక్కర లేదు"** అని మామిడి హరికృష్ణ గారు, అలాగే **"పద్యం తర్వాత నాకు నచ్చిన ఏకైక కవితా ప్రక్రియ మణిపూసలు"** అని మద్దిరాల శ్రీనివాస్ గారు ఘంటాపథంగా చాటి చెప్పారు. అట్లే శ్రీవాటి శ్రీనాథ్ **"పద్యం రాయలేని వారికి మణిపూసల ప్రక్రియ పరమాన్నం వంటిది"** అని నొక్కి చెప్పారు.

కనుక "పద్యం రాయలేను" అని అనుకునే వారికి మణిపూసల ప్రక్రియ నూతన జవసత్వాలను నింపి, ఆ లోటును తీర్చే ప్రయత్నం చేస్తున్నది. అందుకే "వడిచర్ల మణిపూసలు" పుస్తకావిష్కరణ సభలో ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు డా. ఏనుగు నరసింహారెడ్డి గారు మాట్లాడుతూ, **"పద్యానికి తమ్ముడు, వచన కవితకు అన్న వంటిది మణిపూసల కవితా ప్రక్రియ"** అని పేర్కొన్నారు. డా. అయాచితం శ్రీధర్‌గారు **"మణిపూసల నిర్మాణ శైలి సామాన్యులను కూడా చదివిస్తుంది."** అనగా, డా. పత్తిపాక మోహన్ గారు **" మణిపూసలు పెద్దల్నే కాకుండా, పిల్లల్ని ఆకర్షించడం విశేషం"** అని చెప్పారు.

## ప్రక్రియ ఆరంభం

తేది 26.4.2018 నాడు వాట్సాప్ సమూహాలలో వడిచర్ల సత్యం మణిపూసలను ప్రయోగాత్మకంగా పరిచయం చేశారు. సామాజిక మాధ్యమాలు, పత్రికల సహకారముతో ఇంతింతై...వటుడింతై అన్నట్లుగా దిన దిన ప్రవర్ధమానవుతున్న ఈ నవీన సాహితీ వనం స్వల్ప వ్యవధిలోనే తెలుగునేల నలుదిశలకు వ్యాపించి, అసంఖ్యాకులైన జనాలను ఆకట్టుకొన్నది . **"మణిపూసలు తక్కువ సమయంలో ఎక్కువ మంది కవులచేత అనుసరించబడిన ప్రక్రియ"** అని వీటి నియమాల ను ఆవిష్కరించిన సందర్భంలో డాక్టర్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు.

## ప్రపంచ గుర్తింపు

ప్రారంభించిన యాభై రోజుల్లోనే శతాధిక కవులు అనుసరించి, తెలుగు సాహిత్యంలో గొప్ప ప్రగతికి చేరుకొని, "ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డును" సాధించిన తొలి కవితా ప్రక్రియ మణిపూసలు కావడం గమనార్హం. అయినా ప్రజలను ఆలోచింపచేయడానికి చైతన్యస్ఫూర్తి నింపే రచనలు ఏవైనా కలకాలం మనగలుగుతాయి. కనుకనే మణిపూసల సౌరభాల గుబాళింపు వేమన పద్యాల వలె పెద్దలనే కాకుండా విద్యార్థులను కూడా ఆకట్టుకొని, రాయించడం ఆశ్చర్యకరమైన విషయం. అందుకే ఈ రహస్యాన్ని గమనించిన ప్రముఖకవి, రచయిత యెలిశాల నాగమోహన్ .....

**"మణిపూసకు రిథముంది**
**ఆకట్టే గుణముంది**
**కవి పండిత పాఠకులను**
**కదిలించే బలముంది!"** అని ఒక్క మణిపూసలో మణిపూసలకున్న మహిమను, ఆకర్షణ గుణాన్ని చక్కగా వివరించారు.

కొత్తగా వచ్చిన ఈ మణిపూసల విధానం మాతృభాష సంరక్షణకు, సాహిత్య సంపదకు, తెలుగు వెలుగుకు తోడ్పడుతున్నది. పెద్దవాళ్ళకే కాకుండా పిల్లల్లోనూ జిజ్ఞాసను, కవితాలోచనను కలిగించి, రచనా వ్యాసంగాన్ని సాధన చేయిస్తున్నది. తక్కువ పదాలతో ఎక్కువ ఆసక్తిని పెంచి, వీనులవిందుగా భావాన్ని కలిగింప చేసే మణిపూసలు తెలుగు బుక్ ఆఫ్ రికార్డును, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డును కూడా సొంతం చేసుకున్నాయి.

## సామూహిక పుస్తక ఆవిష్కరణ

2019 జూన్ 9న హైదరాబాదులోని రవీంద్రభారతి ప్రాంగణ మందలి మెట్లపైన 25మంది కవులు రాసిన 25 మణిపూసల పుస్తకాలను ఒకేసారి సామూహికంగా విడుదల చేయడం చిట్టి కవితల చరిత్రలో ఒక సంచలనమే. ఈ అద్భుతమైన కార్యక్రమం మళ్లీ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో కెక్కడం మరో విశేషం. కొన్ని వందల మంది కవులు తమ కలాలకి పదునుపెడుతూ సమాజంలో ఉన్న వివిధ అంశాలను స్పృశిస్తూ, మణిపూసల రచనలు సాగిస్తున్నారు. అందుకే కాగ్నా కళాసమితి, తెలుగు సాహిత్య కళాపీఠం, గోల్కొండ సాహితీ కళా సమితి వంటి సంస్థలు ఈ ప్రక్రియను అనుసరిస్తున్న కవులను ప్రోత్సహించడానికి వివిధరకాలైన "మణిపూసల పురస్కారాలు" ఇస్తున్నారు. ప్రతీ సంవత్సరం "ఏప్రిల్ 26ను మణిపూసల కవితా దినోత్సవంగా" జరుపుకుంటారు. మణిపూసలు వెలుగులోకి వచ్చినంక సరిగ్గా నాలుగు సంవత్సరాల వ్యవధిలో శతాధిక రచనలు రావడం మామూలు విషయం కాదు. ఈ సాహితీ సంపదంతా ప్రక్రియ ఉన్నత స్థితిని తెలియజేస్తుంది.

## ఇతర భాషల్లోకి

తొలిసారిగా "వడిచర్ల మణిపూసల"ను కె. పాండురంగ విఠల్ హిందీలోకి, డి. హనుమంతరావు ఆంగ్లంలోకి, సయ్యద్ యూసుఫ్ ఉర్దూలోకి, డా. వి. జలంధర్ మరాఠీలోకి అనువదించారు.

ప్రత్యేక సూత్రాలతో ఏర్పడి, సారస్వత లోకంలో ప్రభంజనం సృష్టించిన మణిపూసలు రాబోవు కాలంలో తెలుగు సాహిత్యంలో ఒక నూతన ఒరవడితో కవులను, పాఠకులను అలరిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ పొట్టిదైన కొత్త కవితాంశాన్ని చరవాణి ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన గంటలోపే చూసిన ప్రముఖ అవధాని గౌరిభట్ల బాలముకుంద శర్మ గారు, సాహిత్యంలో దీనికున్న ఆకర్షణ శక్తిని ముందుగానే అంచనా వేసి, ఆశువుగా......

**"కవితాకృతి సతి మదిలో**
**కవి కవితల తలపులలో**
**మణిపూసలు వెలుగుచుండు**
**పఠితల యెదలోతులలో"!** అని చెప్పిన అందాల మణిపూస ఇప్పుడు అక్షరాల నిజమే అనిపిస్తోంది. ఇలా నవ్య శైలికి నాంది పలికి, ఎందరికో ఆదర్శంగా నిలిచిన వడిచర్ల సత్యం సదా అభినందనీయులు!!

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11 (29) హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

గ్రంథాంతరంగం 16

# యాభై సంవత్సరాల జ్ఞాపకాలు

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

దేవులపల్లి రామానుజరావుగారు తెలంగాణ ముద్దుబిడ్డ మాత్రమేనా? కాదు కాదు. 'బహుళాంధ్రోక్తిమయ ప్రపంచ'పు మురిపాల ముత్తెం కూడా. కవి, విమర్శకుడు, పత్రికా సంపాదకుడు, సాహితీ సంస్థల దక్ష నిర్వాహకుడు, వినయ మోహనుడు, నీతి నియమాలకు బద్ధుడు, నిస్వార్థజీవి ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన పురుషోత్తముడు, కోటికొక్కడు.

తెలుగులో స్వీయ చరిత్రలు వందల సంఖ్యలో వెలువడ్డాయి. దేవులపల్లి రామానుజరావు రచించిన 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' హనుమకొండ (వరంగల్లు)లోని ప్రసిద్ధ సాహితీసంస్థలైన 'సాహితీబంధు బృందం' 'చైతన్య సాహితి' ల సంయుక్త ప్రచురణగా శ్రీ పేర్వారం జగన్నాథం, డా. ఏ. సురేంద్ర కుమార్ గార్ల సారథ్యంలో 1981లో పుస్తక రూపంలో వెలుగు చూసింది.

దేవులపల్లి రామానుజరావు 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' స్వీయ చరిత్ర ప్రక్రియ కిందికే వస్తుంది. కాని ఈ రకమైన పుస్తకాలు ఆచంట జానకిరామ్ గారి 'నా స్మృతిపథంలో', 'సాగుతున్న యాత్ర' శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి 'అనుభవాలూ–జ్ఞాపకాలూ' మొదలైనవి స్వీయచరిత్ర లేదా ఆత్మకథ కోవ కిందికే వస్తూ, కొంచెం భిన్నంగా రచింపబడ్డ రచనలుగా పేర్కొనదగ్గవి. స్వీయచరిత్ర రచయిత జీవితం లోని మజిలీల్ని కాలక్రమానుసారంగా జీవిత వ్యవధిని చాలా వరకు కాని, కొంతవరకు కాని వెల్లడిస్తుంది కాని పుట్టుక మొదలు చావు దాకా వ్యక్తం చేయదు. ఇక 'జ్ఞాపకాలు' అనే రచన కూడా స్వీయచరిత్రలోని ఓ శాఖగా భావించతగ్గది. ఈ రకమైన రచన కాలక్రమబద్ధంగా వుండకుండా రచయిత జీవితంలోని ముఖ్యమైన సంఘటనల్ని వెల్లడిస్తుంది. స్వీయచరిత్ర శైలి గంభీరంగా, ప్రణాళికా బద్ధంగా నడిస్తే 'స్మృతులు, జ్ఞాపకాలు' శైలి భావోద్వేగంతో కూడుకొని, గలగలా పారుతూ సాగుతుంది. అయితే స్వీయచరిత్రకారుని జ్ఞాపకాలూ, స్మృతులూ సీరియస్ గా వ్యక్తమైన విలక్షణ రచనలూ వుంటాయి.

దేవులపల్లి రామానుజరావుగారి స్వీయచరిత్ర 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' కాలక్రమానుసారంగా, ఆయన బతుకు బాటలోని ముఖ్యమైన మైలు రాళ్లను తెలియ చేసిన విలువైన దస్తావేజు.

దేవులపల్లి వారు తమ స్వీయచరిత్రలో యాభై ఏళ్ల కాలావధికి మాత్రమే పరిమితమై జన్మ, నివాసం, తల్లిదండ్రుల, పూర్వీకుల వృత్తాంతాన్ని చెప్పకుండా తమ సాధనా యాత్రలోని విశేషాల్ని మాత్రమే ఉల్లేఖించారు. రామానుజరావు తమ జీవిత నౌకకు చుక్కాని చేపట్టి ముందుకు నడిపించిన మహనీయుల్ని పదేపదే తల్చుకుంటూ, జీవయాత్రలో చెట్టా పట్టాలేసుకుని నడచిన మిత్రుల్ని పదిసార్లు జ్ఞాపకం చేసుకుంటూ, కష్టకాలంలో ఆదుకున్న సజ్జనుల్ని స్మరిస్తూ, వాళ్లకు గుండెనిండుగా కృతజ్ఞతలు సమర్పిస్తూ మునుముందుకు సాగారు. మూడు ముక్కల్లో చెప్పాలంటే 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' ఒక సత్పురుషుని సత్కార్యాల సాఫల్య కథ.

దేవులపల్లి రామానుజరావు తమ స్వీయచరిత్రకు 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' అని పేరుపెట్టడం వెనుకటి కథాకమామీషు పరిశీలిద్దాం. తెలంగాణ నిజాం




పరిపాలనలో నిద్రాణమై వుండింది. అవిద్య, ఆకలి దప్పులు, నిరాశా నిస్పృహలు, నాయకత్వ లోపం మొదలైన నిద్రాణావస్థల నుండి మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి వైతాళికుల సారథ్యంలో తెలంగాణ ప్రజలు పోరాడి అస్తిత్వ, అస్మితలను నిరూపించిన నేపథ్యంలో 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' రచింపబడింది.

ఈ గ్రంథకర్త తమ స్వీయచరిత్రను మూడు భాగాలుగా విభజించారు. 1929 నుండి 1949 వరకు భారతీయులు ప్రాణాలొడ్డి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్న మొదటి దశ. నిజాం సర్కారు భారతదేశంలో విలీనమైన కాలం. 1949 నుండి 1965 వరకు రెండవ దశ. నెహ్రూ పాలనా కాలంలో భారతదేశ పురోగతి కాలం. 1965 నుండి 1979 వరకు మూడవ దశ. కేంద్ర సాహిత్య అకాడెమీ రాష్ట్రశాఖగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా 22 ఏళ్లపాటు శ్రమించి, విశ్రమించిన కాలం. నిజాం నిరంకుశ పాలన,

రజాకార్ల దుర్భర హింసా కృత్యాల క్లిష్ట కాల కబంధ హస్తాల నుంచి తప్పించుకునే పోరాటాలు, భారత స్వాతంత్ర్య ఉద్యమం మొత్తం మీద తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివృద్ధికై జరిగిన పోరాటపు వైనం ఈ గ్రంథంలో చక్కగా నిరూపించబడింది. రామానుజరావు గారి మాటల్లోనే చెప్పాలంటే "ముఖ్యంగా ఆనాటి హైదరాబాదు ప్రజల జీవితంలో విషాదకరమైన అంధకార యుగము. అయితే యీ చీకటిలో గూడా కొంత వెలుగు లేకపోలేదు. ఈ చీకటి వెలుగులను గూర్చిన జ్ఞాపకాలు కొన్ని ఉన్నవి." (యాభై సంవత్సరాల జ్ఞాపకాలు– పేజీ: 18) ఈ గ్రంథాన్ని లోతుగా అధ్యయనం చేస్తే దేవులపల్లి రామానుజ రావు జాతీయ, ఆంధ్ర, తెలంగాణ పునరుజ్జీవన ఉద్యమాల్లో తానొక సామాన్య కార్యకర్తగా, ప్రముఖ నాయకుల అనుచరునిగా పాత్ర వహించినట్లుగా చిత్రించుకున్న వినయముద్ర వ్యక్తమవుతుంది.

దేవులపల్లి రామానుజరావు 1917 ఆగష్టు 25వ తేదీన వరంగల్లులో జన్మించారు. "నిత్య జీవితానికి లోటు లేని భూవసతి గల కుటుంబం" (పేజీ: 89) నిజాం కళాశాలలో బి. ఏ, నాగపూరు విశ్వవిద్యాలయం నుంచి ఎల్.ఎల్.బి. పట్టా సంపాదించుకున్న తర్వాత న్యాయవాద వృత్తి చేపట్టాక ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు గారి సలహా మేరకు తనకిష్టమైన సాహిత్య, పత్రికోద్యమ, సాంస్కృతిక క్షేత్రాలకే అంకితమయ్యారు. ఆయన పుట్టిన వూరైన వరంగల్లు నుంచి 1946లో 'శోభ' అనే సాహిత్య మాసపత్రికను సంవత్సరం పాటు, తర్వాత 1950 ప్రాంతంలో మరో ఏడాది పాటు సురవరం, బూర్గుల రామకృష్ణారావు లాంటి పెద్దల, కాళోజీ, దాశరథి లాంటి మిత్రుల సహకారంతో నడపగలిగారు. దాశరథి, ఇల్లిందల సరస్వతీ దేవి గార్ల తొలి రచనలు 'శోభ' లోనే ప్రచురితమయ్యాయి. ప్రియ మిత్రులు రాజా రామేశ్వరరావు, నూకల నరోత్తమరెడ్డి గార్ల సలహా మేరకు, రెండవసారి గోలకొండ పత్రికలో ఇరవై ఏళ్ల పాటు సంపాదక బాధ్యత వహించారు. తెలంగాణ సాంస్కృతిక వికాసానికి ఆయన ఈ ఇద్దరు మిత్రులతో కలిసి ఎనలేని సేవ చేశారు.

రామానుజరావుగారు చదువు సంధ్యలు నేర్చుకున్న కాలం, తెలంగాణలో విలసిల్లిన మహానుభావులు మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, దూపాటి వెంకట రమణాచార్యులు, మందుముల నరసింగరావు మొదలైనవారు. వీళ్ళు సమకాలీన రాజకీయ, సాహిత్య, చరిత్ర రంగాల్ని గొప్పగా ప్రభావితం చేసిన ఘనులు. హైదరాబాదులోని ఉస్మానియా విశ్వ విద్యాలయం, నిజాం కళాశాల ఎంతోమంది యువతీ యువకుల్ని సాంస్కృతికంగా తీర్చిదిద్దిన సరస్వతీ ఆలయాలు. భారత దేశంలోని మేధావులైన రాజాజీ, సర్వేపల్లి రాధాకృష్ణన్, సి.పి.రామస్వామి అయ్యర్, కట్టమంచి రామలింగారెడ్డి, కాంగ్రెసు నాయకుడు ఎస్. సత్యమూర్తి, భారత కోకిల సరోజినీనాయుడు మొదలైన ప్రతిభావంతుల ఉపన్యాసాలు ఆనాటి యువతరంలో దేశభక్తి, సంస్కృతీ ప్రేమ, జ్ఞాన పిపాసను రేకెత్తించాయి. అది నాటి యువతకు స్వర్ణ యుగం లాంటిది. దేవులపల్లి రామానుజ రావుగారు బంగారు కాలాన్నిలా వర్ణించారు. "నిజానికది మహోన్నతమైన, మహోదాత్తమైన వ్యక్తిత్వము, సంస్కృతి గల నాయకుల యుగం. వారందరూ రాజకీయ రంగంలోను, విజ్ఞాన రంగం లోను అతిరథ, మహారథులైన సవ్యసాచులు. త్యాగ మూర్తులు. భారతదేశ వైతాళికులు, యువకులు, విద్యార్థులు వారి నుండి ఉత్తేజం పొందేవారు. (పేజీ: 35)

నిజాం కళాశాల ఆ రోజుల్లో విశిష్టమైన విద్యాకేంద్రం. మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలగా వుంటూ ఆంగ్ల భాషా మాధ్యమంలో పాఠ ప్రవచనాలు సాగిస్తున్నా, యువతకు ఆంగ్ల భాషా సాహిత్యాలతో పాటు తెలుగు, సంస్కృతం, ఉర్దూ, మరాఠీ భాషా సాహిత్య సంస్కృతులను నేర్పించేది. నిజాం కళాశాల దేశికోత్తములైన విద్వాంసుల నిలయం. ఆచార్యవర్యులు సరిపల్లి విశ్వనాథశాస్త్రి, ఆచార్య కురుగంటి సీతారామయ్య తెలుగు బోధిస్తే, ఆచార్య సిరుగూరి హనుమంతరావు రాజకీయ శాస్త్రం, చరిత్రను, ఆచార్య యస్. కె. అయ్యంగారు ఆర్థిక శాస్త్రాన్ని, ఆచార్య అరుణాచల శాస్త్రి గణిత శాస్త్రాన్ని, ప్రిన్సిపాల్ విలియం టర్నర్, మార్టిన్, రాఘవన్, అల్లావుద్దీన్, ఫజుల్‌హక్‌లు ఆంగ్ల భాషా సాహిత్యాల్ని రంజకంగా, విజ్ఞాన దాయకంగా చెప్పేవారు. ప్రతిభావంతులైన, శిష్య వాత్సల్యం చెలువు తార్చిన మూర్తులైన గురుదేవుల గరిడీలో చదువు సాములు నేర్చిన అదృష్టవంతులు దేవులపల్లి వారు."ఆనాటి ఉపాధ్యాయులను తలుచు కుంటే హృదయం ఉప్పొంగుతుంది. వెనుకటి గురుకులాలను వారు జ్ఞప్తికి తెస్తుండేవారు." (పేజీ:40) గుండె లోతుల్లోంచి ఉబికి వచ్చిన ఈ అనుభవం ఈ తరం విద్యార్థి లోకానికి గగన కుసుమమే కదా!

రామానుజరావు గారి జీవితంలో ముక్కాలు మువ్వీస భాగం ఆంధ్ర సారస్వత పరిషత్తు (1943), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ (1957)ల సేవలో గడించింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగుభాషా సంస్కృతుల వ్యాప్తి, సంరక్షణలో కీలకమైన పాత్ర వహించింది. రామానుజ రావుగారి మాటల్లోనే దాని ప్రాధాన్యం గురించి విందాం. "భారత స్వాతంత్ర్య ప్రాప్తికి ముందరి నుండియే తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ కొరకు విజయవంతంగా పోరాడి యీనాడు రాజధాని నగరంలో సుస్థిరంగా నిలిచియున్న సాహిత్యసంస్థ జాతీయ సంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు." (పేజీ: 96) ఆయన పరిషత్తుతో తనకున్న సన్నిహిత సంబంధాన్ని ఇలా పేర్కొన్నారు.

"1948–58 మధ్యన పరిషత్తుతో అవినాభావ సంబంధము కలిగినది. ఇతర ఉద్యమాలు వేనిలో పాల్గొనినా, అవి రాజకీయ ఉద్యమాలైనను, సాంస్కృతిక, వైజ్ఞానిక ఉద్యమాలైనను, ఏ వైనను జీవితముతో పూర్తిగా పెనవేసుకు పోయినది సారస్వత పరిషత్తు మాత్రమే." (పేజీ: 104) రామానుజరావు పరిషత్తు పరీక్షల్ని ఆంధ్ర,

కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు విస్తరింపచేశారు. పరిషత్తు ప్రగతికి హైదరాబాదు నగరంలోని హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ సాహిత్య సంస్థలు సైదోడు వాదోడుగా నిలిచాయి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా దేవులపల్లి వారు 22 సంవత్సరాలు పనిచేసి, వందలాది తెలుగు సాహిత్య గ్రంథాలు ప్రచురింపచేశారు. తెలుగు కావ్యాల్ని పరిష్కరింపచేసి, పాండిత్య పూర్ణమైన, విమర్శనాత్మకమైన పీఠికలతో పాటు ముద్రింపచేశారు. నిఘంటువులు, మహాకవుల పదప్రయోగ కోశాలు, వృత్తి పదకోశాలు ప్రచురింప చేసి రాష్ట్ర సాహిత్య అకాడమీ గౌరవ ఘనతల్ని పెంపొందింపచేశారు. రామానుజరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని కవి పండితుల్ని అకాడమీ కార్యకలాపాల్లో పాల్గొనేలా చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎందరో మహానుభావుల పరిచయ భాగ్యం కలిగింది. శేముషీధురంధరులతో సంవాదాలు చేసి, తమ జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, ఆ మహాభాగుల గురించి చక్కని వివేచన చేశారు. అందుకు కొన్ని ఉదాహరణలు–

"అనంతకృష్ణశర్మగారి మూర్తి సుందరమైనది. చిత్తవృత్తి కోమలమైనది. మాట మధురమైనది. శైలి లలితమైనది. హృదయం రసార్ద్రమైనది. వేషం పరిశుభ్రమైనది. శీలం నిష్కళంకమైనది. కొంత మంది ఎంత ప్రతిభావంతులైనా వారితో కలిసి ఎక్కువ కాలము గడుపలేము. కాని అనంతకృష్ణశర్మగారితో ఎంతకాలం గడిపినను మరికొంత కాలం వారి సమక్షంలో ఉండవలెనని హృదయం కోరుతుండేది." (పేజి: 118–119)

యువ నాయకుడు, ధైర్యశాలి, సాహసి ఐన రావి నారాయణ రెడ్డి 'త్యాగ సమయంలో ఎన్నడూ వెనుకాడలేదు' (పేజి: 60) అని కితాబు ఇచ్చారు. పొట్టివారైనా మాటల్లోనూ చేతల్లోనూ ఎంతో గట్టివారైన పెద్దలు (బూర్గుల) రామకృష్ణారావుగారు, (తణికెళ్ల) వీర భద్రుడు గారు. ఉభయులు ఆకారంలో వామనులైనప్పటికి ఉపన్యాస కౌశలంలో త్రివిక్రములు." (పేజి:77) మిత్రులు, సహచరులు, సహవ్రతులు ఐన నూకల నరోత్తమరెడ్డి గురించి రామానుజరావు గారన్న మాటలు వినండి. "సహజంగా గంభీరమైన మనిషి, నిండు కుండ. పేరులో ఉన్న ఉత్తమ శబ్దం నూటికి నూరుపాళ్లు సార్థకం. స్నేహ పాత్రుడు, విశ్వసనీయుడు. (పేజి:93) దేవులపల్లి వారి మనస్సు దేశకాల పాత్రలకు, జాతి, కుల, మతాలకు అతీతమైనది. అందువల్లే అటు ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఇటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఈ రెండు సంస్థల్ని కొన్ని దశాబ్దాల పాటు నిస్వార్థంగా, దీక్షా తత్పరతలతో నడిపారు. ఆయన తన కర్తవ్య నిర్వహణలో పదిమంది సహకారాన్నీ, ఆత్మీయతనూ పొందారు. దేవులపల్లి వారు సాహిత్య అకాడమికి తాను కార్యదర్శిగా 22 ఏళ్ల పాటు వున్న కాలంలో ఆ ఆత్మీయులకు ఇలా కృతజ్ఞతలు తెల్పుకొన్నారు.

"ఈ విధంగా నాలుగు తరాల కవి పండితుల పరిచయం, సన్నిహితత్వం కలిసి పని చేసే అవకాశం నాకు లభ్యమైనవి. సకలాంధ్ర దేశ విద్వాంసుల సహకారం సంపూర్ణంగా లభించినది. రాజకీయపు సరిహద్దులు ఎట్లా ఉన్నప్పటికిని తెలుగు వారందరు సాంస్కృతికంగా ఒకటేనన్న భావం గడిచిన అయిదు దశాబ్దాలలో బలపడింది. వేర్పాటు ఉద్యమాలు వచ్చినప్పుడు కవి పండితులు ఎవ్వరూ అందులో పాల్గొన లేదు. ఇది గమనించదగిన విషయం. (పేజి: 124)



ఒక్క మాటలో చెప్పాలంటే దేవులపల్లి రామానుజరావు మూర్తీభ వించిన సంస్కారం, శుచిత్వం, కార్యనిర్వహణా కౌశల్యం అని చెప్పొచ్చు, ఆయన మత సామరస్యానికి చిహ్నమైన హైదరాబాదీ తహజీబ్ (సంస్కృతి) కు చక్కని నిదర్శనం. ఆయన జాతి, మతాలకు అతీతమైన గుణగ్రహణ పారీణతకు ఈ మాటలు ఉదాహరణ–" ఉదార భావాలు కలిగిన పరిపాలన దక్షుడు ఆయన, మాడపాటి హనుమంతరావు వంటి క్రమశిక్షణ కలిగిన మరొకరు ఎవరైన ఉన్నారా అంటే నిస్సందేహంగా నేను హబీబుర్ రహమాన్ గారి (ఈ పుణ్యాత్ముడు హైదరాబాద్‌లోని అంజుమన్ ఏ తరక్కీ కి వెన్నెముక లాంటి వారు. ఉర్దూ భాషా సాహిత్యాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు) పేరు చెప్పగలను." (పేజి: 136)

దేవులపల్లి రామానుజరావు గారి "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు" విలక్షణమైన స్వీయ చరిత్ర. తెలంగాణాలో పుట్టిన ఒక సామాన్య వ్యక్తి తన బుద్ధి హృదయాల మణి కాంచన సంయోగాన్ని అఖిలాంధ్ర సాహిత్య, చరిత్ర, సంస్కృతుల పరిరక్షణ, వికాసాలకై సమర్పించిన అసామాన్య శక్తి. "నాది ఎవరిని ఏమీ అడిగే స్వభావం కాదు. నా చేతనైన సహకారం అనేకులకు లభించినది. ఎన్నడూ ఎవరి ముందు తల వంచలేదు. చేయి చాప లేదు. అన్ని జాతీయోద్యమాలలో పాల్గొని ఆత్మ గౌరవంతో జీవితాన్ని గడిపినాను." (పేజి: 133) సరళజీవి స్వార్థ రహిత, సాంస్కృతిక సేవా జీవితాన్ని స్ఫటిక స్పష్టంగా చిత్రించిన గ్రంథం ఈ 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు."

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11 (32) హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# మడమతిప్పని కార్యవాది – కావ్యశీలి 'గాడిచర్ల హరిసర్వోత్తమరావు'

డా. దండెబోయిన పార్వతీదేవి, ఫోన్ : 94408 34017

**"రాజుకు రాజుగా బంటుకు బంటుగా**
**వ్యాజ్యము లేని వ్యవహర్తవుగా**
**నైజములోనే సేవాభావము**
**నాటుకున్న నయశాలివిరా" – శ్లిష్టా సత్యనారాయణగారు.**

నైజములోనే సేవాభావము నింపుకున్న దేశభక్తుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు. ఎన్ని ఉద్యమాలకు పితృపాదులో, వీరు ఎన్ని సంస్థలు నిర్వహించారో, ఎన్ని పుటల సారస్వతం వెలయించారో లెక్కించలేము. మాతృదేశం పట్ల అవ్యాజ్యమైన ప్రేమ; సేవాభావం; అందుకు తగిన దృఢసంకల్పం, దాన్ని అనుసరించే గంభీరమైన దక్షత; మడమ తిప్పని కార్యశీలత్వం కలగలసిన మూర్తిమత్వమే గాడిచర్ల వారు.

నేల రాలేదాకా సేవ చేస్తూనే ఉంటానన్న ఈ మహనీయుడు అతి నిరాడంబరుడు. అలుపెరుగని యోధుడు, ఆంధ్రుల పాలిటి దేవుడుగా కీర్తించబడ్డాడు. 'సర్వోన్నతుని జీవితం' అనే రచన చేస్తూ శ్రీ మాదాల వీరభద్రరావుగారు ఆ మహానుభావుడు నేలరాలినా, ఎన్ని యుగాలకైనా చిరంజీవేనని అంటారు. అంతేకాదు ప్రకృతిలో లభించే అనేకానేక నిధులను మనం జాతీయసంపదగా పరిగణిస్తాం. కానీ ఇలాంటి వ్యక్తుల జీవితంలోని గంభీరమైన అంశాలు ఆలోచనలు దృక్పథాలు వెల కట్టలేని జాతీయసంపద అని గొప్పగా అభిప్రాయపడ్డారు.

గాడిచర్ల హరిసర్వోత్తములు 1883 సెప్టెంబర్ 14న కర్నూలులో పుట్టారు. 1906లో బిపిన్ చంద్రపాల్ గారి వందేమాతర ఉద్యమ ప్రభావంతో జాతి విమోచనం కోసం తానూ కార్యరంగంలో దూకారు. ఈ పోరాటజీవితంలో ఆయనకెదురైన ఆటుపోట్లెన్నో. అంతకు మించిన ఆత్మతృప్తి కూడా ఆయన పొందారు. ముప్పై ఏళ్ళ ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హునిగా చేసిన బ్రిటిష్ వారి శిక్షలు – జైళ్ళలోని నరకయాతనలు జీర్ణించుకో దగ్గవికాదు. అయినా వీరు మడమ త్రిప్పలేదు. రేపటికి తిండికి ఏమీలేదని భార్య చెప్పినా చింతపడని ఉదాసీన వైఖరి వీరిది. రేపటి భారం దైవానిదే అని వదిలేసే వీరు కేవలం ఆధ్యాత్మికవాది అనుకుంటే చాలదు. దాని వెనుక నున్న సిసలైన మానవతావాదం వారి ప్రతి అడుగులోనూ దర్శనమిస్తుంది.

**సారస్వతమే సాధనం :**

గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఒక విజ్ఞాన ఖని. తరచి చూచినకొద్దీ వీరి జీవనహారంలోని ప్రతి సందర్భము ఒక అద్భుతమైన మణిపూస వంటిది. అర్ధశతాబ్దం పాటు ఆంధ్రుల జాతీయవికాసానికి పాటుపడ్డ వీరు గాంధీయుగంలో మొదటితరం మేధావిగా గుర్తించబడ్డారు. వీరి జీవితాన్ని పరిశీలిస్తే రాజకీయ జీవితం, పాత్రికేయ జీవితం, సాంఘిక సేవారంగం అనే మూడు విభాగాలుగా కనిపిస్తుంది. మరి సారస్వత జీవితాంకం ఏదన్న సంశయం మనకు కలగక మానదు. అయితే ఈ రాజకీయ, పాత్రికేయ, సేవారంగాల్లో పనిచేస్తున్నపుడు వాటి ప్రణాళికా నిర్మాణము, నిర్వహణ, వ్యాప్తి, విస్తరణల కోసం వీరు సారస్వత్వాన్ని సాధనంగా ఎంచుకున్నారు. అనేకంగా రచనలు చేశారు. పత్రికారంగం ద్వారా సాహిత్యరచనా రంగంలోను అనేక వ్యాసాలు, పీఠికలు, జీవిత చరిత్రలు, వచన కవితలు, ప్రపంచ చరిత్ర గ్రంథాలు, సంఘర్షణాత్మక సంస్కరణాత్మక రచనలు, ఇలా విస్తృతంగా సారస్వతాన్ని మనకు అందించారు. ఇవన్నీ జాతివృద్ధి కోసం తాను నిర్దేశించుకున్న లక్ష్యాలను, దృక్పథాన్ని జనానికి చేరువ చేయటం కోసమే.

'మనిషి జీవితం మరో మనిషి కోసం వెచ్చించాల'ంటారు గాడిచర్ల వారు. ఈ మాటలు జానుమద్ది హనుమచ్ఛాస్త్రి గారు చెప్పినవి. వారు 'సుప్రసిద్ధుల జీవితవిశేషాలు' అనే రచనలో గాడిచర్ల వారి వ్యక్తిత్వాన్ని గురించి చెపుతూ అన్న మాటలివి. ఇది నూటికి నూరు పాళ్ళు అనుసరిస్తూ జీవించారు గాడిచర్లవారు. శాసనమండలి సభ్యుడిగా గాంధీగారి వెంట నాటి క్రియాశీలక రాజకీయాల్లో తిరుగుతూ స్వాతంత్ర్యకాంక్ష జాతిలో రగుల్కొల్పారు. గ్రంథాలయాలు స్థాపించారు. ఊరూరా పత్రికలు నడిపారు. మారుమూల ప్రాంతాల్లో చదువులేని వారికి వయోజనవిద్య అవసరమని పాఠశాలలు ఏర్పాటు చేయించారు. విద్య, విద్య ద్వారా విజ్ఞానం, తద్వారా జీవన సంస్కారం, అంతేగాక పరపీడన పట్ల అవగాహన, తద్వారా స్వాతంత్ర్యకాంక్ష పెరుగుతాయని వారు సంపూర్ణంగా నమ్మారు. ప్రత్యేకించి కార్మిక కర్షక అట్టడుగు బలహీన వర్గాలకు విద్యనందజేయటమే లక్ష్యంగా వీరు గ్రంథాలయాల స్థాపన ఒక ఉద్యమంగా చేపట్టారు. వయోజనుల విద్య కోసం ప్రత్యేకంగా పాఠ్యాంశాలను తయారుచేసారు. పత్రికను ప్రగతికి చిహ్నంగా భావించి చదివింపజేవారు.

మానవసేవయే మాధవసేవగా నమ్మి ఎందరికో తాను స్ఫూర్తిగా నిలిచారు.

**"పువ్వులగొని తెచ్చి పూజింపనేలకో**
**విరుల గుంపున నిన్ను నరయువాడు**
**పుణ్యవాహినులలో బోయి క్రుంగగనేల**
**హృదయగీతముల నిన్ను వెదకువాడు**
**వర్ణాశ్రమములంచు పరితపింపగనేల**
**బుధులందు నిను జూచి పొంగువాడు**
**కల్ల విగ్రహముల కరుణ వేడుటయేల**

ఘనకార్యముల నిన్ను కనెదువాడు -
.... మాయలోబడి సత్యంబు మరచునొక్కొ" .....అంటారు.

మనం చేసే ఘనకార్యాలలో దేవున్ని చూడవచ్చునన్న వీరి ప్రబోధం సమాజానికి అవసరమైనది.

**పాత్రికేయులుగా గాడిచర్లవారు**

పాత్రికేయులుగా గాడిచర్ల వారి జీవితం బహుముఖీనం. ఎడిటర్ అనే పదాన్ని తెరమీదకు తెచ్చినవారు వీరు. పలు పత్రికల స్థాపన, నిర్వహణ, కర్తృత్వము - ఇలా పలు విభాగాలలో వారు పనిచేశారు. చిత్తశుద్ధితో పత్రికల విలువ పెంచారు. 1908లో స్వరాజ్యపత్రిక, 1914-16లలో ఆంధ్రపత్రిక, 1920-22ల మధ్య వచ్చిన 'ది నేషనలిస్ట్' అనే ఆంగ్లపత్రిక 1922లో సౌందర్యవల్లి, 1930లో మాతృసేవ, గ్రంథాలయ సర్వస్వం - ఇలా పలు పత్రికలను స్థాపించి అందులో క్రియాశీలక పాత్ర పోషించారు. మద్రాసు గ్రామపంచాయితీ (జర్నలు) సహకార మాసపత్రికను మద్రాసు నుండే నడిపారు. తెలుగు, తమిళం, ఆంగ్లభాషల్లో ఇది సాగింది.'అడల్ట్ ఎడ్యుకేషన్ రివ్యూ' అనే మాసపత్రికను ఆంగ్లంలో నడిపారు. వయోజనవిద్య, పంచాయితీ రాజ్యం అనే పత్రిక గౌరవ సంపాదకుడిగా పనిచేశారు.

గాడిచర్ల వారు పత్రికలను తాను స్వయంగా నడిపినా లేదా మరో పత్రికల్లో తాను వ్యాసాలు వ్రాస్తున్నా, భాష ఏదైనా గానీ ఆయన కలం నుండి వెలువడే ప్రతి అక్షరం పదునైనదే. ఆయన కలం ఉద్యమపరమైన దేశాభిమానాన్ని, సంఘసంస్కరణను, విద్యా జీవన సౌకర్యాల సంక్షేమాన్ని జీవంగా నింపుకున్నదే.

**గ్రంథరచనలో గాడిచర్లవారు**

విజ్ఞాన సాధనకు, భౌతిక సౌఖ్యాల అభివృద్ధికి సమాజంలో గ్రంథ పఠనం చాలా అవసరమని గాడిచర్ల నమ్మారు. తదనుగుణంగా విశేష రచనలు వారు వ్రాశారు. అందులో పరిశోధనాత్మక రచనలు కొన్ని, సృజనాత్మక రచనలు కొన్ని అనువాదాలు కొన్ని, విజ్ఞాన దాయకమైన పలు అంశాల విస్తార వివరణ వీరి ప్రతి రచనలోనూ కనిపిస్తుంది. అందులో నేను సేకరించిన కొన్ని రచనలను చూద్దాం. ఎం.ఏ. చదువుతున్న రోజుల్లో వీరు The Neglected Emperor Poet విస్మృత సార్వభౌమ కవి అనే రచన చేశారు. గాంధీ మహాత్ముని నీతి-ధర్మము, మూర్ఖరాజు అనేవి తెలుగులోకి అనువదించారు. మానవసేవ చేసేవాడే భక్తుడు; సుఖి; వాడివల్లెనే దేశానికి సౌఖ్యం అబ్బుతుందన్నది నీతి-ధర్మము రచనలలోని సారాంశం. Spirutual Society (or) Humanitarian Nationalism ఆధ్యాత్మిక స్వదేశీ (లేక) మానవ జాతీయవాదం అనేది మరో రచన ఇందులో అన్ని మతాల సారమొక్కటేనని, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్నే ఇవి బోధిస్తాయన్నది సారాంశం. అంతేకాక రాజకీయ ఉద్యమాలను కూడా ఆధ్యాత్మిక తత్త్వాలతో మేళవించి చెప్పటం వీరి ప్రత్యేకత.



గాడిచర్లవారు ఒకసారి రాజద్రోహనేరం మీద కోర్టుకు వెళ్ళారు. అక్కడ జడ్జికి సాక్షంలో భాగంగా 'శివాజీ ఉత్సవపు'టుపన్యాసం అనే వ్యాసాన్ని ఋజువుగా చూపారట. అది చదివి వినిపిస్తూ ఉంటే ఆ జడ్జి పార్శీపెద్ద పెర్సుఫా పరవశించి పోయాడట. ఇక గాడిచర్ల వారికి శిక్షపడదని అందరూ అనుకున్నారట. కానీ ఇంగ్లీషువాళ్ళు ఒప్పుకోరని ఆ జడ్జి ఆరునెలలు శిక్ష వేశారట. ఇది ఈయన ఆకర్షణీయమైన రచనా నైపుణ్యానికి నిదర్శం. ఆ (తర్వాత దాన్ని కూడా రద్దుచేసి ఆంగ్ల ప్రభుత్వం మూడేళ్ళు కఠిన కారాగారశిక్ష విధించటం వేరే విషయం) 'ఓటు' అనేది వీరి ఒక రచన. ఇందులో మన 'ఓటు' దేనికీ లొంగని నాడు మాత్రమే సృష్టి సంరక్షణం జరుగుతుంది. లేదా సృష్టి సంహర్తనమేనని స్పష్టంగా తెలిపారు. ఇక్కడ వీరి సూక్ష్మదృష్టి భవిష్యత్తరాల బాగును కోరుతోంది. 'ప్రభుత్వం' అన్నది వీరి రాజనీతిజ్ఞతకు అద్దంపట్టే మరో రచన. చాలా సుళువుగా అర్థమయ్యేట్టు వారు ప్రభుత్వ పాలనం అంటే ఏమిటో వివరిస్తారు. అది అచ్చంగా కుటుంబ నిర్వహణలాగే అంటారు. స్వయంపరిపాలన, సమాజప్రేమ, బాధ్యత, గ్రామ పునర్నిర్మాణం, పంచాయితీలు మనమే కావాలంటారు. శాసననిర్మాణం, శాసన వివరణము, శాసన నిర్వహణము, వేర్వేరు స్థాయిల్లో దేనికదే ప్రజాస్వామికంగా వ్యవహరించాలని అప్పుడే స్వాతంత్ర్య ప్రయోజనము సిద్ధిస్తుందంటారు. ఈ వ్యవస్థలు దేనికవే విశిష్ట శాఖలని, ఒకటి మరొక దానిని శాసించేట్టు గాని ప్రభావితం చేసేట్టుగ గాని ఉండ రాదన్నది వీరి భావన. చాలా సవిస్తరంగా ప్రభుత్వపాలనాతీరును, ప్రజల బాధ్యతను గుర్తుచేసిన ఈ రచన నిజానికి పాలకులు, ప్రజలు ఖచ్చితంగా చదువదగ్గ రచన. ఇలాంటిదే కౌన్సిళ్ళ చరిత్ర. 'సంపూర్ణ స్వరాజ్యమనే' అనువాదరచన మరొకటి. హిందూ స్వరాజ్ అనే మహాత్ముని రచనను హైందవరాజ్యంగా వీరు అనువదించారు. హైందవ జాతీయోద్యమ పరిణామం అనేది వీరి

స్వతంత్ర రచన. (అముద్రితం). 'శ్రీరామచరిత్రము' (వ్యాఖ్యాన గ్రంథం) 1913లో వ్రాశారు. దీనిని పరమ పుణ్యాత్మురాలైన భాగీరథీబాయికి అంకితం చేశారు. ఇది పదమూడుసార్లు ముద్రణకు నోచుకోవటం విశేషం. ఈ సందర్భంలో అమ్మకు అంకితం చేస్తూ వీరు వ్రాసిన పద్యాన్ని చదువుదాం. ఇది హృదయాన్ని తట్టితీరుతుంది.

**"తల్లి భాగీరథీబాయి ధర్మమూర్తి**
**పోతరాజేడ నీవేడ బుద్ధిహీను**
**యనుచు గినుకను నన్ను నీవాడెదొక్కొ..** అంటూ

**యుడుత భక్తిని రామునకుపచరించె**
**గాదె ! యారీతి నేననుచు గడగినాడ**
**గాన లోపంబు నెంచక కరుణజూపి**
**కోరిక లీదేర్చు నీ ముద్దు కొమరునందు"**

అని ప్రేమతో తల్లికి కానుకనిచ్చారు. ఇది ఆ రోజుల్లో ఉపవాచకంగా విద్యార్థులు చదువుకున్నారు. వీరి మరో రచన 'ప్రచ్ఛన్న పాండవం'. ఇది ఐదంకాల నాటకం. ద్రౌపదీదేవి చరిత్ర ఇందులో ఉంది. గాడిచర్ల వారు భావకవిత్వాన్ని ప్రేమించారు. భావకవిత్వమనే పేరును వీరే స్థిరీకరించారు. మాత్రా ఛందోగీతాలలో భావకవిత్వాన్ని వ్రాసినట్లు తెలుస్తోంది.

**"పండు నీలిమ యాకసంబది / పెండ్లి పందిరి యౌచు వెలయగ**
**అరుణ తరుణిమ నమరు చివురులు /నలరు తోరణి పంక్తి పన్నగ**
**వెండి వెలుగులు తార సంహతి/ దండ దీపావళులు కాగా**
**మావిపండులు మధువు నమరచి / మన్ననంబు జూపగా**
**కుహు కుహూయని కూడిపాటల / కొమ్మకోయిల పిండు పిలువగ**
**రమ్ము ఈశ్వర రమ్ము రమ్మిక / చిమ్ము శుభముల భూస్థలిన్"**

వయోజన విద్యావ్యాప్తి కోసం వీరు చేసిన రచనలు చాలా ఉపయుక్తమైనవి, విజ్ఞానదాయకమైనవి. సత్యప్రియత్వం, విద్యలోని విలువ; మనదేశం, మన శరీరం, మన మతం, వయోజన విద్య, బోధక క్రమం, వయోజన విద్యాగీతం, వంటి రచనలు చేశారు. ఇక అక్షరాభ్యాస పటాలు ఎన్నో (1942-52), 1-5 తరగతుల పాఠ్య పుస్తకాలుగా ఆ రోజుల్లో వాడారు. (1941-42) పౌరవిద్య అనే వీరి రచనను ఆరవ తరగతివారికి మద్రాసు గవర్నమెంట్ దీనిని పాఠ్యగ్రంథంగా ఉంచింది. 'వన్య మృగ సంరక్షణలో మహానందికి గల అవకాశం 'ఇలాంటి ప్రాంతీయపరమైన వ్యాసాలే గాక 1917 -18లో వేదం కంపెనీ అనే ప్రచురణ సంస్థ ద్వారా ప్రపంచ చరిత్ర (గ్రీసు దేశం)ను కూడా 20 ప్రకరణాలను మూడు సంపుటాలుగా తెచ్చారు. ది నేషనల్ ఫ్లాగ్ ఫర్ ఇండియా అనే గ్రంథం మరొకటి. (1916). ఇందులో జాతీయజెండా నిర్మాణంలో శ్రీ పింగళి వెంకయ్య గారి సహకారాన్ని తెలిపారు. 1937లో "కాంగ్రెస్ ఈనాడు గద్దె కెక్కింది" అనే శీర్షికలో వ్రాసిన పద్యాలు ఆలోచించదగ్గవి.

**"ఎనలేని కష్టాలు ఎన్నియో ఓర్చి**
**తిరముగా పోరాడి ధైర్యాన నిలిచి**
**బిడ్డలను బలియిచ్చి పెద్దగా పెనగి**
**కాంగ్రెస్ ఈనాడు గద్దె కెక్కినది**
**పేరు రాజాజీది; పెద్ద గాంధీజీ**
**కాని రాజ్యము వారు కాదు ఏలేది;**
**ఏలేది నీవేను ఏలేది నీవే**
**రాలేగ రావేగ రావేగ నీవు**
**కోవేగ కోవేగ, కోవేగ హక్కు"**

1947లో 'సభలు-సమావేశాలు' అనేది వీరి మరో రచన. ఇది హౌటు కండక్టింగ్ మీటింగ్ అనే ఇంగ్లీషు రచన ఆధారంగా వ్రాశారు. ఇక రేడియో ప్రసంగాలు, పీఠికలు కోకొల్లలు. రెండు దశాబ్దాల పాటు హిందూపత్రికలో ఉపయుక్తమైన గ్రంథసమీక్షలు చాలా వ్రాసారు. ఇవిగాక వీరి అముద్రితాలు ఎన్నో ఉన్నాయి. మేధావులు, గ్రంథాలయాలు, ప్రభుత్వం వీటిని భద్రపరుచుకోవటం పట్ల శ్రద్ధ చూపాలి.

శాస్త్రమంటే ఒట్టి సిద్ధాంతం చేయటం కాదు అది ఒక సత్యాన్వేషణ అని వీరు ఒక పీఠికలో వ్రాస్తారు. అలాగే వీరి జీవితం కూడా కేవలం సిద్ధాంతాల మయం కాదు. సత్యాన్వేషణతో స్వయం ఆచరణతో పునీతమైంది. విద్యావిహీనమైన దేశం ఎన్నటికీ స్వతంత్రదేశం కాబోదని త్రికరణశుద్ధిగా వీరు నమ్మారు. జ్ఞానయోగం గొప్పదని భావించారు. తదనుగుణంగా స్థాపించిన సరస్వతీ మందిరం నేటికి ఆయన జ్ఞాపకంగా నిలిచివుంది. 1906లో కొమర్రాజు వేంకటలక్ష్మణరావు గారితో విజ్ఞానచంద్రిక గ్రంథమండలి స్థాపనలో కార్యదర్శిగా కలిసి పనిచేశారు. వీరు ఏ పదవులు ఆశించలేదు. 1930లో రాజకీయాల నుండి వైదొలగి గ్రంథాలయాలవైపు మళ్ళారు. జీవితమంతా జాతిని ముందుకు నడిపించాలని తపనపడ్డారు. తాను తన కుటుంబం ఆకలితో తపించినా అలుపు లేకుండా శ్రమించారు గాడిచర్లవారు.

పాతతరం వీరిని నిర్లక్ష్యం చేసింది. కొత్తతరానికి వీరు అంతగా పరిచయం లేదు. అయినప్పటికీ ఆంధ్రతిలక్‌గా, గ్రంథాలయోద్యమ స్థాపకుడుగా, విశేష సారస్వతాన్ని మనకందించిన గొప్ప రచయితగా, కవిగా, పత్రికా నిర్వాహకుడిగా అన్నింటిని మించి నిస్వార్థ సేవాభిలాషిగా మనిషికోసం బ్రతుకును వెచ్చించిన మానవతావాదిగా చరిత్ర పుటల్లో వీరు నిలిచిపోగలరు. ఒక వ్యక్తికి ఇన్ని సాధ్యమా! అన్న ఆశ్చర్యాన్ని కలిగించే వీరి జీవితం భావిసౌధాన్ని వెలిగించే దీపస్తంభం. సారస్వతం విలువను పెంచిన మహోన్నత శిఖరం. గాడిచర్ల వారిని స్మరించుకోవడమంటే వీరి ఆశయాలను, ఆలోచనలను మనసు కెక్కించుకోవడమే. వాటివెంట మసలుకోవడమే.

**"వందేమాతరమనగనే వచ్చితీరు ఎవనిపేరు**
**వయోజనవిద్య అనగనే వచ్చి తీరు ఎవరిపేరు**
**గ్రామగ్రామమున వెలసెడి గ్రంథాలయ మెవనికి గుడి**
**అరగని తరగని వొడవని అక్షర దానం బెవనిది "**

**- కాళోజి నారాయణరావు**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11 (35) హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# ఆచార్య మసన చెన్నప్ప సాహిత్య సేవ

**ఆచార్య సూర్యాధనంజయ్** - తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9849104187

ఆచార్య మసన చెన్నప్పగారు తెలుగు సాహితీ వినీలాకాశంలో ముప్పైకి పైగా గ్రంథాలను వెలువరించి, నిరంతరం జ్ఞానకాంతులను ప్రసరిస్తున్న తార. సాహిత్యలోకంలో పరిచయం అక్కర్లేని విజ్ఞాన ఖని. వారు పాఠాలను బోధించి వేలమందికి ప్రత్యక్ష గురువులయ్యారు. ఉపనిషత్తులపై 'సప్తాహం' చేసి తన ప్రసంగధారతో రికార్డ్‌ను సృష్టించడమేకాక ఎంతోమంది అభిమానుల్ని సొంతం చేసుకున్నారు. కొంతమంది గురించి చెప్పాలంటే ఉపమానాలు వెతుక్కోవాలి. కానీ చెన్నప్పగారికి ఉపమానాలతో పనిలేదు! వారు చేసిన రచనలే వారికి ఉపమానాలై వెలుగొందుతుంటాయి.

మల్లిపదాలతో లోకం తీరు తెలిపిన కవి అంటే వారే గుర్తొస్తారు. ఉరకలేస్తూ దూకే నయాగరాన్ని కలంతో ఖండకావ్యంగా చిత్రించిన సృజనకారులంటే వారే గుర్తొస్తారు. అటక మీద నిశ్శబ్దంగా కునుకుతీసే 'ఆ సందుక'ని జ్ఞాపకాల ముల్లెగా అల్లిన కవిత్వకారుడన్నా వారే గుర్తొస్తారు. తెలుగువారి సొత్తు అయిన పద్యాన్ని వాహికగా చేసుకొని 'తెలంగాణోదయం' గావించిన కవి కోవిదుడన్నా వారే గుర్తొస్తారు. ఇలా చెపుతూ పోతే కవిత్వం వారికి కరతలామలకమేమో ననిపిస్తుంది. ప్రసంగం వారి సహజ ఆభరణమేమో అనిపిస్తుంది. పదవీ విరమణ చేసినా తన రచనా వ్యాసంగాన్ని విడవకుండా నిరంతరం గ్రంథాలను రచించడం వారి జీవనసూత్రమేమో అనిపిస్తుంది.

చెన్నప్పగారు మహబూబ్‌నగర్ జిల్లా మాడ్గుల మండలంలోని కొల్కులపల్లిలో జన్మించారు. రామలక్ష్మమ్మ, బుచ్చయ్య గార్లు వీరి తల్లిదండ్రులు. పాలమూరు, నల్లగొండ, హైదరాబాద్‌లలో చదివిన చెన్నప్ప ఉన్నత విద్యలను ఉస్మానియా ఒడిలో పూర్తిచేసి ఆ వెంటనే ఉద్యోగం పొందినారు. 1975లో ఉద్యోగంలో చేరిన వారు 2015 వరకు నాలుగు దశాబ్దాలపాటు నిర్విరామంగా బోధన చేసి, వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకులై ఉత్తమ గురువుగా నిలిచారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, తెలుగుశాఖ అధ్యక్షులుగా సేవలందించారు. అంతేకాదు ఔటా అధ్యక్షులుగా పనిచేసి తెలుగుశాఖవారు ఔటా విధులు అద్భుతంగా నిర్వహించగలరని నిరూపించారు.

చెన్నప్పగారు బాల్యం నుండి స్వశక్తి, స్వాభిమానాన్ని నమ్ముకున్నారు. వీటికి తోడు దీక్షా, పట్టుదల, క్రమశిక్షణలు వారికి పెట్టని ఆభరణాలుగా ఉన్నాయి. అందుకే వారు ఒక సామాన్య పేద కుటుంబం నుంచి అసామాన్య ఉస్మానియా విశ్వవిద్యాలయం



దాక ప్రయాణించారు. ఖండాంతరాలు దాటి రచనలు చేసి ప్రతిభకు ఎల్లలు లేవని చాటారు. తెలుగు సాహిత్యంలో విశిష్టమైన ముద్రవేశారు. కవిగా, రచయితగా, విమర్శకునిగా, వక్తగా భిన్న పార్శ్వాల్లో ప్రతిభాశాలియైన చెన్నప్ప సాహిత్యాన్ని గురించి అవలోకిస్తే మనకు ఎన్నో విషయాలు అవగతమవుతాయి.

డా. చెన్నప్ప బహుముఖ ప్రజ్ఞాశాలి అని చెప్పడానికి వారు చేసిన రచనలే చక్కని నిదర్శనం. కవిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా, స్మృతి కావ్య రచయితగా, యాత్రా చరిత్ర కర్తగా సుప్రసిద్ధులయ్యారు. 1980 నుంచి ముద్రణ రూపం దాల్చి నిలబడిన వారి సృజనాత్మక రచన నేటికీ నాలుగు దశాబ్దాలుగా నిర్విరామంగా సాగుతుంది. ఈ నలబై ఏళ్ళుగా ఉరకలెత్తుతోంది. ప్రవహిస్తున్న వారి సాహిత్యంలో ప్రతి సంవత్సరం ఒక ఉత్తమ గ్రంథం మనల్ని పలకరిస్తూనే ఉంది. ఇప్పటివరకు దాదాపుగా 30దాకా గ్రంథాలు ముద్రింపబడినాయంటే పాఠకలోకంలో వారి రచనాశైలి ఎంత బలమైన ముద్ర వేస్తుందో ఊహించవచ్చు. కృష్ణశాస్త్రి, విశ్వనాథ, నండూరి వంటివారు భావ కవిత్వంలో ఊహా ప్రేయసిలని ఆయువుగా చేసుకొని కవిత్వం రాయగా తెలంగాణలో కూడా ప్రేయసిని ఊహించి కవిత్వం రాయగల కవులు ఉన్నారు అని చెప్పకనే చెప్పారు చెన్నప్ప. 1980లో వెలువడిన "మల్లి పదాలు" లో మల్లిని ఊహా ప్రేయసిగా వారెక్కడ చెప్పుకోకుండా చదివేవారికి అసంకల్పితంగానే ఆ భావన స్ఫురింపజేస్తారు.

చెన్నప్ప గారి రచనా పరంపర ఒకసారి పరికిస్తే మల్లి పదాలు, వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ సూచిక, ప్రాచీన కావ్యాలు, గ్రామీణ జీవన చిత్రణ, నేత్రోదయం (కవిత్వం), సమాలోచనం, బృహద్గీత, బ్రహ్మచర్యం, ప్రకృతి పురుష వివేకం, అగ్ని స్వరాలు, సారస్వత లోచనం, ఈశావాస్యం, వీర సావర్కర్, చెన్నప్ప నానీలు, చెన్నప్ప పీఠికలు, అక్షర కేతనం, నయాగరా, ఆ సందుక, సమదర్శనం, సుందరకాండ, సడి లేని అడుగులు, తెలంగాణోదయం, శుకోపనిషత్తు, ఉద్గీదం, సాహిత్యంలో తత్త్వదర్శనం, మోక్ష సాధనలో దశోపనిషత్తులు, ప్రమీలా త్రిశతి, చింతన, ఆచార్య చెన్నప్ప అమెరికా ముచ్చట్లు వంటి రచనలెన్నో ఉన్నాయి.

వీరు రచించిన 30 గ్రంథాలను నాలుగు భాగాలుగా విభజించుకోవచ్చు. 1. కవిత్వం, 2. విమర్శ – పరిశోధన – వ్యాస రచనలు, 3. అనువాదాలు, 4. ఇతరములు.

## 1. కవిత్వం

చెన్నప్ప గారి కవిత్వం రసహృదయాలను, సహృదయ పాఠకులను మరో లోకాలకు తీసుకెళుతుంది. మన చుట్టూ కనిపించే భౌతిక వస్తు ప్రపంచాన్ని దాటి ఎల్లలు లేని అలౌకిక ఆనంద లోకాలకు పయనింప చేస్తోంది. ఆనందవర్ధనుడి ధ్వని వారి కవితల్లో ప్రతిఫలిస్తుంది. అనేక సమకాలీన అంశాలపై అది వ్యంగ్యాస్త్రాన్ని విసురుతుంది.

ఒక సందర్భంలో 'అమెరికాలో భవనాల అమరిక బానే ఉంది భావాల అమరికే పొసగడం లేదు' అంటారు కవి చెన్నప్ప. ఇలాంటి పదునైన ప్రాసలెన్నో వీరి కవిత్వంలో చూడవచ్చు. ఇంకా చెన్నప్ప కవిత్వంలో పాఠకులను రంజింపజేసేది వీరి పద సంపద. సహజంగానే వీరికి భాష మీద పట్టు, పదాలపై సాధికారత ఉండడంతో రాసే కవితలో అవి జాలరడము సహజమే. ఆ ప్రాసే కవితకు సొగసై నిలుస్తుంది కొన్నిసార్లు. 'నువ్వు కఠిన శిలలని చీల్చుకొని వచ్చిన మొక్కవి. ఆపద చీకట్లో వెలిగే చుక్కవి' అంటారు ఒక కవితలో. సాధారణ పదాలనే ప్రాసగా మలచి వీరు కవిత్వాన్ని అల్లిన తీరు ఎంతో గొప్పది.

1980లో రాసిన మల్లిపదాలతో వీరి సృజనాత్మక శక్తి వ్యక్తమయింది. కూనలమ్మ పదాల ఛందస్సులో వీరు 120 మల్లిపదాలు రచించారు. ఇది వీరి తొలి రచన. మల్లిపదాలు సామాజిక స్పృహకు ఆలవాలమైనవి. తనకు పాఠం చెప్పిన గురువులు డా. సి. నారాయణ రెడ్డి, ఆచార్య కె. గోపాల కృష్ణరావుల ప్రశంసలను పొందింది. ఈ కృతిని తనకు 1972 నుంచి 1977 వరకు సంస్కృత సాహిత్యాన్ని పరిచయం చేసిన 12 భాషల పండితుడైన గుండేరావు హర్కారేకు అంకితం చేయబడింది.

**చూడ వచ్చిన వారు / చుట్టాలు కాబోరు**
**పండుటాకుల జోరు / ఎండుటకే మల్లి**

అంటూ సన్నగిల్లుతున్న మానవ సంబంధాలను గుర్తు చేసారు చెన్నప్ప గారు. 1991లో వచ్చిన వచన కవితా సంపుటి నేత్రోదయం. ఇందులో చెన్నప్ప గారి జీవితానుభవాలు కవితాత్మకమై సహృదయాలను అలరిస్తాయి.

**"ఇంటి ముందు**
**ఉయ్యాల లాంటి మంచం మీద ఒంటరిగా కూర్చొని**
**చీకట్లో నక్షత్రాలను చూస్తూ**
**జ్ఞాపకాలను లెక్క పెడుతున్నాను**
**అవతలి తీరం నుంచి ఆత్మీయులు వస్తారని**
**చూపులను వాకిట్లో కాపలా ఉంచాను"** అంటారు కవి.

స్నేహితులంటే చెన్నప్ప గారికి ఎంత ఇష్టమో 'నేత్రోదయం' అనే కవితలోని పంక్తులు తెలియజేస్తున్నాయి. **నాలాగే** అనే కవితలో

**"మబ్బు నా నేస్తం / నాలాగే వర్షిస్తుంది నా ప్రేమను**
**సూర్యుడు నా నేస్తం / నాలాగే ప్రదర్శిస్తాడు సమతను"**

అన్న పంక్తులు కవి యొక్క దృక్పథాన్ని తెలియజేస్తున్నాయి. ఈ కవితా సంపుటి ప్రతీకాత్మకం అయిందని చెప్పడానికి ఒక ఉదాహరణ.

**"అధైర్యం గొడ్డలి వేటు / రక్తం వలక కుండానే**
**నిర్వీర్యుడిని చేస్తుంది"**

గొడ్డలి వేటు కంటే అధైర్యం ప్రమాదకరమని చెప్పడం ఇందులోని ప్రతీకాత్మకత.

1997 లో 'అమృత స్వరాలు' 2000 లలో 'అగ్ని స్వరాలు' అక్షర రూపాన్ని ధరించాయి. ఈ రెండు గ్రంథాలు చెన్నప్ప ఆస్తిక్య బుద్ధిని తెలియ జేయడంతో పాటు సమాజానికి, వేదాంతానికి ఉన్న సంబంధాన్ని తెలియజేయడం విశేషం. వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు గొప్ప ఆధ్యాత్మిక గ్రంథాలు. ఇవి ఐహిక, ఆముష్మిక సుఖాలను ప్రదానం చేయడంతో పాటు మోక్షానందాన్ని కూడా కలిగిస్తాయి.

**"పసిడి లోపల రాగి విధముగ / జగము నీలో దాగి ఉన్నది**
**రాగి కంటెను పసిడి భిన్నము / జగము కంటెను నీవు భిన్నము"**

అంటూ బంగారంలో రాగిలాగా భగవంతునిలో ఈ ప్రపంచం దాగి ఉందని, రాగికంటే బంగారం వేరైనట్లే జగత్తు కంటే భగవంతుడు వేరని నిశ్చయ బుద్ధితో చెప్తారు కవి.

అమృత స్వరాలలో అక్కడక్కడ వేదమంత్రాలను తెనిగించారు. 'ద్వాసుపర్ణా సయుజా సఖాయా' అనే వేదమంత్రాన్ని ఎంతో చక్కగా

అనువదించారు. అంతేకాదు నాలుగురకాల మనుష్యులను ప్రస్తావించారు.

**"కష్టపడుతూ బ్రతుకు నొక్కడు / కష్టపెడుతూ బ్రతుకు నొక్కడు కష్టమెరుగక బ్రతుకు నొక్కడు / విడిచి సర్వము బ్రతుకు నొక్కడు"**

అమృత స్వరాలతో ఆగకుండా మసన చెన్నప్ప ఆధ్యాత్మిక అనుభవాలను 'అగ్ని స్వరాలు' ద్వారా తెలియజేశారు. ఇక్కడ అమృతం అన్నా, అగ్ని అన్నా భగవంతుడనే అర్థాన్నే ఇస్తాయి. 'అగ్నిమీళే పురోహితమ్ యజ్ఞస్య దేవం ఋత్విజమ్' అని వేదమంత్రం. అగ్ని స్వరాలలో మానవ సంబంధాలను విశేషంగా తెలియజేశారు.

చెన్నప్పగారికి చిన్న పద్యాలంటే చాలా ఇష్టం. కూనలమ్మ పదాలతో మల్లి పదాలు వినిపించారు. 20–25 అక్షరాలలో 'చెన్నప్ప నానీలు' 2005లో అందించారు. తర్వాత గురజాడవారి ముత్యాలసరాలలో అమృతస్వరాలు, అగ్నిస్వరాలు రాశారు. ఉపనిషత్తులను నాలుగువేల ముత్యాల స్వరాలతో అందించిన వారు కూడా చెన్నప్పగారే.

**'కవిత అంటే / కలత రేపేది కాదు**
**ధైర్యానికి / చిగురుతొడిగేది'**

అని కవిత్వ పరమోద్దేశం ఏమిటో తేటతెల్లం చేయబడింది ఈ నానీలో. ఎదిగిన పిల్లలు తమ తల్లిదండ్రుల పట్ల చూపుతున్న అమర్యాదని దృష్టిలో పెట్టుకొని అల్లిన నాని....

**'కడుపులో ఉన్నప్పుడు తంతే / బాధ లేదు**
**బయట ఉండి తంతేనే / నరకం'** – అంటారు.

చెన్నప్పగారు మతంకంటే ధర్మానికి ఎక్కువ విలువ ఇస్తారు. కనుక

**'నీకు ధర్మం తెలిస్తే / అప్పుడు**
**మతం కంటే / మనిషినే ప్రేమిస్తావు'** – అని అంటారు.

వీరి మరొక లఘు కవితా సంపుటి 'అమెరికా ఓ అమెరికా' 2010లో అచ్చయింది. ఇందులో భారతదేశానికి అమెరికాకు పోలిక చెప్పబడింది.

**"అమెరికా దృష్టి / హిమాలయాల వైపు**
**మనదృష్టి / నయాగరా వైపు"** అనడం వల్ల మనకు పాశ్చాత్యుల వేషభాషలంటే ఎంత ఇష్టమో ధ్వని గర్భితంగా చెప్పినట్లయింది.

మన ఇంజనీర్లంతా అమెరికాకు వెళ్ళి ఉద్యోగాలు చేయడాన్ని గుర్తుచేస్తూ చెప్పిన లఘు కవిత 'అమెరికా చాలా తెలివయింది ప్రపంచ మేధావులను, వశం చేసుకుంటుంది' అంటారు.

మరో కవితలో పాశ్చాత్య సంస్కృతిని గర్హిస్తారు (హేళన).







**'అమెరికన్లు/ ఎంత గొప్పోళ్ళు / విలువలే కాదు / వలువలు పట్టించుకోరు'** అని అంటారు. ఉపనిషత్తులను అధ్యయనం చేసిన చెన్నప్ప అమెరికాలో మొదటిసారి పర్యటించినప్పుడు చెప్పిన నాటి ఒక కవిత ఆయన వ్యక్తిత్వాన్ని తేటతెల్లం చేస్తుంది. **'ఉపనిషత్తులు / చదువుకున్శోణ్ణి / బీచీలలో / తిరగవలసి వచ్చింది'** అంటారు.

చెన్నప్పగారి కవిత్వం రసహృదయాలను, సహృదయ పాఠకులను మరో లోకాలకు తీసుకెళ్తుంది. మన చుట్టూ కనిపించే భౌతిక వస్తు ప్రపంచాన్ని దాటి ఎల్లలు లేని అలౌకిక ఆనందలోకాలకు పయనింపజేస్తుంది వారి కవిత్వం. ఆనందవర్ధనుడి ధ్వని వీరి కవితల్లో ప్రతిఫలిస్తుంది. సమకాలీన అంశాలపై అది వ్యంగ్యాస్త్రాన్ని విసురుతుంది. ఒక సందర్భంలో 'అమెరికాలో భవనాల అమరిక బానే ఉంది. భవనాల అమరికే పొసగడం లేదు' అంటారు కవి. ఇలాంటి పదునైన ప్రాసలెన్నో వారి కవిత్వంలో చూడవచ్చు.

'ఆ సందుక' 2010లో వచ్చిన మరొక అద్భుతమైన కవితా సంపుటి. ఇందులో మొత్తం 45 కవితా ఖండికలున్నాయి. అవన్నీ కూడా వైవిధ్యభరితంగా ఉన్నాయి. చిన్నప్పుడు చిన్న సందుకలో బట్టలు, బియ్యం, చింతపండు సర్దుకొని అమ్మ తలమీద మోసుకొని రాగా హైదరాబాదు బస్సు ఎక్కేవాడట చెన్నప్ప. ఆ సందుకను పత్తర్‌ఘట్టిలో పదహారు రూపాయలు ఇచ్చి కొన్నాడట. ఆ సందుకను వర్ణిస్తూ 'అది నా జ్ఞాపకాల పుట్ట / పిల్లల కోడిపెట్ట' అంటారు కవి. తన జీవిత నేపథ్యాన్ని ఆ సందుక కవితా ద్వారా వెల్లడించిన కవి తన కవితా సంపుటికి ఆ పేరే పెట్టడం విలక్షణంగా ఉంది.

**'అర్థాంగి కంటే ముందుగా / నా గదిలో అడుగుపెట్టిన దేవత'** అంటారు. తన విద్యార్థి జీవితానికి సందుకను గట్టి సాక్ష్యంగా నమ్మిన చెన్నప్ప పాత సామాన్లు అమ్మేటప్పుడు అమ్మ గుర్తుకొచ్చి సందుకను అమ్మలేకపోయారట.

ధర్మమొక్కటే కవితలో ధర్మం గురించి చెబుతూ... **'నీ నోరు / నా నోరు / వేరు కావచ్చు / కాని ముద్ద ఒకటే కదా'** అని తెలియ

జేస్తారు. ఇదే విధంగా నీ **ఆత్మ / నా ఆత్మ / వేరు వేరైనా, వాటి స్వరూపం ఒక్కటే కదా!** అని చిన్న చిన్న మాటల్లో ఆత్మ తత్త్వాన్ని స్పష్టం చేస్తారు.

ఇందులో ఆపద్బాంధవుడనే కవితలో కవి **'అది పంకజమని అసహ్యించుకుంటావెందుకు?/ పద్మాలకదే / పుట్టినిల్లు'.** అదే విధంగా **'దళితుడని దూరంగా వుంచుతావెందుకు? / అక్కున చేర్చుకుంటే అతడు / ఆపద్బాంధువుడవుతాడు'** అంటారు. (పుట.37) ఈ కవిత ఆంధ్రప్రభ సాహితీ గవాక్షంలో అచ్చయింది.

ఈ కవితా సంపుటిలోని మరో కవితలో తన తోడి చేనేతలకు **'మార్కండేయుడు / నీ మూల పురుషుడని తెలుసుకో / లయకారుడినైనా / ఎదిరించడం నేర్చుకో'** (పుట.80) అని చెప్పిన వాక్యాలు గమనింపదగినవి.

చెన్నప్పకు పద్యం రాయడంలో దాశరథి, గేయాలు రాయడంలో సినారె, పదునైన మాటల్ని కవితాత్మకం చేయడంలో కాళోజీ ఆదర్శం అనుకుంటాను. **'గిన్నెలు చప్పుడు చేయకపోతే / అది వంటిల్లు కాదు / మైకులు విరగకపోతే / అది అసెంబ్లీ కాదు'** (పుట.83) అని 'కాదనలేం' అనే కవితలో చమత్కరించారు. ఇలాంటి పంక్తులను ఎన్నయినా ఉదహరించవచ్చు. చెన్నప్పగారి కవిత్వంలో ప్రాసలు పదనిసలాడుతాయి. సహజంగానే వారికి భాషమీద పట్టు. పదాలపై సాధికారత ఉండడంతో రాసే కవితలో అవి జారడం సహజమే. ఆ ప్రాసే కవితకు సొగసై నిలుస్తుంది.

చెన్నప్ప వచన కవితలేగాక గేయ కావ్యాన్ని, పద్యకావ్యాన్ని రచించారు. 2010లో వచ్చిన గేయకావ్యం 'నయాగరా'. అమెరికాకు వెళ్ళినప్పుడు నయాగరాను రెండు రోజులు చూసి పొందిన అనుభూతిని గేయకావ్యంగా మలిచారు. ఒకరోజు Niagara Legends of Adventure Theater లో నయాగరా మీద ప్రదర్శింపబడిన లఘుచిత్రాన్ని చూశారు. దానితో ప్రేరణ పొంది **'పేరులేక జలపాతం / పేదవాడే పోయెనంట / నీవు దానిలోన పడుట / చేతనే పేరొచ్చెనంట'** అలవోకగా వచ్చిన ఈ మాటలు కావ్యావతరణకు ఊపిరులూదాయి. ఈ సందర్భంగా చెన్నప్ప గురజాడ పూర్ణమ్మ, విశ్వనాథ కిన్నెర సాని, సినారె నాగార్జున సాగరం, పుట్టపర్తి శివతాండవం మొదలైన కావ్య వస్తువులను స్మరించి నయాగరా కావ్యాన్ని మొదలుపెట్టారు. ఆరంభంలోని పంక్తులు ధ్వని గర్భితమైనవి. **'విశ్వవిభుడగు / విష్ణు పదకము / లంబులంబ్రభ / వించినావో!'** (పుట.1). ఇందులోని విష్ణువును, శివుణ్ణి పేర్కొనడం వల్ల ఒకరు సృష్టి పోషణకు మరొకరు లయానికి కారణభూతు లయ్యారన్న విషయంతో పాటు నయాగరా మృత్యువు పాలైందన్న విషయం కూడా వ్యక్తం కావడం విశేషం.

మన పూర్ణమ్మను ముసలివాడికి ఇచ్చి పెండ్లి చేస్తే, నయాగరా తల్లిదండ్రులు ఆమెను ఇష్టంలేని వానికి ఇచ్చి పెండ్లిచేశారు. ఆ కారణంగా పూర్ణమ్మే కాదు అక్కడి నయాగర కూడ మరణాన్నే కోరుకున్నదని కవి తెలియజేశారు. ఈ కావ్యంలో విశేషించి తెలంగాణ అస్తిత్వ సంస్కృతి గోచరించింది. నయాగరా జలపాతం ఆకారం ఎలా ఉందంటే గుర్రపు గిట్టలా ఉందని బోర్డుమీద రాసి ఉంది. కాని కవి హృదయానికది **'నా తెలంగాణపు / పిల్ల ధరించిన / చేతి కంకణ / మనిపించినదే'** (పుట.25) అంటారు కవి చెన్నప్ప.

ఏకధాటిగా పడుతున్న ధారల్ని చూసినప్పుడు చెన్నప్పకు పోచంపల్లి, గద్వాల వంటి నగరాల్లో నేసిన అందమైన చీరలే కనిపించాయట. **'నీ జలధారల / అందంబంతయు / పీతాంబరముగ / భాసించినదే', 'ఏ గద్వాలలో / పోచంపల్లిలో / నేసిన చీరలు / నీకర్పించిరొ'** (పుట.26) అంటారు. ఇది మాత్రా ఛందస్సులో ఉన్న గేయకావ్యం.

ఈ గేయకావ్యం తర్వాత చెప్పుకోదగినవి పద్యకృతులు. 2013లో అచ్చయిన 'శుకోపనిషత్తు' ఖండాంతర ఖండకావ్యం. చెన్నప్ప గారు ఆస్ట్రేలియాకు వెళ్ళినప్పుడు అక్కడ ఒక తోటలో కలిసి ఉన్న రెండు చిలుకలను చూసి అల్లిన కథ ఇందులోని వస్తువు. భారతదేశం నుంచి ఇద్దరు తరుణవయస్కులు ఆస్ట్రేలియాకు వచ్చి అక్కడే పెండ్లి చేసుకొని సంతానాన్ని కూడా పొందుతారు. వీరి వెంట వచ్చినవే ఆ రెండు చిలుకలు. అయితే వారు విడిపోవడం వల్ల ఆ చిలుకలు అడవిపాలయ్యాయి. అక్కడ జరిగిన సభలో అంతదూరం వచ్చిన వారు ఎంత కలిసిమెలసి ఉండాల్నో ప్రసంగించారు. అనుకోకుండా ఆ సభకు విడిపోయిన జంట రావడం చెన్నప్పగారి సందేశానికి ప్రభావితులై కలిసిపోవడం ఇందలి క్లైమాక్స్. దీన్ని ఒక సుందరమైన పద్యకావ్యంగా మలిచారు కవి చెన్నప్ప.

ఆస్ట్రేలియాలో ఉన్న తెలుగు వాళ్ళ అలవాట్లను గూర్చి ఈ విధంగా వర్ణించారు. **'మాతృభాషన్న, సంస్కృతి మాటయన్న / కట్టుబొట్టన్న, పోతన్న కావ్యమన్న / అతిథి మర్యాదలన్న, సౌహార్దమన్న / తీపియిస్తాలయద్వప తెనుగులకును'** (పుట.33, 15వ పద్యం). కలిమి ఎంతపనైనా చేస్తుందని చెప్పిన ఈ పద్యం ఆలోచింపదగింది. **'కలిమి చేతనే మనమన కలతరేగు /కలిమి చేతనే విలువైన చెలిమితరుగు / కలిమి చేతనే కష్టాలు కలుగుచుండు / కలిమి చేతనే బంధాలు తొలగుచుండు''** అంటారు. భార్య భర్తలంటే ఒక గింజలోని రెండు పలుకుల్లాగా ఉండాలని చెన్నప్ప సారు చేసిన ప్రబోధం ఎంతో విలువైనది. దాంపత్య ధర్మానికి ఎంతో వన్నెతెచ్చేది. భారతీయ సంస్కృతిలోని వివాహ సంస్కారాన్ని, దాంపత్య ధర్మాన్ని అద్భుతంగా చిత్రించిన ఖండకృతి శుకోపనిషత్తు. **(మిగతా వ్యాసం వచ్చేనెలలో)**

# బాలకార్మికుల బతుకు సిత్రం – పల్లెటూరి పిల్లగాడా!

**డా. కందుల శివకృష్ణ,** తెలుగు ఉపాధ్యాయులు ఫోన్ : 9966507875

**పల్లెటూరి పిల్లగాడా**
**పసుల గాచే మొనగాడా**
**పాలు మరచి యెన్నాళ్ళయిందో**
**ఓ పాలబుగ్గల జీతగాడా**
**కొలువు కుదిరి యెన్నాళ్ళయిందో ॥పల్లెటూరి॥**

ఆనాటి, నేటి భారతదేశం పల్లెలకు పెట్టింది పేరు. పల్లెలే అధికం. ఇప్పటికి భారతదేశంలో పరిస్థితులు మారలేవని చెప్పుకోవచ్చు. ఇది పల్లెలో తరాలుగా సాగుతున్న, భూస్వామ్య విధానానికి ఈ గేయం మచ్చుతునకగా అభివర్ణించవచ్చు. పల్లెలోని పేద ప్రజలు అనుభవిస్తున్న జీవితాలకు అద్దం ఈ గేయం. ప్రజాక్షేత్రం నుండి ఆ తర్వాతి కాలంలో బి.నర్సింగరావు గారు నిర్మించిన గౌతమ్ ఘోష్ దర్శకత్వంలో వచ్చిన తెలంగాణ బతుకు చిత్రం 'మా భూమి' చిత్రంలో కూడా తీసుకోవడం జరిగింది.

గ్రామీణ జీవన చిత్రంలో, పల్లెలో ఉన్న పనిపాటల కులాల పిల్లలు 5 సం॥రాలు నిండకముందే దొరగారి కొట్టంలో, గొడ్లకాడ జీతగాడిగా మారే దృశ్యం ఆనాటి పల్లెల్లో ఎక్కడ చూసినా కనిపించే దృశ్యం. ఇప్పటికి కొన్ని పల్లెల్లో, బాలకార్మికులు జీతగాళ్ళుగా, ఇంకా వెట్టిచాకిరిలోనే మగ్గిపోతున్నారని చెప్పవచ్చు.

ఈ బాలకార్మికులు బువ్వ జీతాలకు జీతం ఉండేవారు. బువ్వజీతం అనగా సంవత్సరం మొత్తం పని చేయించుకొని పొద్దుగాల సద్దిబువ్వ పెట్టి, మధ్యాహ్నం (పగటిలి) సద్ది పెట్టి, రాత్రికి చలన్నం పెట్టేవారు. ఈ జీతగాడు ఏగిలి వారకముందే వచ్చి, గొడ్లకాడ పెండతీసి, గొడ్లకొట్టం ఊకి, గొడ్లుచ్చ ఎత్తిపోయాలి. ఆ తర్వాత మేతవేసి, గాబునిండా నీళ్ళు పోసి, కుడితి పెట్టాలి గొడ్లకు. వడ్లు పట్టించేటప్పుడు వచ్చే తవుడును నీళ్ళలో కలిపి కుడితి చేస్తారు. గొడ్ల కొట్టం ఊకినాక, కుడితి పెట్టినాక పాలు పిండాలి. ఈ పనులన్ని అయిపోయినాక, ఇంటికెళ్తే దొరసాని సద్దన్నం పెట్టితే తిని, గొడ్లను విడిచి మేపుకు రావాలి. ఇది వీరు సంవత్సరం మొత్తం చేయ్యాలి. వీరికి పైసలు ఇచ్చేది ఉండదు. కాని దసరా పండుగకు మాత్రం బట్టలు ఇస్తారు. చిన్న దొరగారు వాడిన బట్టలు వీరికి ఇవ్వడం జరుగుతుంది. దీనినే బువ్వజీతం అని అంటారు. ఇప్పటికీ తెలంగాణ పల్లెల్లో ఈ వ్యవస్థ కానవస్తుంది.

తరాలు మారినా, తాతల కాలం నుండి ఈ వ్యవస్థ అంతం కాలేదు. నయావిధానంలో కొద్ది కొద్ది మార్పులు జరిగినాయి తప్ప, వెట్టి విధానం మాత్రం పూర్తిగా అంతంకాలేదు అని చెప్పవచ్చు.




5సం॥లు నిండని ముక్కుపచ్చలారని ఆ పిల్లగాడు 50 గొడ్లను గాచే మొనగాడు. పాలు కూడా మరవకముందే దొరగారి గొడ్ల కొట్టంలో జీతగాడిగా జీవితం మారిపోయిన బతుకు వీరిది. వెతలు వీరివి. ఆ బతుకులు మారాలని ఆ వెతలు తీరాలని ఆనాటి రైతాంగ సాయుధ పోరాటానికి ముందే ఈ గేయం 1946వ సం॥లో సుద్దాల హనుమంతు రచించడం జరిగింది.

ఈ పాలబుగ్గల జీతగాడు అయ్య చేసిన అప్పులు తీర్చడానికి జీతం చేయించే చరిత్ర ఆనాటి పల్లెల్లో ఉండేది. దొరలు వేసే పన్నులకు, శిక్షలకు అంతూ పొంతూ లేకుండా ఉండేది. దొరగారి ఇంటి నుండి ఏ ఇంటికి అయినా కబురు వచ్చిందంటే, ఆ ఇంటికి ఏదో కీడు సంభవించిందిగానే ఆనాడు భావించేవారు. ఆ గడీలలో రాలిపోయిన జీవితాలెన్నో. ఆ గడీలలో ఎన్ని అరాచక చట్టాలుండేవో! ప్రతీ తెలంగాణ పల్లెకు సుపరిచితాలే ఆ చట్టాలు. అందుకే ఇప్పటికి ఆ గడీల ప్రస్తావన తెస్తే కొందరు గడగడలాడి పోతారు. ఆ గడీలకు ఎవరైనా గూడెం నుండి వెళ్ళారు అంటే, ఆ గూడెం గుండె దడలు పెరిగేవని నాటి మనుషుల మాటల్లో, సుద్దాల పాటల్లో స్పష్టమవుతుంది. అందుకే తన పాటల్లో "కొలువు కుదిరి యెన్నాళ్ళయిందో" – "ఓ పాలబుగ్గల జీతగాడా" అని అన్నాడు. కొలువు కుదరడం వరకు మన పని. అక్కడ నుండి బయట పడటం అంటే యముని నుండి తప్పించుకున్నట్టే, ఇది నిజం నాటి చారిత్రక పరిస్థితులకు సాక్షాత్కారం.

**"చాలిచాలని చింపులంగి**
**సగము కాలి చల్లగాలి**
**గోలె చింపు కొప్పెర బెట్టావా**
**ఓ పాలబుగ్గల జీతగాడా**
**దానికి చిల్లులెన్నో లెక్కబెట్టావా" ॥పల్లెటూరి॥**

శరీరాన్ని దాచుకోవడానికి కూడా సరిగ్గా లేని చినిగిపోయిన అంగి (అంగాన్ని కప్పి ఉంచేది – అంగి) ఆ అంగి కూడా చాలీ చాలనట్టు ఉండటమే గాకుండా గాలికి, వానకు, ఎండకు, అడవిలో ముళ్లకు తగిలి, నిప్పుకొర కాసులు తగిలి సగము కాలిపోతే వాటిని ధరించి, ఆ జీతగాని మనోవేదన ఏరీతిగా ఉంటుందో మనం ఊహించుకోవచ్చు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ, దిక్కుతోచని స్థితిలో బిక్కు బిక్కుమంటూ, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, దొరగారి గొడ్లు కాయడానికి అడవికి వెళ్ళేవాడు. తనను తాను రక్షించుకోవడానికి, ఎండ నుండి, వాన నుండి, చలినుండి దొరగారి కొట్టంలో ఉన్న తవుడు బస్తాలు, అందులో నుండి ఒకటి తీసుకొని, దానిని కొప్పెరగా చేసుకొని నెత్తికి తగిలించుకొనేవాడు. బస్తాను నిలువుగా చేసి, అందులో సగం మడచి ఎండ, వానల నుండి రక్షించుకోవడానికి కొప్పెర పెట్టుకునేవారు. “గోలెచింపు కొప్పెర బెట్టావా” అనగా నాటి గోనెబస్తాలు జనుపనార బస్తాలు వాటిని కొప్పెరగా చేసుకున్నాడు అనుకోవచ్చు. ఆ గోలె చింపుకు అనగా ఆ చినిగిపోయిన బస్తాకు లేదా చీకిపోయిన బస్తాకు చిల్లులెన్నో లెక్కబెట్టావా? ఓ పాలబుగ్గల జీతగాడా! అని రాయడంలో కవి హృదయం ఎంత ఆర్ద్రతతో నిండిపోయిందో మనము అవగాహన చేసుకోవచ్చు. అలాగే ఆ జీతగాడి పరిస్థితి మనకు అవగతమవుతుంది. ఇటువంటి దీనాలాపనలు ఉన్న ఆ జీతగాడి జీవితం ఎన్ని మలుపులు తిరుగుతుందో. ఎన్ని అవమానాలకు ఎన్ని ఆటుపోట్లకు గురి అయిందో, నాటి జీవనస్థితి గతులన్ని ఈ వ్యాఖ్యల ద్వారా మనం తెలుసుకోవచ్చు. చిరిగిపోయిన బస్తాను కొప్పెరగా చేసుకున్న, ఆ పిల్లగాడి జీవితం దయనీయంగా ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. చిల్లులు అనగా రంధ్రాలు ఈ చాలీచాలని చింపుల అంగికి కారణమయిన ఆనాటి వ్యవస్థ పై ఎక్కుపెట్టిన ఈటె ఈ గేయం. గేయం అనే దానికంటే ప్రజల గాయం అని అంటే బాగుంటుంది. గాయాలు పెనవేసుకున్నప్పుడు తెలంగాణ పల్లెల్లో గేయాలు పుడుతుంటాయని సుద్దాల హనుమంతు తన జీవితంలో చెప్పుకున్నాడు. తన జీవితంలో తెలుసుకున్నాడు. అందుకే గాయాలన్నింటిని గేయాలుగా మలచి, ప్రజలకు ప్రభాత గీతాలుగా మలచినాడు. ఒక గాయం శరీరంపై మచ్చని మిగిలిస్తే ఒక గేయం సమాజంపై చెరగని ముద్రని వేస్తుంది. ఆ గేయంతో ప్రభాత కిరణాలు వెలువడి సమాజ మార్పుకు కారణమవుతాయి. అందుకే ప్రజల గాయాలే ప్రజాకవుల గేయాలు. వారి మాటలే వీరి పాటలు. వారి ఆటలే కళారూపాలు గోలెచింపు చిల్లులను లెక్కపెట్టే హీనస్థితి నుండి దానికి కారణమయిన వారిపై పోరాటం చేసేలా పురికొల్పుతాయి గేయాలు. కొప్పెర పెట్టిన ఆ చేతులే కొడవలి పట్టి ముందుకు సాగే దిశను చూపించాయి సుద్దాల హనుమంతు గీతాలు. అందుకే ఇక్కడ బతకాలంటే యుద్ధం చేయాలి. ఆ యుద్ధంలో పోరాడాలి, గెలవాలి. అవసరమైతే ప్రాణ త్యాగాలు చేయాలి. ఆ పాలబుగ్గల జీతగాడి ఆవేదన తీర్చడం కోసం

**“తాటిజెగ్గల కాలిజోడు**
**తప్పటడుగుల లెప్ప రైటు**
**బాటతో పని లేకుంటైందా**
**ఓ పాలబుగ్గల జీతగాడా**
**మేటికర్ర తోడైపోయిందా”** ॥పల్లెటూరి॥

ఆ పిల్లగాడి దొరల దగ్గర బువ్వజీతానికి కుదిరి, పొద్దుగాల సద్ది బువ్వ తిని పశువులను తోలుకొని అడవిలోకి వెళ్ళినపుడు, ఆ గొడ్లు మేతకోసం ఎక్కడ గడ్డి కనిపిస్తే, అక్కడికి ఉరుకుతుంటాయి. వాటిని కాపలా కాసే ఈ పిల్లగాడు వాటితో పాటు పరిగెత్తి, ఇతర చేనులు మేయకుండా వాటిని కాపాడాలి. పశువులను మేపుతూ ఉండాలి. ఈ క్రమంలో గొడ్లు అడవిలో మేత కోసం ముందుకు వెళ్తుంటాయి. వాటి వెనుక వెళ్ళాలంటే ముండ్ల కంప కుచ్చుకొని, ఆ బాలకార్మికుడు ఇబ్బంది పడుతుంటాడు. ఈ బాధను తొలగించుకోవడానికి, ఆ అడవిలో దొరికే తాటి జగ్గలు కిందరాలిపడితే, వాటిని తీసుకొని గొడ్డలితో వాటిని నరికి, వాటికి రంధ్రాలు చేసి, పురికోసతో లేదా చిన్న తాడుతో ఉంగటాలు కట్టుకొని, పొదవు ఉన్న జెగ్గలను గొడ్డలితో నరికివేసి, చెప్పులు లాగా తయారు చేసుకొని, వాటిని తొడుక్కొని గొడ్లు ఎటువైపు వెళితే అటువైపు వాటి వెనుక పరుగెత్తుతూ, వాటిని అదిలించుకుంటూ వాటికి కాపలా కాస్తూ ఉంటాడు. అప్పుడు ఆ జెగ్గల చెప్పులతో ఉరుకుతుంటే కుడికాలు తిరుగుతుంటుంది. తిరగల మరగల అప్పుడు కాలు జారుతూ నడక కుడిది, ఎడమవైపు ఎడమది కుడివైపు తిరిగి ఎంతో వేదనకి గురిచేస్తాయి. కాని ఆ పిల్లగాడి బతుకు కుడి, ఎడుమల మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. బాటతో పని లేకుండా పోయే ఆ బాటసారికి బతుకు జీవన విధానంలో, మేటికర్ర (చేతికర్ర) అతనికి తోడు నీడగా నిలబడి అతనికి ఆసరా నిస్తుంది. ఇది పల్లెటూరి పిల్లగాని బతుకు వేదనగా అభివర్ణించవచ్చు.

**“గుంపు తరలె వంపులోకి**
**కూరుచున్నవు గుండుమీద**
**దొడ్డికీ దొరవైపోయావా**
**ఓ పాలబుగ్గల జీతగాడా**
**దొంగ గొడ్లానడ్డగించేవా”** ॥పల్లెటూరి॥

గొడ్ల గుంపు తరలె వంపులోకి (డొంకబాట), మేతకు వెళ్ళే పశు వుల మంద, అడవిలో ఏ దిక్కు వెళ్తుందో చూడానికి, అన్నింటిని కాపలా కాయడానికి, ఎత్తుగా ఉన్న గుండు మీద కూర్చుని, అన్నింటిని అదిలిస్తూ వాటిని కాపలా కాస్తూంటాడు. ఆ దొరగారి శెలకకు – కాపలా కాస్తూ, ఆ శెలకలో ఉన్న దొడ్డికి (పశువులకొట్టం) దొరవై

పోయావా. తన బతుకుజీవనచిత్రం దానితో ముడిపడి ఉంది. ఆ చేనుకు శెలకకు, దొడ్డికి కాపలాగా ఉంటూ దొంగగొడ్లు అడ్డగించేవా! (కాపలా కాస్తున్నావా) ఓ పాలబుగ్గల జీతగాడా – దొంగగొడ్లును అడ్డగిస్తున్నావు కాని నీ బతుకును ఈ స్థితికి తీసుకువచ్చిన ఆనాటి దొంగలను (పాలకులను) అడ్డగించలేని బతుకు బతుకుతున్నావా ఓ పాలబుగ్గల జీతగాడా! నీ బతుకులోకి మెతుకురావాలంటే, దొంగ గొడ్లని అడ్డగించి నట్టే, దొంగపాలకులని కూడా అడ్డుకొమ్మని అంతర్లీన సందేశాన్ని ఇస్తున్నాడు.

**"కాలువై కన్నీరు గార**
**కండ్లపై రెండు చేతులారా**
**వెక్కి వెక్కి ఏడ్చుచున్నావా**
**ఓ పాలబుగ్గల జీతగాడా**
**యేవరేమన్నారో జెప్పేవా" ။పల్లెటూరి။**

దొరగారి కొట్టానికి కాపలా ఉండుకుంటూ, దొరచేను, శెలక, ఇతరుల గొడ్లు మేసినా, ఇతర గొడ్లు ఆ చేనువైపు వచ్చినా, దొరకు క్షణాల్లో సందేశం అందుతుంది. ఇంటికి వచ్చిన ఆ జీతగాడి పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుంది. ఎందుకంటే పశువులు మేత మేయకున్నా, సరిగ్గా పాలు ఇవ్వకున్నా, తప్పి పోయినా, ఆ పిల్లగాడికి ఆ రోజు తన్నులు, తిట్లు తప్పవు. కొన్నిసార్లు తన తప్పులేకున్నా కూడా ఆరోజు దొరకు, దొరసానికి ఇతరులు చెప్పిన మాటలు విని, ఆ జీతగాడిని బాగా కొట్టడం నిత్యకృత్యం. ఆ బాధలను, ఆ వేదనను ఒకరికి చెప్పకోలేక, అమ్మనాన్నలు దగ్గరికి వెళ్ళలేక, ఆ పిల్లగాని వేదన అరణ్యరోదనగా చెప్పవచ్చు. గొడ్లని తోలుకొనిపోతూ, కుమిలి కుమిలి ఏడుస్తూ, ఎవరితో చెప్పుకోవాలో తెలియక, కాలువలై కన్నీరు కారుతుంటే, ఏమిచేయలేని పరిస్థితిల్లో ఎవరైనా చూస్తారేమో అనే భయంతో కళ్లపైన చేతులు వేసుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నావా, యెవరేమన్నారో చెప్పవా! చెప్పు ఓ పాలబుగ్గల జీతగాడా నీ బాధకు కారణమేమిటో ఇప్పటికైనా చెప్పి, నీ గుండె బరువును దించుకోరాదా, ఓ పసిబాలుడా! అని అతని బాధను పంచుకొనే ప్రయత్నం చేస్తున్నాడు సుద్దాల హనుమంతు.

**"పెందలాడ అమ్మనీకు**
**పెట్టలేదా చద్దిమాదు**
**ఆకలిగొని ఆకలిగొని అడలుచున్నావా**
**ఓపాలబుగ్గల జీతగాడా**
**అడవి తిరిగి అలసిపోయావా" ။పల్లెటూరి။**

ఓ పసివాడా! నీ ఏడుపుకు కారణం ఎవరైనా తిట్టిండ్రా, కొట్టిండ్రా, బువ్వ కోసం ఏడుస్తున్నావా! పెందలాడ అమ్మ నీకు పెట్టలేదా చద్దిమాదు తినటానికి చద్ది (సద్ది) మాడు (బువ్వ) మిగిలిపోయిన అన్నం నీకు పెట్టిందా లేదా? ఆకలితో




అలమటించిపోతున్నావా, బువ్వ తిన్నావా లేదా ఇంకా ఏమైనా కారణముందా? లేక గొడ్లతో పాటు అడవి తిరిగి, అలసిపోయి కంప గీరుకుపోయి, ముళ్ళు ఏమైనా కుచ్చుకొని ఏడుస్తున్నావా, లేక ఇంక ఏమైనా బాధ ఉందా నాకు చెప్పు, ఓ పాలబుగ్గల జీతగాడా! అని ఒక తండ్రిలాగా అడుగుతున్నాడు సుద్దాల హనుమంతు.

**"ఆకుతేళ్ళు కందిరీగలు**
**అడవిలోన కీటకాదులు**
**నీకేమైన కాటువేశాయ**
**ఓ పాలబుగ్గల జీతగాడా**
**నిజము దాచక నాతో జెప్పేవా" ။పల్లెటూరి။**

పశువులను మేపడానికి వెళ్ళిన, ఆ జీతగాడి వయస్సు ముక్కు పచ్చలారని బాల్యం. పది సంవత్సరాలు నిండని పసిప్రాయంలో, జీతగాడిగా మారిన పాలబుగ్గలవాడు. ఆవులను మేపడానికి వెళ్ళి నపుడు అడవిలో ఉన్న "ఆకుల క్రింద దాగి ఉన్న తేళ్ళు, చెట్టకు తెట్టె పెట్టుకొని జీవించే కందిరీగలు మరియు అడవిలో ఉండే అనేక రకాలైన కీటకాదులు పురుగులు, జెర్రి మొదలైనవి నీకేమైన కాటు వేశాయా? ఆ నొప్పి భరించలేక ఏడుస్తున్నావా? ఆ బాధను చెప్పుకోవడానికి, నీకు సమీపంలో ఎవ్వరూ లేక ఎక్కిఎక్కి ఏడుస్తున్నావు కదా? నీ ఏడుపు అరణ్య రోదనగా మారినది. నీ బతుకును, నీ ఏడుపుకు కారణాలు వెదికితే నీకు ఉన్న పేదరికమే అని తెలుస్తుంది. నీ బతుకు మారాలన్నా, నీవెతలు తీరిపోవాలన్నా నిన్ను కాటువేసి గాయపరిచినవి అడవిలోని కీటకాదులా లేక, దొరగడిలో ఉన్న మానవమృగాలా? నీ కన్నీటికి కారణము ఏమిటి? నిజము దాచక నాతో జెప్పవా, ఓ పాలబుగ్గల జీతగాడా? ఇప్పటికైనా నీలోని బాధను దిగమింగకుండా, నిజాన్ని నిర్భయంగా చెప్పు. అని ఆ జీతగాడి దీనపరిస్థితిని అక్కున చేర్చుకున్నాడు. తన బతుకుతో సరి పోల్చుకున్నాడు సుద్దాల హనుమంతు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11 (42) హైదరాబాద్ సెప్టెంబర్ : 2022




"మాయదారి జోడుకోడెలు
మాటిమాటికి కంచె దుంకి
పంటచేలు పాడుచేశాయా
ఓ పాలబుగ్గల జీతగాడా
పాలికాపు నిన్నే కొట్టాడా" ॥పల్లెటూరి॥

ఓ పాలబుగ్గల జీతగాడా నీ కన్నీటికి కారణము, అడవిలోకి మేపడానికి తీసుకెళ్ళిన ఆవులతో పాటు హుషారుగా ఉండి, బాగా బుస కొడుతూ, వాటి దగ్గరకు ఎవ్వరిని రానియ్యకుండా అవి మాటిమాటికి గడ్డి మేయకుండా కంచె దుంకి ఎదుటివారి పొలాన్ని, చేలని తింటున్నా జోడుకోడెలు నిన్ను బాగా తిప్పల బెడుతున్నాయా? పంటచేలు అన్ని పాడుచేశాయా? లేక అవి నిన్ను బాగా ఉరికిస్తు న్నాయా? పంట చేలను పాడుచేశాయని వాటికి కాపలా కాస్తున్న పాలికాపు నిన్ను కొట్టాడా? ఈ కొడెలు నీ కన్నీటికి కారణమా? ఏమిటో చెప్పు అని ప్రాధేయపడుతున్నాడు సుద్దాల హనుమంతు.

"నిలువుజీతం నెలకుకుంచం
తాలు తర్పిడి కల్తిగాసం
కొలువగా శేరు తక్కువచ్చిందా
ఓ పాలబుగ్గల జీతగాడా
తలచుకుంటే దుఃఖమొచ్చిందా" ॥పల్లెటూరి॥

"ఓ పాలబుగ్గల జీతగాడా నిలువు జీతం నీకు నెలకు కుంచం". ఈ వాక్యాన్ని పరిశీలించినట్లయితే ఆనాటి తెలంగాణ ప్రాంతంలోని జీతాల వివరాల గురించి తెలుసుకోవల్సిందే. నాడు యజమానుల దగ్గర పిల్లలు మరియు పెద్దలు జీతం ఈ క్రింది విధంగా ఉండేది.

1) బువ్వ జీతం : సంవత్సరం మొత్తం బువ్వ పెట్టి దసరా పండుగకు, ఉగాది / శ్రీరామ నవమికి బట్టలు పెట్టడం.

2) నెలజీతం : నెలకు ధాన్యం (వడ్లు) ఇచ్చి జీతం చేయించుకునే టోళ్ళు.

నెల మొత్తం కష్టపడితే వారికి జీతం కింద 'కుంచెడు' వడ్లు ఇచ్చేవారు. 16 కిలోల వడ్లు నెలకు జీతంగా ఇచ్చేవారు. ఇందులో కూడా మేలిమిరకమైన ధాన్యాన్ని ఇవ్వకుండా యజమాని తాలు వలిపిడి / 'కల్తిగాసం' ఇచ్చేవారు. 'గింజలేని ధాన్యాన్ని తాలు లేదా వలిపిడి అని అంటారు. వడ్లతో పాటు, తాలు కలిపిన ధాన్యాన్ని ఇచ్చి పంపించేవారు. అడిగే ధైర్యం లేదు. అడిగితే వీపు విమానపుమోత మోగేది. ఇంటికి వచ్చినాక ఆ ధాన్యాన్ని ఎగపోస్తుంటే తాలు, వలిపిడి మొత్తం వెళ్ళి పోగా మిగిలేది తక్కువే. కొలువంగ 'శేరు తక్కువచ్చిందా' 'శేరు' అనగా 1 కిలో – ప్రతీ కుంచెడుకు కిలో తక్కువ ధాన్యాన్ని ఇస్తూ యజమాని అమాయక ప్రజల శ్రమదోపిడి చేసేవాడు. ప్రజల్లో చైతన్యం లేక యజమానుల ఆగడాలకు, దుర్మార్గాలకు అంతులేకుండా పోయిందని చెప్పవచ్చు. అందుకే నాటి కమ్యూనిస్టు పార్టీ, మొట్ట మొదట చేసిన పని ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చి 'లెవి' వ్యతిరేఖ విధాన కార్యక్రమాలు చేపట్టింది. ప్రజలకు ఇచ్చేటప్పుడు ఒక కుంద లేదా కుంచె (చిన్నది, పెద్దది) 8 కిలోల కుంచె, 16 కిలోల కుంచెలు ఉండేవి. ఈ విధానానికి వ్యతిరేకంగా రైతుకూలీ ఉద్యమాన్ని

"జనవరి ఇరువదియారు
ప్రజాతంత్ర నినాదాలు
కోటీశ్వరుల నాటకమంటావా
ఓ పాలబుగ్గల జీతగాడ
అంతావొట్టి బూటకమంటావా" ॥పల్లెటూరి॥

ఈ చరణం స్వాతంత్ర్యం వచ్చినాకా రాసినారు. కాని స్వాతంత్ర్యం వచ్చాక ప్రజల జీవితాల్లో ఏమైన మార్పులు వస్తాయి. అనుకుంటే నైజాం పాలన ముగిసింది. కాని ప్రజలకు స్వాతంత్ర్యం రాలేదు. ఆగష్టు 15, జనవరి 26నాడు దేశవ్యాప్తంగా జెండాలు ఎగురు తున్నాయి. నినాదాలు మోగుతున్నాయి. మళ్ళీ దొరల చేతికి అధికారం వచ్చింది. పాలకులుగా మారిపోయి ప్రజలను ఇంకా భయంకరంగా పట్టి పీడిస్తున్నారు. స్వాతంత్ర్యం అనేది ఒక జగన్నాటకం అది కేవలం పెద్దవాడికి మాత్రమే. పేదవాడికి కాదు. వారు ఇచ్చే నినాదాలు, చెప్పే నీతులు వినడానికి పనికి వస్తాయి. కాని కడుపు నింపటానికి కాదు. ఇది కోటీశ్వరులు ఆడే నాటకం. అధికారులు చెప్పే బూటకం అంతా కల్లబొల్లి మాటలు చెప్పే జగత్ కిలాడీలు ఈ రాజకీయ నాయకులు అంటూ హెచ్చరిస్తున్నారు సుద్దాల హనుమంతు. (సుద్దాల హనుమంతు, పల్లెటూరి పిల్లగాడ, 65)

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# ఆరుద్ర 'ఈనాడు' నాటక రచనా వైశిష్ట్యం

**డా. బాణాల భుజంగరెడ్డి,** సహాయాచార్యులు, తెలుగుశాఖ, హైద్రాబాద్ విశ్వ విద్యాలయం ఫోన్ : 9493976813



**ఆత్రేయ సంక్షిప్త పరిచయం**

ఆచార్య ఆత్రేయగా, మనసు కవిగా, మన సుకవిగా ప్రసిద్ధికెక్కిన కిళాంబి వేంకట నరసింహాచార్యులు బహుముఖ ప్రజ్ఞావంతులు. ఆయన గొప్ప నాటక రచయిత, నాటక దర్శకుడు, నటుడు, చలనచిత్ర పాటల రచయిత. స్వభావరీత్యా అభ్యుదయవాది. కమ్యూనిస్టు భావాలున్నవాడు. తెలుగు నాటకాన్ని ఆధునికతవైపు మలుపు తిప్పిన వాడు. సమసమాజాన్ని కాంక్షించినవాడు. ఆయన రచించిన పది నాటకాలూ, పదిహేను నాటికలూ అచ్చయి లభిస్తున్నాయి. అలాగే ఆయన రాసిన వందలకొద్ది చలనచిత్ర గీతాలు తెలుగు వారిని నిత్యం అలరిస్తున్నాయి, ఆలోచింపజేస్తున్నాయి.

**ఆత్రేయ నాటకాల సంక్షిప్త పరిచయం**

ఆత్రేయ రచించిన నాటకాలన్నీ సామాజిక ఇతివృత్తం కలిగినవే. భారతదేశ స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో నాటక రచన చేసిన ఆత్రేయ నాటకాలపై గాంధీజీ అహింసా సిద్ధాంతం ప్రభావం ఎంతగానో కనిపిస్తున్నది. ఆత్రేయ రాసిన నాటకాల్లో 'గౌతమబుద్ధ', 'అశోక సామ్రాట్', 'ఈనాడు', 'విశ్వశాంతి' నాటకాలు అహింసనూ, విశ్వశాంతినీ ప్రబోధించేవి. 'పరివర్తన' నాటకం పెట్టుబడిదారుల పక్షాన కాకుండా సామాన్య జనం పక్షాన నిలబడాలని కవి బాధ్యతను తెలిపేది. పేదవారిపై నాయకుల దౌర్జన్యాన్ని చిత్రించినది 'వాస్తవం' నాటకం. 'అద్దె కొంప' అనే నామాంతరం కలిగిన 'ఎన్జీవో' నాటకం మధ్యతరగతి ప్రజల సమస్యలను చిత్రించిన విషాదాంత నాటకం. **"ఎప్పుడు సంపద కలిగిన/ నప్పుడె బంధువులు వత్తురది యెట్లన్నన్ / దెప్పలుగ చెరువు నిండిన / గప్పలు పదివేలు చేరు గదరా సుమతీ"** అనే సుమతీ శతక పద్యానికి నాటకీకరణ ఆత్రేయ రచించిన 'కప్పలు' నాటకం. పేదల బతుకులతో ఆడుకునే ధనవంతునిపై పేదలు తిరుగుబాటు చెయ్యాలని ప్రబోధించేది, భయంతో బతకలేం, భయాన్ని జయించాలని చెప్పేది ఆత్రేయగారి 'భయం' నాటకం. ఆత్రేయగారి 'మనసూ-వయసూ' నాటకం, 20వ శతాబ్దంలో ఇంకా కులమేమిటని కులవ్యవస్థను ప్రశ్నించినది. మొత్తం మీద ఆత్రేయ నాటకాలన్నీ సమసమాజాన్ని కోరేవి. అహింసనూ, విశ్వశాంతి ఆవశ్యకతనూ ప్రతిపాదించేవి.

**నాటక విమర్శన పద్ధతులు**

నాటకం ప్రధానంగా దృశ్య - శ్రవ్య మాధ్యమం. ఇది సమాహార కళ. ఇందులో సంగీతం, సాహిత్యం, నృత్యం, అభినయం, వాచికం అన్నీ కలగలిసి వుంటాయి. కాబట్టి ఇది ప్రేక్షకులను అమితంగా ఆకర్షిస్తుంది. అందుకే **"కావ్యేషు నాటకం రమ్యమ్"** అన్నాడు కాళిదాసు. అంతేకాదు, నాటకం పండితులనూ పామరులనూ అందరినీ ఆనందింపజేస్తుంది కాబట్టి **"నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనం"** అని కూడా అన్నాడు కాళిదాసు. ఈ నాటకం మూడు రకాలుగా కనిపిస్తున్నది. 1. శ్రవ్యనాటకం (రేడియో నాటకం), 2. పఠన నాటకం (ముద్రిత నాటకం), 3. దృశ్య - శ్రవ్య నాటకం (ప్రదర్శన నాటకం). శ్రవ్య నాటకంలో (రేడియో నాటకంలో) కేవలం పాత్రల మాటలు, పాటలు, సంగీతం మాత్రమే వినిపిస్తాయి. దృశ్యం కనిపించదు. పాత్రల నటనా సామర్థ్యం, ఆయా పాత్రలు వ్యక్తం చేసే హావభావాలు కనిపించవు. ముద్రిత నాటకంలో మాటలు, పాటలు ముద్రిత రూపంలో కనిపిస్తాయి. నేపథ్య సంగీతం, పాత్రల కంఠస్వరంలోని భేదాలు వినిపించవు. పాత్రల నటనా సామర్థ్యం, ఆయా పాత్రలు వ్యక్తం చేసే హావభావాలు కనిపించవు. ప్రదర్శన నాటకంలో పాత్రల మాటలూ, పాటలూ, సంగీతమూ, సంభాషణల్లో పాత్రల కంఠస్వర భేదాలూ వినిపిస్తాయి. సన్నివేశమూ, నేపథ్యమూ, పాత్రల ఆహార్యమూ, నటనా సామర్థ్యం, వారి హావభావాలూ అన్నీ స్పష్టంగా తెలుస్తాయి. అందుకే ప్రదర్శన నాటకాన్ని ప్రదర్శన కళ (Performing Art) అన్నారు. ప్రదర్శింప బడిన నాటకం Theatre పరిధిలోకి వస్తుంది. దీన్ని Play అంటారు. **"ప్రయోగ ప్రధానం హి నాట్యశాస్త్రమ్"** అన్నాడు కాళిదాసు మాళవికాగ్ని మిత్రమ్ నాటకంలో. **"ప్రయోగత్వ మనాపన్నే కావ్యే నాస్వాద సంభవః"** (ప్రయోగ యోగ్యత లేని నాటకం ఆస్వాదనీయం కాదు) అన్నాడు భట్టతౌతుడు అనే ఆలంకారికుడు.

మొత్తం మీద రేడియో నాటకాల కంటే, ముద్రిత నాటకాల కంటే, ప్రదర్శన నాటకాలు రెట్టింపు ఆకర్షణీయంగా, ఆస్వాదనీయంగా ఉంటాయి.

ఆత్రేయ గారి "ఈనాడు" నాటక ప్రదర్శనను ఈ వ్యాసకర్త చూడలేదు. కేవలం ముద్రిత నాటకాన్ని మాత్రమే చదివాడు. అందువల్ల ఈ వ్యాసంలో "ఈనాడు" ముద్రిత నాటకాన్ని ఆధారంగా తీసుకొని మాత్రమే ఈ నాటక వైశిష్ట్యాన్ని వివరించడం జరుగుతుంది. ఎందుకంటే, రేడియో నాటక విమర్శ పద్ధతివేరు. ముద్రిత నాటక విమర్శ పద్ధతి వేరు, ప్రదర్శన నాటక విమర్శ పద్ధతి వేరు కాబట్టి. ఉదాహరణకు, ప్రదర్శన నాటకాన్ని రంగాలంకరణ సన్నివేశానికి తగినట్లుగా ఉన్నదా? పాత్రల దుస్తులు, మేకప్ ఆకర్షణీయంగా, పాత్రోచితంగా వున్నాయా? నటీనటుల నటనా సామర్థ్యం ఎట్లా వుంది? సంభాషణలు ఎట్లా వున్నాయి? నాటక సంగీతం ఎట్లా వుంది? నాటక దర్శకత్వం ఎట్లా వుంది? అనే అంశాల దృష్ట్యా విమర్శిస్తారు. ముద్రిత నాటకాన్ని ఇతివృత్తం, పాత్రచిత్రణ, సంభాషణలు, భాషా ప్రయోగం మొదలైన అంశాల దృష్ట్యా విమర్శిస్తారు. సాంఘిక నాటకాన్ని నాందీ, ప్రస్తావన, పంచసంధులు, భరతవాక్యం మొదలైన వాటి ఆధారంగా కాక, ఇతివృత్తం, పాత్రచిత్రణ, సంభాషణలు, భాషా ప్రయోగం ఆధారంగా విమర్శించాలి. "ఈనాడు" నాటకం సమకాలిక సాంఘిక ఇతివృత్తం కలిగిన నాటకం కాబట్టి ఈ నాటక విమర్శకు నాందీ, ప్రస్తావన, పంచసంధులు, భరతవాక్యం మొదలైన లక్షణాలు అంతగా వర్తించవు. అందువల్ల, ఈ నాటకంలోని ఇతివృత్తం, పాత్రచిత్రణ, సంభాషణలు, భాషా ప్రయోగం అంశాల ఆధారంగా పరిశీలించడమైనది. ఇదే ఈ పత్రం ఉద్దేశం.

**'ఈనాడు' నాటకేతివృత్తం**

ఆత్రేయ 'ఈనాడు' నాటకాన్ని 1947లో మన దేశ స్వాతంత్ర్యానంతరం రచించాడు. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో చెలరేగిన హిందూ, ముస్లిం మత కల్లోలాలనూ, మత ఘర్షణలనూ, వాటి దుష్ప్రభావాలనూ 'ఈనాడు' నాటకంలో చిత్రించి మత సామరస్య ఆవశ్యకతను నొక్కి చెప్పారు. "ఈనాడు భారతదేశాన్ని కల్లోలపరుస్తూ అన్ని విధాలా అభ్యుదయాన్ని అరికడుతూ, స్వతంత్ర భారతదేశ పునాదులను అదరగొడుతూ మన బాపూజీ ప్రాణాలను కూడా చివరికి బలిగొన్న మతావేశ పిశాచి వికటాట్టహాసం యొక్క ప్రతిబింబం యీ 'ఈనాడు' ఇతివృత్తం" అని ఆత్రేయ స్వయంగా 'ఈనాడు' నాటక ఇతివృత్తం గురించి తెలిపారు. (ఆత్రేయ 1990 : 223). "…….Times of great upheaval, Political, Social and Spiritual are usually reflected in the arts, and it is especially with the art of Theatre" (Cunningham 1965: 09) అంటాడు కన్నింగ్ హమ్. "మహాత్ముని మత సామరస్య సిద్ధాంతంలో సంపూర్ణ విశ్వాసంతో రచింపబడ్డ ఈ నాటకం గ్రామగ్రామాన ప్రదర్శింపబడి, ఆయన ఆదర్శ ప్రచారం జరిగి, ఈ మతావేశాన్ని కాస్తయినా చల్లార్చగలిగిననాడే నా 'ఈనాడు' రచన సార్థకమై, ఫలితం దక్కుతుంది" అని మతసామరస్య సిద్ధికోసం తపించి ఆత్రేయ ఈ నాటకాన్ని రచించారు. 1948 జనవరి 18వ తేదీన బెజవాడలో (దుర్గా కళామందిరంలో) జరిగిన 14వ ఆంధ్ర నాటక కళా పరిషత్సమావేశాలలో వెంకటగిరి అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వారిచే ఈ నాటకం ప్రదర్శింపబడిందనీ, ప్రథమ బహుమతి పొందినదని ఆత్రేయ ఈ నాటకానికి రాసిన 'నా మాట' లో తెలిపారు.

1947 ఆగస్టు 14 అర్ధరాత్రి మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా ఆ ఊరంతా త్రివర్ణ పతాకాల తోరణాలతో, వెలుగుతున్న దీపాలతో కళకళలాడుతుంటుంది. ఈ నేపథ్యంలో, రెండు భాగాలుగా ఉన్న ఒకే పెద్ద ఇంట్లో పురుషోత్తం, అక్బరు కుటుంబాలు (తమ మతాలు వేరైనా) ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి నివసిస్తుంటాయి. ఈ రెండు భాగాలను కలుపుతూ మధ్య ఒక తలుపు కూడా ఉంటుంది. అక్బరుకు రహీమ్ అనే కొడుకూ, నసీమ్ అనే ఒక కూతురూ ఉంటారు. పురుషోత్తానికి రామ్ అనే ఒక కొడుకు మాత్రమే ఉంటారు. ఈ రామ్‌కు నసీమ్ అంటే ఎంతో ప్రేమ. తను అభిమానించే నసీమ్‌కు రామ్ ఆ రోజు గాంధీజీ చిత్రపటాన్ని బహుమతిగా ఇస్తాడు. నసీమ్ ఆ చిత్రపటాన్ని తన ఇంట్లో గోడకు తగిలిస్తుంది. స్వాతంత్ర్య సమయంలో జరిగిన దేశ విభజన (ఇండియా, పాకిస్తాన్) కారణంగా చెలరేగిన మతకల్లోలాలతో ఊర్లన్నీ అల్లకల్లోలంగా ఉంటాయి. ఈ ఊరిలో కూడా ఒక విదేశీ డాక్టరు అక్బరు ఇంటికి వచ్చి హిందువు లందరూ మీ కుటుంబ సభ్యులను చంపడానికి ఆయుధాలను సేకరించి పెట్టుకున్నారనీ, అదే విధంగా పురుషోత్తం దగ్గరికి వచ్చి హిందువులందరినీ చంపడానికి ముస్లింలు మారణాయుధాలు తెచ్చి పెట్టుకున్నారనీ చెప్పి అక్బరు, పురుషోత్తం కుటుంబాలను విడగొట్టడా నికి ప్రయత్నిస్తాడు. ఇద్దరి ఇంటి భాగాల మధ్య వున్న తలుపును మూయిస్తాడు. ఆగస్టు 18వ తేదీన ముస్లింలు చంపడానికి వెంటపడగా ఒక హిందూ స్త్రీ (వత్సల) తన చంటిబిడ్డతో సహా అక్బరు ఇంటికి వస్తుంది. అక్బరు, ఆయన కూతురు నసీమ్ ఆమెకు రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చి తమ ఇంట్లో చోటిస్తారు. వత్సలకు నసీమ్ ఇంట్లో రక్షణ కల్పించినా ముస్లింలు వచ్చి ఆమెపై అత్యాచారం చేస్తారనీ, లేదా బలవంతంగా నిఖా చేసుకుంటారనీ, అందువల్ల వత్సల బతికి వుండడం కంటే చావడమే మేలనీ ఆమెను హత్యచేయడానికి హిందువులు ప్రయత్నిస్తారు. ఆ క్రమంలో వత్సలపైకి ఎవరో ఒక హిందువు బాకు విసరుతాడు. అప్పుడు నసీమ్ వత్సలను పక్కకి లాగి కాపాడుతుంది. ఆ బాకు తగిలి నసీమ్ ఇంట్లో గోడకు తగిలించివున్న

గాంధీ చిత్రపటానికి తగిలి కిందపడి ముక్కలవుతుంది. ఆ తరువాత ఒక హిందూ గుంపు నసీమ్ ఇంటికి వచ్చి నసీమ్‌ను చంపుతారు. నసీమ్‌ను చంపకుండా అడ్డువచ్చిన రామ్‌ను ముస్లింలు చంపుతారు. తమ ఇంట్లో రక్షణ కల్పించిన హిందూ స్త్రీ (వత్సల) ని రక్షణ క్యాంపులో వదిలిరావడానికి వెళ్ళిన రహీమ్‌నూ, వత్సలనూ దారిమధ్యలో మతోన్మాదులు చంపుతారు. ఇట్లా విషాదంగా ముగుస్తుందీ నాటకం.

ఆత్రేయగారి "ఈనాడు" నాటకం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఆనాటి హిందూ, ముస్లింల మత ఘర్షణల పరిస్థితుల్లో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందో, ఎప్పుడు ఏ ఊర్లు తగలబడతాయో, ఏ నరమేధం జరగుతుందో తెలియని ఉద్విగ్న పరిస్థితులు నాటకం ఆసాంతం ఆవరించుకొనివున్నాయి. వ్యక్తులకూ, వ్యక్తులకూ మధ్యగానీ వ్యక్తులకూ, సమాజానికీ మధ్యగానీ, జాతులకూ జాతులకూ మధ్యగాని సంఘర్షణ లేకపోతే ఏ నాటకమైనా ఆసక్తికరంగా ఉండదు. " The essential character of drama is conflict. Persons against other persons, or individuals against groups or groups against other groups or individuals or groups against social or natural forces……. (Downer 1965: 82) అని అంటాడు Alan Seymour Downer. "ఈనాడు" నాటకంలో హిందూ ముస్లింల మధ్య ఘర్షణ నాటకమంతా నిండి వుంటుంది. అందుకే నాటకం చదువుతున్నంతసేపూ తరువాత ఏం జరుగుతుందో, ఈ సమస్యకు ముగింపు ఎలా ఉండబోతున్నదో అనే ఉత్కంఠకు పాఠకుడు లోనవుతాడు. "నాటకంలో అనుకరించబడే పాత్రల చేష్టాదికాలు ప్రేక్షకులను ఆకట్టుకోగల ఉద్వేగాలతో కూడివుండాలి. జీవితాలను తారుమారుచేసే ఒడుదుడుకులు, సంఘర్షణలు, చూపే ధైర్యసాహసాలు, వాటిని వ్యక్తం చేసే మాటలు, మనిషి విజయాలు, పతనాలు అంటే మానవ జీవిత ఉద్వేగాల సర్వస్వం అన్నమాట. గొప్ప నాటకాలన్నింటికీ మౌలిక ఉద్వేగాల వ్యక్తీకరణే మూలం అంటారు మొదలి నాగభూషణశర్మ (నాగభూషణ శర్మ మే, 2008: 26). నాగభూషణశర్మగారి మాటలు "ఈనాడు" నాటకానికి వర్తించి ఈ నాటకాన్ని గొప్పనాటకంగా నిలబెడతాయి.

**పాత్రచిత్రణ - పాత్రల నామౌచిత్యం**

నాటకానికి ఇతివృత్తం శరీరమైతే పాత్రలు ప్రాణం. పాత్రల వల్లనే నాటకం ముందుకు నడుస్తుంది. పాత్రల సంభాషణలు, ప్రవర్తనవల్లనే నాటకానికి సజీవత్వం సిద్ధిస్తుంది. సాధారణంగా, కావ్యాల్లో గానీ, కథల్లోగానీ, నవలల్లోగానీ పాత్రల స్వభావాలను రచయితే వర్ణిస్తాడు. కానీ, నాటకాల్లో ఒక పాత్ర స్వభావం, వ్యక్తిత్వం ఆ పాత్రల సంభాషణల వల్లగానీ, చేష్టల వల్లగానీ, లేదా ఇతర పాత్రల మాటల వల్లగానీ తెలుస్తాయి. రచయిత తన నాటకం ద్వారా చెప్పదలుచుకున్న సందేశాన్ని తాను డైరెక్టుగా చెప్పడు. పాత్రల ద్వారా చెప్పిస్తాడు. అందుకే, Characterization is the really fundamental and lasting element in the greatness of any dramatic work. As in the handling of plot, so again in characterization a first condition of dramatic art is brevity (Hudson 1968: 186) అన్నాడు Hudson. "నాటకంలోని రెండు పాత్రలు మాటకు మాట, దెబ్బకు దెబ్బ, ఎత్తుకు పై ఎత్తు ఇట్లు ప్రవర్తించినచో వాని వ్యక్తిత్వము చైతన్యవంతమై అవి సజీవములనిపించును." (చంద్రశేఖర్ రెడ్డి 1880: 143) అని అంటారు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డిగారు. "ఈనాడు" నాటకంలోని పాత్రలను చిత్రించిన విధానాన్ని తెలుసు కోవడంతోపాటు ఆ యా పాత్రల పేర్లు పెట్టడంలోని ఔచిత్యాన్ని కూడా చూద్దాం. ఈనాడు నాటకంలోని ముఖ్యమైన పాత్రలు : అక్బరు, పురుషోత్తం, రామ్, రహీమ్, నసీమ్, వత్సల.

అక్బరు అనేది అరబ్బీ పదం. అక్బరు అంటే మహానుభావుడు, గొప్పవాడు, శ్రేష్ఠుడు అని అర్థం. ఒక సందర్భంలో, "హిందువులు మిమ్మల్ని మసి మసి చేయాలని సిద్ధపడుతున్నారు తెలుసా?" అని డాక్టరు అంటే "మంచిదే" అంటాడు అక్బరు. "ప్రతి హిందువు ఇంట కత్తులు, తుపాకులు సరఫరా చేసి పెట్టారు తెలిసిందా" అంటే "మర ఫిరంగులు ఇళ్ళల్లో పట్టవు కనుక మానేశారు అంతేనా" అని డాక్టరును వేళాకోళం చేస్తాడు.

పురుషోత్తం సంస్కృత పదం. పురుషోత్తం అనే పేరులోనే అతని ఉత్తమ గుణాలను పొదిగాడు ఈ నాటక రచయిత. తన కొడుకు రామ్ తోపాటు అక్బరు కొడుకు రహీమ్ నూ, అక్బరు కూతురు నసీమ్ నూ ఎత్తుకొని పెంచినవాడు.

రహీమ్ అరబ్బీ పదం. దయగలవాడు అని ఈ పదానికి అర్థం. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హిందువు అయిన పురుషోత్తానికి కొత్త బట్టలు కొనితెస్తాడు. ఒక సందర్భంలో, రహీమ్ వత్సలతో "ఎవ్వరికీ బాధలేని మార్గం ఒకటి చెప్తాను వింటావా? అంటాడు. వింటాను చెప్పమంటుంది వత్సల. "రెఫ్యూజీ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు అక్కడికి వెళ్ళు. నిన్ను భద్రంగా నేను చేరుస్తాను. ఏం నసీముక్కూడా నచ్చచెప్పు. వత్సలా ఇందర్ని కాపాడినదానవవుతావు. అంటాడు.

రామ్ సంస్కృత పదం. ఇతను శ్రీరాముని లాగానే సౌమ్యుడు. సహృదయుడు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముస్లిం అయిన అక్బరుకు కొత్తబట్టలు కొనితెస్తాడు. ఒక సందర్భంలో, రామ్ నసీమ్ తో హిందూ మతోన్మాదులు వచ్చేస్తున్నారు. నిన్ను చంపేస్తారు. ఇంట్లోనుంచి వెళ్ళిపోయి ప్రాణాలు కాపాడుకోమని అంటాడు. ఆమె

వెళ్ళదు. మతోన్మాదులు ఆమెను చంపడానికి వస్తే రామ్ వాళ్ళకు అడ్డువచ్చి ముందు నన్ను చంపండి అంటాడు.

నసీమ్ "ఈనాడు" నాటకంలో ప్రధాన పాత్ర. నాటకం మొదటి నుంచీ చివరిదాకా ఉండేపాత్ర ఇది. నసీమ్ అరబ్బీ పదం. "తాజా గాలి" అని ఈ పదానికి అర్థం. నూతన భావజాలానికీ, ఆధునిక ఆలోచనా విధానానికీ ప్రతీక నసీమ్. పేరుకు తగ్గట్టుగానే నసీమ్ ఈ నాటకంలో చాలా అభ్యుదయకరంగా, ఆధునికంగా ఆలోచిస్తుంది. ఒక సందర్భంలో, రహీమ్ వత్సలను గురించి చెబుతూ "ఏం తీర్మానించుకున్నావు" అని అంటాడు. "మనిషిగా వున్నవాళ్ళు చేయతగ్గ తీర్మానమే చేసాను" అని వత్సలను కాపాడడానికే నిశ్చయించు కుంటుంది. మరో సందర్భంలో, ముస్లిం మతోన్మాదులు వచ్చి "అట్లా హిందువులకు ఆశ్రయం ఇవ్వటానికి వీల్లేదు" అంటారు. "అది మా ఇష్టం. మీరెవరు హుకుం చేయడానికి" అని ఎదురు ప్రశ్నవేస్తుంది.

వత్సల సంస్కృత పదం. వత్స అంటే బిడ్డ అని అర్థం. వత్స మీద తల్లికి ఉండే ప్రేమ వాత్సల్యం. వత్సల అనే పేరు ఈ పాత్ర స్వభావానికి అతికినట్లు సరిపోయింది. సార్థక నామధేయురాలు ఈ నాటకంలోని వత్సల. వత్సల పాత్ర ప్రవేశం దగ్గరినుంచి నాటకం చివర తాను చనిపోయేవరకు తన బిడ్డను కాపాడుకోవడానికే ఆరాటపడుతుంది. మరో సందర్భంలో, రహీమ్ వత్సలను రెఫ్యూజీ క్యాంపుకు వెళ్తావా? అని అడుగుతాడు. "నేను వెళ్తాను. నాకేమీ ఆశలేదు. అన్నయ్యా. ఆ ఒక్క పసికందును మాత్రం కాపాడుతానని మాట యిస్తావా? అని అడుగుతుంది. చివరికి, వత్సల రెఫ్యూజీ క్యాంపుకు వెళ్తుండగానే దారిలోనే మతోన్మాదులు కత్తితో పొడిచి చంపుతారు. ఈ రకంగా ఈ నాటకంలోని పాత్రలు సజీవంగా మన కళ్ళముందు కదలాడుతుంటాయి. మన మనోఫలకంపైన ముద్రవేసుకుంటాయి.

**సంభాషణలు**

నాటకానికి ప్రాతలు ఏ విధంగా ప్రాణమో, పాత్రల సంభాషణలు కూడా అదేవిధంగా ప్రాణం. ఎందుకంటే, పాత్రలు లేకుండా సంభాషణలుండవు, సంభాషణలు లేకుండా పాత్రలుండవు కాబట్టి. నాటకంలోని సంభాషణలు సహజంగా, సందర్భోచితంగా, పాత్రోచితంగా, సులభంగా, స్పష్టంగా, ఆసక్తికరంగా ఉండాలి. '.... dialogue should be natural, appropriate, and dramatic; which means that it should be in keeping with personality of the speakers; suitable to the situation in which occurs; and easy, fresh, vivid and interesting (Hudson 1968: 155) అంటాడు Hudson. నాటకంలో సంభాషణలు అతి క్లుప్తంగా ఉండాలి. నాటకంలోని సందర్భోచితమైన సంభాషణలే నాటక రచయిత ప్రతిభకూ, నైపుణ్యానికీ నిదర్శనం. "Good dialogue greatly brightens a narrative, and its judicious and timely use is to be regarded as evidence of a writers technical skill (Hudson 1968: 154) అంటాడు Hudson. ఆత్రేయగారి "ఈనాడు" నాటకంలోని సంభాషణలు క్లుప్తంగా ఉన్నాయి. ఎక్కడా అనవసర పద ప్రయోగం కనిపించదు. ఉదాహరణకు, ఈ కింది సంభాషణను చూద్దాం.

నసీమ్: (చాలా ఉత్సాహంగా) తమ్ముడూ!
రామ్: (ఏమీ పలక్కుండా కూర్చున్నాడు)
నసీమ్: (చిన్నబోయింది) ఏం తమ్ముడూ అలా వున్నావు?
రామ్: ఇక్కడ కొత్తవాళ్ళెవరైనా వున్నారా?
నసీమ్: అంటే?
రామ్: కొత్తగా ఇంట్లో ఎవరైనా వచ్చి వున్నారా అని.
నసీమ్: వున్నారు.
రామ్: ఎవరు?
నసీమ్: వత్సల అని నా స్నేహితురాలు.
రామ్: ఆమెను కాస్త పిలుస్తావా?
నసీమ్: ఎందుకు?
రామ్: నేనామెను చూడాలి.
నసీమ్: ఎందుకు?
రామ్: కారణం ఇప్పుడు చెప్పను.

మరొక ఉదాహరణ:

నసీమ్: ఈ జనాభా మార్పు నాకిష్టంలేదు.
రహీమ్: నీ యిష్టాయిష్టాలకు మేం చావలేం!
నసీమ్: ఈ వేలం వెర్రికి నేను తలవంచలేను.
రహీమ్: నసీం! నువ్వు కదలాల్సిందే.
నసీమ్: మీరందరూ వెళ్ళండి. నేనిక్కడే ఉంటా.
రహీమ్: వీల్లేదు.
నసీమ్: నేను రాలేను. (వెళ్ళింది)

పైన ఉదాహరించిన సంభాషణలను గమనిస్తే ఈ నాటకంలో సంభాషణలు ఎంత క్లుప్తంగా ఉన్నాయో తెలుస్తుంది. రామ్ అనే హిందువు, నసీమ్ అనే ముస్లిం పాత్రలు పాత్రోచితమైన భాష మాట్లాడకపోవడం, రహీమ్, నసీమ్ ఇద్దరూ ముస్లింలు అయివుండి కూడా తాము మామూలు వ్యావహారిక తెలుగులోనే మాట్లాడుకోవడం, ముస్లిం యాస వారి భాషలో కనపడకపోవడం కూడా మనకు తెలుస్తుంది. వేదం వెంకట్రాయ శాస్త్రిగారి "ప్రతాపరుద్రీయం" నాటకంలోలాగా ఈ పాత్రలు ముస్లిం యాస కలిసిన తెలుగు మాట్లాడివుంటే సహజంగా ఉండేది. ఇది ఈ నాటక సంభాషణల్లోని లోపంగా కనిపిస్తున్నది. ఎక్కువ ఉర్దూ మాటలు వాడితే ప్రేక్షకులకు

లేదా పాఠకులకు అర్థం కాకపోవచ్చు అనే భావనతో ఆత్రేయగారు ఈ నాటకంలో పాత్రోచిత భాషను ప్రయోగించకపోవడానికి కారణం కావచ్చు.

**భాషా ప్రయోగ విశేషాలు**

నాటకానికి సంభాషణలు ప్రాణమని పైన చూసాం. నాటకాన్ని రక్తి కట్టించేవి సంభాషణలూ, సంభాషణల్లో వాడిన సజీవమైన వ్యావహారిక భాష. ఆత్రేయగారు "ఈనాడు" నాటకంలో పాత్రోచితమైన భాషను వాడకపోయినా సమకాలికమైన చక్కని వ్యావహారిక భాషను వాడారు. ఈ నాటకంలో పాత్రోచిత భాషను వాడకపోయినా ఆనాటి వాడుక భాషలోని అనేక హిందీ, ఉర్దూ పదాలను వాడారు. బజారు, బాతాఖానీ, బద్మాష్, ఖాతిరీ, చా (చాయ్), కాఫిర్, దర్వాజా, ఖురాను, లూటీ, హుకుం, సైతాన్లు, అల్లా, తనిఖీ, నిఖా, జిందాబాద్ లాంటి పదాలు ఈ నాటకంలో ఉన్నాయి. అలాగే, బ్లాక్ మార్కెట్, ప్రజెంటు, రేషన్, కోట్ స్టాండ్, క్యాలండర్, హాలు, పేపర్, అర్జంటు కేసు, రెస్ట్, పాయింటు, రివాల్వర్, బుక్ చేయు, చాక్లెట్లు, పెప్రమింట్లు, స్కూలు, రెఫ్యూజీ క్యాంపు లాంటి ఇంగ్లీషు మాటలను కూడా వాడారు. ఒకటి రెండు చోట్ల నెల్లూరు జిల్లా మాండలిక పదాలు కూడా కనిపిస్తాయి. 1. ఉదా:

రహీమ్: చూడకే నిజంగా చాలా బాగుంది, బాబా! ఈనాడందరూ కొత్త గుడ్డలు వేసారే?

అక్బరు: నువ్వు కొనివ్వకపోయినా రాం నన్ను మరిచిపోలేదులే. వాడు తీసిచ్చాడు ఈనాడు కాన్కగా.

పురుషోత్తమ్: నాకు రహీం కొనిచ్చాడీ బట్టలు తెలుసా?

రహీమ్: ఇంతకూ నసీందే అదృష్టం! మీరిద్దరూ కొనిచ్చారట కదూ!

పురుషోత్తమ్: అరే! నువ్విచ్చావా అక్బర్? నాకు తెలియదే!

అక్బరు: అసలు నువ్వు తీసిచ్చావని నాకు తెలుసా? (పుట 229)

2. ఉదా: ఆగస్టు 15న కట్టిన తోరణాలింకా వున్నవి. దీపాలు మాత్రం లేవు. రాము నసీముకిచ్చిన గాంధీ పటం గోడకు తగిలించివుంది. నసీం ఒకవైపుగా కూర్చొని ఎర్రగడ్డలు తరుగుతూంది. కొంతసేపటికి గదిలోనుంచి అక్బరు వచ్చాడు.

3. ఉదా: నసీమ్: మన గతే ఇట్లావుంటే సన్నప్రజ ఏమవుతారో పాపం. (పుట 251)

పైన పేర్కొన్న ఉదాహరణల్లో "తీసిచ్చాడు", "ఎర్రగడ్డలు", "సన్నప్రజ" అనే పదాలు నెల్లూరు జిల్లా మాండలిక పదాలు. తీసిచ్చాడు అంటే కొనిచ్చాడని అర్థం, ఎర్రగడ్డలు అంటే ఉల్లిగడ్డలు



అని అర్థం. సన్న ప్రజ అంటే బడుగు వర్గాల ప్రజలు అని అర్థం. ఆత్రేయగారు ఈ సంభాషణల్లో అనేక జాతీయాలు, సామెతలు సందర్భోచితంగా వాడి సంభాషణలకు సహజత్వాన్నీ, కొత్త అందాన్నీ తీసుకొనివచ్చారు.

**జాతీయాలు**

ఈనాడు జండాలను కూడా బ్లాక్ మార్కెట్ చేసారు. (పుట 230)

ఎందుకట్లా కాలు కాలిన పిల్లిలా తిరగటం? (పుట 232)

తాపట్టిన కుందేటికి మూడేకాళ్ళు (పుట 240)

నువ్వు మరీ వీణ్ణి నెత్తికెక్కించుకొంటున్నావ్ (పుట 242)

నన్ను కాకపోయినా నా బిడ్డనైనా కాపాడు నీ కడుపున పుడతా నసీం! (పుట 254)

జావ్! ఉల్లూకాబేటా! (పుట 262)

మేము పదహారణాలా మనుష్యులమే. (పుట 264)

**సామెతలు**

గోటితో పోయేదానికి గొడ్డలి కావాల్సివస్తుంది. (పుట 234)

చల్లకొచ్చి ముంత దాచడమెందుకూ? (పుట 235)

కరువులో అధికమాసమన్నారు. (పుట 264)

పైన పేర్కొన్న అన్యదేశి పదాలు, జాతీయాలు, సామెతలు ఈ నాటకంలోని సంభాషణలకు సహజత్వాన్ని, సజీవత్వాన్నీ కలిగిస్తున్నాయి. ఈ నాటకంలోని ఈ భాషా ప్రయోగాలు సంభాషణలు ఎంత స్పష్టంగా, సులభంగా, సుబోధకంగా ఉన్నాయో తెలుపుతున్నాయి. "నాటక ప్రయోగం చూసే సమయంలో పునరాలోచనకు తావుండదు. కావున సుఖార్థం కావాలి. కఠిన పదాలతో, మారుమూల పదాలతో కూడిన కావ్యం కమండల ధరులైన ద్విజులతో కూడిన వేశ్యవలె భాసించదని భరతముని స్పష్టం చేసినాడు (అప్పారావు 1988: 53) అని పి.ఎస్.ఆర్ అప్పారావు గారు పేర్కొన్నారు. ఆత్రేయగారి "ఈనాడు" నాటకం సులభమైన నిత్యవ్యవహారంలోని పదాలతో పాఠకులనూ, ప్రేక్షకులనూ ఆనిందింప జేస్తున్నదని అనడంలో ఎలాంటి సందేహంలేదు.

# మనిషి తత్వంగా....

మనిషికి ఉన్న అతి పెద్ద బలహీనత
మనసు చెప్పినట్టు వినడం..
ఎవరూ అతీతులు కారు దీనికి...
ఆలోచనల్లో మాత్రం దూరం
అఖాతమంత...

ఒకరి నిజం మరొకరికి అబద్ధం
ఒక అబద్ధం... ఊరడించే మరొక నిజం
నిజం నిప్పు అయితే,
అవసరం అబద్ధం...
సమయాన్ని బట్టి మారడమే అసలు నిజం
అల్లుకుపోయే బంధాలూ ఇవే ...
తెగిపోయే బంధనాలూ ఇవే ...



నా ఆలోచనే సరియైనదన్న భ్రమ..
మంచి, చెడుల లెక్కలు లేవు
అందులోనే అసలు పతనం,
అందులోనే ఆఖరి విజయం..
తేల్చుకోవాలి ఏది కావాలో ??
సాగుబడి బలం కాకూడదు ఎప్పుడూ...
పట్టు విడుపులు అవసరం కొంతవరకు...



మనసును గాయపరిస్తే
కలిగే దూరాన్ని కొలువలేవు ...
గుప్పిట్లో ఇమిడిపోయేది కాదు జీవితం
ఎదురీదుతూనే ఉండాలి చివరికంటా ..
కరిగిపోయిన గతం కాదు ...
తెలియని రేపటికోసం కాదు ..
కాలం కలిగించే మార్పులను
అంతా మన మంచికే అనుకుంటూ ...
అడుగులు వేయాలి ...
ఎదుటి మనసుల ఆలోచన
పరిశీలనగా ...
అర్థం చేసుకునే మనిషి తత్వం గా....

**అరుణ ధూళిపాళ**
వలిగొండ, యాదాద్రి. ఫోన్ : 96526 74834

# అంటరాని చదువు

మట్టిగోడల కలికి కన్నులు
విప్పారంగా
పొక్కిలి లేచిన
పేద వాకిలి
రంగవల్లుల జాతరయ్యింది
ఒకనాటి నడిరేయిలో నా జ్ఞాన
మిణుగురు పురుగు
తాటాకుల పొత్తిళ్ళల్లో
కళ్ళు తెరిచి తప్పటడుగుల
నడకలతో
తడబడుతూ వెళ్ళింది
దిశలెరుగని ఈ విశ్వంలో
వడగాలిలో మడతలు పడుతూ
తిరిగింది
కసిరే చూపులు
నెట్టేసే నిర్దయ కరములు
చీదరింపులు
చిన్నచూపుల
వలయాగ్నిలో
అదృష్టంలేని ఎండిన బ్రతుకు
చెంబులో కన్నీళ్ళు
సట్టిలో నూకల మెతుకులు
అంటుకపోయే డొక్కకి
అవే ప్రాణ సంజీవనులు
గతిలేని కాలం
గండగండంగా గడిచిన రోజులు
ఎత్తుపల్లాల ఈ వ్యవస్థలో
ఈ జ్ఞాపకాలే నవోదయానికి
ఊరు నుండి ఉస్మానియా దాకా
నడిపించాయి
ఉన్నత విద్యాశిఖరాలను ఎక్కించాయి
నా గతం కళ్ళకద్దుకుంది
నా అంటరాని ఎన్నో బ్రతుకులకు
బాసటై నిలిచింది.

**డా. కందుల శీను**
నల్గొండ, ఫోన్ : 96526 74834

# ఇష్టద రాజ నాయక శతి – నవ్య శతక ప్రబంధ నిరోష్ఠ్య రచన

**లింగాల అలివేలు,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9553125941

తెలుగు మహాకావ్యాలు, ప్రబంధాలు పాండిత్యాన్ని సంతరించుకున్న కవులు రచనలు చేసి తమ పాఠకుల ప్రశంసలను అందుకున్నారు. అందులో ఒకటి చిత్రకవిత్వం. ఆ కవిత్వాన్ని చదువుతున్నా, వింటున్నా ఒక చిత్రమైన అనుభూతి కలగడం చేత కాబోలు అటువంటి రచనకు చిత్రకవిత్వం అనేపేరు వచ్చింది.

క్రీ.శ.17వ శతాబ్దానికి చెందిన "పొత్తపి వెంకటరమణ కవి" రాసిన "లక్షణ శిరోమణి" అనే గ్రంథంలో చిత్రకవిత్వాన్ని పేర్కొన్నారు. ఈ చిత్ర కవిత్వంలో పాదగోపంబు, పదభ్రమకంబు, నామగోపంబు, ఓష్ఠ్య–నిరోష్ఠ్య, సంకర, అచలజిహ్వ మొదలైన కవిత్వాలను నిర్వచించారు.

మరింగంటి సింగరాచార్యులు తన "దశరథ రాజనందన చరిత్ర"లో రామశబ్దం ఉపయోగించక వ్రాశారు. "ప"వర్గం ప్రయోగించకుండా రాశాడని ఓ కథ కూడా ప్రచారంలో ఉంది.

ఒక కవి రాజదర్బారులోకి వెళ్ళినాడట. సభలో కూర్చొని తాంబూల చర్వణం చేస్తున్నాడట. ఆకస్మాత్తుగా రాజుగారి దృష్టి ఈ తాంబూల కవి మీద పడింది. ఆశువుగా పద్యాలు చెప్పమన్నాడట. సభలో తాంబూల చర్వణం చేయడమే తగదు. అప్పుడు పద్యాలు అసలే సాధ్యం కాదు. అందుచేత ఆయన "ప" వర్గం ప్రయోగించ కుండా నోరు తెరువకుండా కాబోలు పద్యాలల్లినట్లుగా చెపుతారు. దీనివల్లనే నిరోష్ఠ్య రచన ప్రారంభమైనట్లుగా భావిస్తారు.

వేదుల నారాయణకవి – నిరోష్ఠ్య దశరథతనయ శతకము, కవికంఠీరవ కృష్ణమాచార్యులు – నిరోష్ఠ్యకృష్ణశతకము, పేరయసూరి – నిర్దుష్ట నిరోష్ఠ్య దాశరథీ శతకము, కేశవపట్నం నరసయ్య – నిరోష్ఠ్య నారాయణ సంఖ్య, వేదుల నారాయణ కవి – నిరోష్ఠ్య నక్షత్రమాలిక.

ఇదే ఆచారాన్ని పాటిస్తూ శ్రీమాన్ నల్లదీగ శ్రీనివాసాచార్యులవారు నిరోష్ఠ్య ప్రబంధ రచనకు పూనుకున్నారు. స్తుతిచేయు దైవనామము నందు ఓష్ఠ్యములున్నచో ఉచ్చరింపకయే ఆ దైవము పై కవిత చెప్పి మెప్పించుట నిరోష్ఠ్య నియములోని లక్ష్యం.

కాంచీపుర క్షేత్ర మోక్షప్రదములైన సప్తక్షేత్రాలలో ప్రసిద్ధమైన ఒక దివ్యక్షేత్రం.

**"అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ**
**అవంతికా పూరీ ద్వారవతీ చైవ సప్తైతే మోక్ష దాయకా:"**

అను క్షేత్రములలో కాంచీపుర క్షేత్రం ఒకటి.

ఈ క్షేత్రమున వేంచేసియున్న స్వామివారు యజ్ఞగుండం నుండి అవతరించినవారని, అందుచే వీరికి యజ్ఞపురుషుడని, భక్తులకు అభయప్రదుడుగా ఉండుటచే వరదరాజస్వామియని, దేవరాజ స్వామి యని పేరు.

ఈ కాంచీపుర క్షేత్ర పెరుమాండ్లను "గూడా" వంశీయులు ముదుంబ, నల్దీగ వంశీయుల వారు అర్చక–పాచక స్వాములుగా మెదక్ జిల్లాలోని గజ్వేల్ తాలూకాలో వరదరాజపురంలో వరదరాజస్వామిని శ్రీభూనీళా సమేతంగా ప్రతిష్ఠించారు. స్వామివారి పేరు మీదుగానే ఈ ప్రాంతానికి "వరదరాజపురం" అనే పేరు వచ్చింది.

కాంచీపురంలో ఏవిధంగా బ్రహ్మోత్సవ కార్యక్రమాలు జరుగునో ఆవిధంగానే 2వ కాంచీపురంగా పేరుగాంచిన ఈ వరదరాజపురంలో కూడా బ్రహ్మోత్సవాలు ఒకే సమయంలో జరుగుతాయి.

శ్రీమాన్ నల్దీగ శ్రీనివాసాచార్యులు తన పూర్వీకుల నివాసంబైన వదరరాజపుర స్వామిని స్తుతిస్తూ వరదరాజ శతకాన్ని యిష్టదరాజ నాయక శతిగా నిరోష్ఠ్య శతక ప్రబంధంగా రచిచంచారు. "యిష్టదరాజ నాయక" అనే మకుటంతో ఈ శతకాన్ని పూర్తి చేశారు.

చిత్రకవితలో రసస్ఫూర్తి తక్కువ. తెచ్చి పెట్టుకును గుణమధికము. దూరాన్వయము సాధారణము. రూఢికెక్కిన రూపముల కంటె కల్పించెడి రూపంలు అధికము. నిరోష్ఠ్యాది నియమముల వలన రచనకు ఒక చమత్కారం కల్గినను, కాఠిన్యం దానికొక కళంకముగా ఒక్కొక్కసారి ఏర్పడును. పాండిత్యైక వేద్యమైన రచన సహృదయ రసాస్వాదనము దూరమయ్యెడి అవకాశము కలుగవచ్చును. సర్కసుచూచునప్పటి ఉత్కంఠ పఠితకు కల్గించినను చిత్రకవిత ఆనందమార్గమును చూపించెడి రసప్రస్థానం కాజాలదు. అయినను నల్దీగ శ్రీనివాసాచార్యులు రసస్ఫోరకంగా రచించారు.

**"కరిగిరి నాథ! రారా! కలికాల ఖలాహి ఖగేంద్ర కేతనా!**
**గిరిధర నాథ! నీ లలిత కీర్తిని నా యెద నెన్ని తల్చెదన్‌బీ**
**సరసిజ నేత్ర! నీ దయన సద్రస గీతతి సాగజేసి నీ**
**చరణ జలేజ శ్రీల నిడిసాకర! యిష్టద రాజ నాయకా!"**

ఒక్కొక్కసారి ఒక ప్రాసనే ఒక ఖండికయందు అంతటను పాటించి కళాపాండిత్యాన్ని వెలార్చాడు. "క్షేత్ర దర్శన సన్నతి" అను ఖండికలో పద్యాలన్నింటియందును ద్విరుక్త కకార ప్రాస పాటిస్తూ రాశారు. అది వారి పాండిత్య ప్రకర్షపండిన దానికి ఉదాహరణ..

**చక్కని తల్లి యాసిరికి చక్కిద గల్గిన నీటెదన్‌బీ సిరే**
**నిక్కిన ధీరతాసరళి నిల్చి చెలంగెడి కేలజంటలన్**
**చిక్కని చక్కనైన జలజేధిత కంఠ లతాంత స్రక్తతిన్**
**చక్కగ గంటి నన్నిబీ కటిసందిట కాంచన చాయచేలలన్**

నిషిద్ధాక్షర నియమమును పాటిస్తూ పద్యరచనా శిల్పములో నెన్నియో నగిషీలు చెక్కి చూపించినారు. అందులో ఒకటి త్ర్యక్షర ప్రాస :

**"శక్తికి రక్తికిన్ జటిల సద్ధిషణాశ్రయ శాస్త్ర సత్ర యీ**
**శక్తికి నందరాని జయసాగర! నిన్నెట గాంచనెంచబీ నే**
**శక్తిని గానబీ గీ నిధిని సాగెద నన్నబీ గనంగ ధీక్రియా**
**శక్తిని గాంచబీ నీ దయల జాటర! యిష్టద రాజ నాయకా!"**

చిత్రకవిత వ్రాసేవారికి కల్పన మీద శబ్దాల కూర్పు మీదనే ధ్యాస కానీ కవిత్వానికి ఉండే సామాజిక ప్రయోజనం మీద అంతగా శ్రద్ధ ఉండదనే అభిప్రాయం విమర్శకుల్లో ఉన్నది. కొంతవరకు ఆ ఆలోచనకు అర్థం లేకపోలేదు. లక్షణం వైపే శ్రద్ధ కల్గిన కవులకు సమాజం వైపు దృష్టి మరల్చే అవకాశం ఉండదు. కానీ నల్దీగ శ్రీనివాసాచార్యులు గారు ఆ లోపం రానీయక జాగ్రత్తపడ్డాడు. సమాజంలో జరిగే మంచిచెడులపై వారికి నిశిత దృష్టి ఉన్నది. ఈనాటి రాజకీయాలను గురించిన వారి భావం ఇది.

**"నేతలె నీతిలేక ధరణిన్ నయసంచర సజ్జనాళినే**
**ఘాతక కృత్యతల్ గలిగి కాటికి నీడిచి కాల్చఁజ జేసిరీ**
**నేతల జాతిబీ చీడనిడ నెంచెడి కీటక జాతిగాని, స**
**న్నేతల నంగరాదిల గణించగబీ నిష్టద రాజ నాయకా!"**

ఈ స్తుతి ప్రబంధం 5 ఖండికలుగా విభజింపబడింది. మొదటిది శ్రీ యిష్టదరాజ నాయక శతి. ఇష్టదేవతాస్తుతులు ఇందు విస్తారంగా ఉన్నాయి. ఇష్టద రాజ నాయక గుణ సంకీర్తనములు ఉన్నాయి. ఇది భక్తి శతక మార్గాన నడిచినది.


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**


**శ్రీలలితా! కళాకలితా! శ్రీనగజాత! జగత్త్రయేడితా!**
**కాలఖలాహి దైత్యజన కర్కశసంఘహరారి శంఖ ఖ**
**డ్గాలయహ స్తనీరజ! జగజ్జనసన్నుత చిత్కళాశ్రయా!**
శ్రీలిడి తల్లి! గాచనితిబీ చేరితి నిష్టద రాజ నాయకా!

2వ ఖండిక క్షేత్రదర్శన సన్నుతి అచ్చమైన తెలుగు పదముల పొందికతో నిర్మించారు. ఈ ఖండికలోని కమ్మనిదనానికి ఓ ఉదాహరణ.

**"చక్కదనాల నేలసిరి చల్లగ నిండగ చిక్కచిక్కనై**
**చక్కిలిగింత సేయ గనసాగెడి చల్లనిగాలి దేలి దీ**
**టెక్కిన చెట్ల గట్లన నటించెడి తీగెలచానలందె రా**
**జిక్కని తీయ నేస్తసిరి చిందిలగా నెదలన్ నటించగా"**

సుప్రభాతమును 'జాగృతి' యను పేర 3వ ఖండముగా రచించినారు శ్రీనివాసాచార్యుల వారు. నిద్దుర లేపుటలో వర్ణించెడి పద్యాలు హృద్యంగా సంవదించుట ఇందలి రచనా శిల్పము.

**శ్రీలలనా స్తనాద్రిఘన శీతల హృద్య తటాంతశాయి! ధీ**
**రా! లలితాంగ! దాస జన రంజిత చిత్త జలేజ చంచరీ**
**కా! లసదంఘ్రినీరజ! యఘాంతక! యిష్టద రాజ నాగరీ**
శ్రీలసదాలయేశ! దయజేఁయెర! యిష్టద రాజ నాయకా!

4వ ఖండమైన ఆర్జీసరణిలో సమకాలీన సమాజ పరిస్థితుల నివేదనం చేసుకోవడం జరిగింది. నేటి సామాజిక దైన్యస్థితిని భావించి, ఆచార్యులవారు దేవుని శరణువేడుట గమనింపదగిన అంశము.

**"శ్రీగణనీయ సత్యనయ శీల! దయాకలితాయతేక్షణా!**
**నాగహితేంద్ర శేషశయనా! హరి! యాశ్రితసజ్జనాశ్రయా!**
**సాగరకన్యకాహృదయసారసన్నటనాళిరాజ! ఈ**
**శా! గిరిధారి! నన్ దయల సాకర! యిష్టద రాజనాయకా!"**

5వ ఖండిక సన్నుతి. ధూర్జటి వలె భగవద్భక్తి నిర్వేదమధురముగా వెలార్చిన రసవద్ర రచన పద్యాలు ఈ ఖండిక నిండా తొణికిసలాడుచున్నవి.

**"ఇల గల దేహ సంతతి జనించి కలంతల గిట్టసాగెడీ**
**తెలియని కిట్కదేల? యిలషి దీరని యాతన లంద నేలరా!**
**తెలియగ గాంచ నెంచిననె తెల్వని చిక్కిదిబీ యిట్టిచిక్కె నా**
**కలరగ జేయకయ్య! దయ గాంచర! యిష్టద రాజ నాయకా!"**

'వ' అనే అక్షరం ఉపయోగించక వరదరాజ నుతిని శతాధిక పద్యాల్లో వ్రాయడం శ్రీనివసాచార్యుల పాండిత్యానికి పతాకగా నిలుస్తుంది.

ఇలా నల్దీగ శ్రీనివాసాచార్యులుగా నవ్యంగా శతకప్రబంధ ప్రక్రియను నిర్మించి సరికొత్త శతక ప్రబంధ రచనకు దారిచూపారు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11  UGC Care List Approved Journal
హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

తెలంగాణ విస్మృత కవులు - 3

# శతక కవి – కృష్ణదాసు

డా. పెబ్బేటి మల్లికార్జున్, సహాయ ఆచార్యులు, నాగర్ కర్నూలు, ఫోన్: 9491881916

ఈ కవి రచించిన **'సహకారపురి నారసింహశతకం'** కాగితపు పీచు ప్రతి కపిలవాయి లింగమూర్తి గారి గ్రంథాలయంలో చూశాను. 1969లో కపిలవాయి వారు ఎత్తిరాసిన ప్రతిని కపిలవాయి అశోక్‌బాబు గారు నాకు అందించారు. పీచుకాగితపు ప్రతిపై మామిళ్ల ముత్యాలుది అని ఉంది. ఇతను ఎత్తిరాసుకున్న వ్యక్తి. ఈ శతకంపై అక్షయ, ప్రజోత్పత్తి, అంగీరస, శ్రీముఖ, మన్మథ అని ఉంది. ఇవి వరుసగా 1866, 1871, 1872, 1873, 1895 సం॥రాలు అవుతాయి. వేరొకచోట 1315 ఫసిలి ఖుర్దాదు2 అని ఉంది. దీనికి 580 కలిపితే 1895వ సం.ము అవుతుది. అయితే ఇది ముత్యాలుగారు రాసుకున్నది. అంటే కృష్ణదాసుగారు అంతకు ముందే రచించారు. కృష్ణదాసుగారు ఎక్కడివాడు? ఎప్పటి వాడు? ఎవరు? అని నిర్ణయించడానికి ఇందులో ఆధారాలు లేవు.

ఈ శతకాన్ని ఎత్తిరాసిన మామిళ్ల ముత్యాలు తెలుగు కులస్తుడు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని జినుకుంట గ్రామవాసి. ఈ శతకంలో కీర్తించిన నరసింహ ఆలయం ఈ గ్రామానికి సమీపంలోని మామిళ్లపల్లిలో ఉంది. 12వ శతాబ్దానికి ముందే ఈ ఆలయం స్థాపితమైంది. ఈ కవి గురించి ఏదైనా సమాచారం లభిస్తుందేమోనని క్షేత్ర పర్యటన నిమిత్తం ఆ గ్రామాన్ని సందర్శించాను. ఆ గ్రామస్తులు ఈ దేవాలయానికి 700 ఎకరాల మాన్యం కలదని, ఇందులో కొంత ఆక్రమణకు గురైందని, 150 ఎకరాలు కోర్ట్ కేసుల్లో ఉందని, మామిళ్లపల్లి, తెల్కపల్లి, దాసుపల్లి, తాళ్లపల్లి మరియు చుట్టుప్రక్కల గ్రామాల్లో కలదని చెప్పారు.

దేవాలయం ఆవరణలో ఒకవైపు తెలుగు మరోవైపు సంస్కృతం, తెలుగులో చెక్కబడిన నల్లరాతి శాసనం ఉంది. ఇది వివిధ కాలాలలో వేయబడినది. ఈ శాసనం పరిష్కరణ అయ్యింది. శ్రీనృసింహదాసుం/ దు భూపాలనావిసెట్టి శ్రీనృసింహదేవర పూజ/నైవేద్యములకు ధారవోసి యిచ్చిన దత్తి" అని ఉంది. మరో శాసనంలో చెరున్‌వెనుక / మోదలికట్ట మరుతులు నృసింహదేవరకు/ ధారపోసి ఇచ్చిన దత్తి" అని భూదానాల గురించి ఉంది. కృష్ణదాసు గురించి ఆ గ్రామంలో వృద్ధులను అడిగాను. 'కృష్ణదాసుడో, కృష్ణమాచార్యనో ఎవరో ఉండెనంట' అని మాత్రం చెప్పారు. కాని ఋజువులతో కూడిన ఆధారాలు లభించలేదు.

తెలుగు సాహిత్యంలో కృష్ణదాసు అనే పేరు కనిపిస్తుంది. కందుకూరివారు రచించిన 'ఆంధ్రకవుల చరిత్రము'లో ఒకరు కన్పిస్తున్నారు. కందుకూరివారు 'ఇతడు రాధాకృష్ణవిలాస మనుపేర జయదేవ విరచితమైన గీతగోవిందమును మూడశ్వాసముల



కావ్యముగా రచించెను. ఈతని తండ్రి వేంకటదాసుడు. ఈతడు శూద్రకులజుడని తోచుచున్నది. అయినను కవిత్వము హృద్యముగానే యున్నది' అని చెప్పాడు. ఇంకొక కృష్ణదాసు గురించి హైద్రాబాద్‌లోని ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోని కాగితపు అసమగ్ర ప్రతిలో భాగవతం దశమస్కంధం పూర్వభాగం 187 పుటలలో, ఉత్తరభాగం 177 పుటలలో రాయబడిన దానిలో 'కొండమాచార్య పౌత్ర తిరుమాలాచార్య పుత్ర కృష్ణదాస ప్రణీతంబైన అని ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయపు గ్రంథాలయంలోని తాళపత్ర గ్రంథంలో "కోవూరి తిరుమలరాయన మంత్రి వరదత్త పుత్ర కృష్ణదాస విరచితంబైన శ్రీ సింగపురీ రామాయణంబను యక్షగానంబునందు సర్వంబును గల యుద్ధకాండ సంపూర్ణము' అని ఉంది.

కాని, మనం చెప్తున్న కృష్ణదాసుగారి రచనా విధానానికి, భాషా పటిమకు పై రచనలు భిన్నంగా ఉన్నాయి. మామిళ్లపల్లి పేరు సంస్కృత శాసనంలో 'చూతఘోషాగ్రహారం' అని కనిపిస్తుంది. 'సహకారపురి' అనే పేరు కూడా ఈ గ్రామానికి కలదు. ఈ శతకానికి 'భూరి మణిహార సహకారపుర విహార/ భక్త మందార నరసింహ భవ విధూర' అనేది ద్విపాదమకుటంగా ఉంది. ఈ శతకాన్ని సమీప గ్రామపు వ్యక్తి ఎత్తిరాయటం, ప్రాచీన కాలం నుండి కూడా నరసింహ ఆలయం ఆ ప్రాంతంలో ప్రసిద్ధిచెందడం వలన ఈ శతకకర్త మామిళ్ళపల్లి లేదా చుట్టు ప్రక్కల గ్రామస్తుడు అయ్యే అవకాశం ఉంది.

ఈ శతకంలో 97 పద్యాలున్నాయి. మరికొన్ని శిథిలమయ్యాయి. ఇందులో విష్ణువు యొక్క అన్ని అవతారాలను వర్ణించాడు. ఇది సీసపద్య శతకం. కథగా కాకుండా కీర్తించడం, వేడుకోవడం కన్పిస్తుంది.

సీ. రఘుకులాధిప నన్ను రక్షింపుమనియంటి
కరుణతో నన్నెప్డుగావుమంటి
దీనుల రక్షింప దిక్కు నీవనియంటి
మోక్షమిచ్చెటి ఆదిమూర్తివంటి
భక్తవరులకు ఆత్మబంధుండవనియంటి
దయతో జూచేటి దాతవంటి
ఆర్తజనముకెల్ల నాదరు నీవంటి
కోరికలిచ్చేటి కుజమువంటి
సేవకు నన్ను దయజూడుదేవయంటి
నమ్ముకోనియుంటి పరులనేనమ్మనంటి
భూరి మణిహార సహకారపుర విహార
భక్తమందార నరసింహాభవ విదూర
(అముద్రితప్రతి-పద్యం-7)

ఈ శతకాన్ని విష్ణువు కంఠానికి పతకంగా వేస్తానని ఒకచోట చెప్పాడు.

'ఇభరాజవరదనీయభయ హస్తంబుకు
ప్రణమిల్లెదను నేను బహుపరాకు
సతతంబు ఈ పద్య శతకంబు కంఠాన
పతకంబుగా వేతు బహుపరాకు!

ఈ కవికి పురాణ పరిచయం ఉంది. ధర్మపురి నారసింహశతకాన్ని క్షుణ్ణంగా చదివాడని అర్థమవుతుంది. ఇందులో ప్రతిపద్యం రామాయణమో, భాగవతమో, పురాణాలనుండో వస్తువును కలిగి ఉంది.

సీ.ఆది దేవుండవై అఖిల భువనంబులు
ఉదరమందుంచిన యుదధిశయన
కాకుత్సకులమున కడువేడ్క జనియించి
మునిసంఘములకెల్ల ముక్తినొసగి
నారదాదులు మిమ్ము నయముతో సేవింప
రాజ్య భారంబెల్ల పూజ్యముగాను
ఏలినారని మిమ్ము నెలమితో పఠియింతు
పరమాత్మ పరమేశపంకజాక్ష
రామరఘురామ శ్రీరామరామరామ
నా మొరాలించు రక్షించు నమ్మినాను
భూరి మణిహార సహకారపుర విహార
భక్తమందార నరసింహ భవ విధూర (అ.ప్ర.ప.77)

11వ పద్యం నుండి చివరి వరకు కేశవనామాల పేరుతో శ్రీనివాస, కమలదళనేత్ర, కమలనాభ, కమలలోచన, జలజలోచన, పద్మదళనేత్ర, శ్రీరమాధిపతి, దామోదర, వామన, హృషికేశవాచ్యుత, మధుసూదనాహరి, పద్మనాభ, అంబోజదళనేత్ర, అరవిందనాభ, పన్నగాధిపశయన, విశ్వంభరుడ, జలజాప్తకులదీప, కందర్పజనక, అఖిలలోకేశ, దశరథాత్మజ, ఇందిరాధీశ.... ఇలా ప్రతి పద్యంలో ఒక్కొక్క నామంతో కీర్తించాడు. ఈ పద్ధతి ఈ శతకానికి ఒక ప్రత్యేకత అని చెప్పవచ్చు.

ఇందిరాధిపతి నీకు వందనంబు (113వ పద్యం)

దశరథరాజ దశకంఠమర్దన (53వ పద్యం)

అరవిందనాభ నిన్నాశ్రయించితె నన్ను ( 42)

దామోదర నన్ను దరిజేర్చికాపాడు (22వ పద్యం)

ఇందులో ప్రతి పద్యంలో శబ్దాలంకారాలు వీనులవిందు చేస్తాయి. వృత్యనుప్రాస, అంత్యానుప్రాస, ఛేకానుప్రాసలు విరివిగా వాడాడు.

సీ."సుందరాకారగోవింద మాధవకృష్ణ
మందరధర నీకు వందనంబు
కందర్పజనక నా మందిరంబున నీవు
నుందువని స్తుతియింతు వందనంబు
..........................................
నందనందన నీకిదే వందనంబు
ఇందధరనుత సేవితవందనంబు (అముద్రిత ప్రతి -పద్యం 121)

మనుష్యులు యవ్వనంలో ఉన్నప్పుడు భౌతికసుఖాలు, జిహ్వాచాపల్యాన్ని కోరుకుంటారని, వృద్ధాప్యదశలో పరోపకారం, దైవం గురించి చింతిస్తారని పేర్కొన్నాడు. ఈ భావన భాస్కరశతకం, ధర్మపురి నారసింహ శతకాలలో కూడా కన్పిస్తుంది. ఇందులో ఒక పద్యంలో ఈ భావం పొందుపర్చాడు.

సీ. లోచనంబులుగల్గి లోకరక్షకనిన్ను
సుస్థిరంబుగనేను జూడనైతి
జిహ్వాగల్గిన ఫలము శిష్టరక్షకయని
కలనైననెన్నడు దలచనైతి
కాయంబు గల్గియు కడుభక్తితోడుత
సాష్టాంగదండంబు సల్పనైతి
కమలాక్ష మీకథల్ ఘనముగానేవేళ
వీనులకింపుగా వినగనైతి
చెలగిహస్తంబులను పూజసేయనైతి
తీర్థయాత్రలకెన్నడు తిరుగనైతి (అ.ప్ర.ప.74)

భగవంతుణ్ణి సర్వస్వంగా భావించి తమ బోధనను, సంతోషాన్ని, కోపాన్ని, బెదిరింపును, ప్రార్థనను అన్ని భావాలను సందర్భానుసారంగా ప్రకటించాడు. ఎంత వేడుకున్నా తనను కటాక్షించని పరిస్థితిలో తన కోపాన్ని కొన్నిచోట్ల ప్రకటించాడు. రామదాసుగారి దాశరథీ శతకంలో కూడా ఈ ఆవేదన కనిసిస్తుంది.

సీ.మోదంబుతో నిన్ను మొరచాటగాచెవి
నాటదు ఇదియేమి నారసింహ
కరుణగల్గియున్నను ఘనముగాపోషింప

కరమొప్పకీర్తియుగాదె నీకు
దశరథాత్మజ రామ దగ్గర దీయక
నుంటి వేయపకీర్తియుర్విలోన
వాడుకుందురుగాన వాసవవందిత
రక్షించుయికనైన రాజతిలక
భక్తసులభుండవని చాల ప్రస్తుతింతు
కటకటాయెంతవేడిన కరుణలేదు (అ.ప్ర.ప.84)

భక్త్యావేశంతో, తన్మయత్వంతో పొగిడిన పద్యాలు కొన్ని ఉన్నాయి.

సీ.ఒక దిక్కు పరమేష్ఠి ఒక దిక్కు రుద్రుండు
ఒక దిక్కు ఇంద్రుండు వరుసగొల్వ
ఒక దిక్కు సనకాదులొకదిక్కు బుధజనుల్
ఒక దిక్కు మునివర్గమొకదెసను
కిన్నరకింపురుష గీర్వాణులొకవంక
ఒకవంక దిక్పాలకోత్తములును
ప్రహ్లాదనారదపరమ భాగ్యోత్తముల్
మ్రొక్కిసేవింతురునొకవంక
పఠనవీరలు చేయగ పరమపురుష
నాలకింపుచునున్నావు నారసింహ ( అ.ప్ర.ప.111)

ఈ శతకంలో అక్కడక్కడ వ్యాకరణ, ఛందో దోషాలున్నాయి. అయినా పద్య రచనలో మంచి ప్రవేశం కలదని చెప్పవచ్చు. భాషా పరంగా సరళ గ్రాంథికం వాడాడు. ఒకచోట "లలితాకార సలామునీకు' అని ఉర్దూ పదాన్ని ప్రయోగించాడు. కృష్ణదాసుగారి రచన ఇంకేమైనా లభిస్తే తన గురించిన సమాచారం లభిస్తుందేమో చూడాలి.

తండ్రి వేంకటదాసుడు. ఈతడు శూద్రకులజుడని తోచుచున్నది. అయినను కవిత్వము హృద్యముగానే యున్నది' అని చెప్పాడు. ఇంకొక కృష్ణదాసు గురించి హైద్రాబాద్‌లోని ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోని కాగితపు అసమగ్ర ప్రతిలో భాగవతం దశమ స్కంధం పూర్వభాగం 187 పుటలలో, ఉత్తరభాగం 177 పుటలలో రాయబడిన దానిలో **'కొండమాచార్య పౌత్ర తిరుమాలాచార్య పుత్ర కృష్ణదాస ప్రణీతంబైన'** అని ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయపు గ్రంథాలయంలోని తాళపత్ర గ్రంథంలో **'కోవూరి తిరుమలరాయన మంత్రి వరదత్త పుత్ర కృష్ణదాస విరచితంబైన శ్రీ సింగపురీ రామాయణంబను యక్షగానంబునందు సర్వంబును గల యుద్ధకాండ సంపూర్ణము'** అని ఉంది.

కాని, మనం చెప్తున్న కృష్ణదాసుగారి రచనా విధానానికి, భాషా పటిమకు పై రచనలు భిన్నంగా ఉన్నాయి. మామిళ్లపల్లి పేరు సంస్కృతశాసనంలో 'చూతఘోషాగ్రహారం' అని కనిపిస్తుంది. 'సహకారపురి' అనే పేరు కూడా ఈ గ్రామానికి కలదు. ఈ శతకానికి 'భూరి మణిహార సహకారపుర విహార/ భక్త మందార నరసింహ భవ విధూర' అనేది ద్విపాదమకుటంగా ఉంది. ఈ శతకాన్ని సమీప గ్రామపు వ్యక్తి ఎత్తిరాయటం, ప్రాచీన కాలం నుండి కూడా నరసింహ ఆలయం ఆ ప్రాంతంలో ప్రసిద్ధిచెందడం వలన ఈ శతకకర్త మామిళ్ళపల్లి లేదా చుట్టు ప్రక్కల గ్రామస్తుడు అయ్యే అవకాశం ఉంది.

ఈ శతకంలో 97 పద్యాలున్నాయి. మరికొన్ని శిథిలమయ్యాయి. ఇందులో విష్ణువు యొక్క అన్ని అవతారాలను వర్ణించాడు. ఇది సీసపద్య శతకం. కథగా కాకుండా కీర్తించడం, వేడుకోవడం కన్పిస్తుంది.

సీ. రఘుకులాధిప నన్ను రక్షింపుమనియంటి
కరుణతో నన్నెప్పుగావుమంటి
దీనుల రక్షింప దిక్కు నీవనియంటి
మోక్షమిచ్చెటి ఆదిమూర్తివంటి
భక్తవరులకు ఆత్మబంధుండవనియంటి
దయతో జూచేటి దాతవంటి
ఆర్తజనముకెల్ల నాదరు నీవంటి
కోరికలిచ్చేటి కుజమువంటి
సేవకు నన్ను దయజూడుదేవయంటి
నమ్ముకొనియుంటి పరులనేనమ్మనంటి
భూరి మణిహార సహకారపుర విహార
భక్తమందార నరసింహభవ విధూర
(అముద్రితప్రతి-పద్యం-7)

ఈ శతకాన్ని విష్ణువు కంఠానికి పతకంగా వేస్తానని ఒకచోట చెప్పాడు.

'ఇభరాజవరదనీయభయ హస్తంబుకు
ప్రణమిల్లెదను నేను బహుపరాకు
సతతంబు ఈ పద్య శతకంబు కంఠాన
పతకంబుగా వేతు బహుపరాకు!

ఈ కవికి పురాణ పరిచయం ఉంది. ధర్మపురి నారసింహ శతకాన్ని క్షుణ్ణంగా చదివాడని అర్థమవుతుంది. ఇందులో ప్రతిపద్యం రామాయణమో, భాగవతమో, పురాణాలనుండో వస్తువును కలిగి ఉంది.

సీ. ఆది దేవుండవై అఖిల భువనంబులు
ఉదరమందుంచిన యుదధిశయన
కాకుత్థ్సకులమున కడువేడ్క జనియించి
మునిసంఘములకెల్ల ముక్తినొసగి
నారదాదులు మిమ్ము నయముతో సేవింప
రాజ్య భారంబెల్ల పూజ్యముగాను
ఏలినారని మిమ్ము నెలమితో పఠియింతు
పరమాత్మ పరమేశపంకజాక్ష
రామరఘురామ శ్రీరామరామరామ
నా మొరాలించు రక్షించు నమ్మినాను
భూరి మణిహార సహకారపుర విహార
భక్తమందార నరసింహ భవ విధూర (అ.ప్ర.ప.77)

11వ పద్యం నుండి చివరి వరకు కేశవనామాల పేరుతో శ్రీనివాస, కమలదళనేత్ర, కమలనాభ, కమలలోచన, జలజలోచన, పద్మదళనేత్ర, శ్రీరమాధిపతి, దామోదర, వామన, హృషికేశవాచ్యుత, మధుసూదనాహరి, పద్మనాభ, అంబోజదళనేత్ర, అరవిందనాభ, పన్నగాధిపశయన, విశ్వంభరుడ, జలజాప్తకులదీప, కందర్పజనక, అఖిలలోకేశ, దశరథాత్మజ, ఇందిరాధీశ.... ఇలా ప్రతి పద్యంలో ఒక్కొక్క నామంతో కీర్తించాడు. ఈ పద్ధతి ఈ శతకానికి ఒక ప్రత్యేకత అని చెప్పవచ్చు.

ఇందిరాధిపతి నీకు వందనంబు (113వ పద్యం)

దశరథరాజ దశకంఠమర్ధన (53వ పద్యం)

అరవిందనాభ నిన్నాశ్రయించితె నన్ను ( 42)

దామోదర నన్ను దరిజేర్చికాపాడు (22వ పద్యం)

ఇందులో ప్రతి పద్యంలో శబ్దాలంకారాలు వీనులవిందు చేస్తాయి. వృత్త్యానుప్రాస, అంత్యానుప్రాస, ఛేకానుప్రాసలు విరివిగా వాడాడు.

సీ. "సుందరాకారగోవింద మాధవకృష్ణ
మంధరధర నీకు వందనంబు
కందర్పజనక నా మందిరంబున నీవు
నుందువని స్తుతియింతు వందనంబు
..................................................
నందనందన నీకిదే వందనంబు
ఇందధరనుత సేవితవందనంబు (అముద్రిత ప్రతి -పద్యం 121)

మనుష్యులు యవ్వనంలో ఉన్నప్పుడు భౌతికసుఖాలు, జిహ్వాచాపల్యాన్ని కోరుకుంటారని, వృద్ధాప్యదశలో పరోపకారం, దైవం గురించి చింతిస్తారని పేర్కొన్నాడు. ఈ భావన భాస్కరశతకం,

ధర్మపురి నారసింహ శతకాలలో కూడా కన్పిస్తుంది. ఇందులో ఒక పద్యంలో ఈ భావం పొందుపర్చాడు.

సీ. **లోచనంబులుగల్గి లోకరక్షకనిన్ను**
**సుస్థిరంబుగనేను జూడనైతి**
**జిహ్వాగల్గిన ఫలము శిష్టరక్షకయని**
**కలనైననెన్నడు దలచనైతి**
**కాయంబు గల్గియు కడుభక్తితోడుత**
**సాష్టాంగదండంబు సల్పనైతి**
**కమలాక్ష మీకథల్ ఘనముగానేవేళ**
**వీనులకింపుగా వినగనైతి**
**చెలగిహస్తంబులను పూజసేయనైతి**
**తీర్థయాత్రలకెన్నడు తిరుగనైతి** (అ.ప్ర.ప.74)

భగవంతుణ్ణి సర్వస్వంగా భావించి తమ బోధనను, సంతోషాన్ని, కోపాన్ని, బెదిరింపును, ప్రార్థనను అన్ని భావాలను సందర్భానుసారంగా ప్రకటించాడు. ఎంత వేడుకున్నా తనను కటాక్షించని పరిస్థితిలో తన కోపాన్ని కొన్నిచోట్ల ప్రకటించాడు. రామదాసుగారి దాశరథి శతకంలో కూడా ఈ ఆవేదన కనిపిస్తుంది.

సీ. **మోదంబుతో నిన్ను మొరచాటగాచెవి**
**నాటదు ఇదియేమి నారసింహ**
**కరుణగల్గియున్నను ఘనముగాపోషింప**
**కరమొప్పుకీర్తియుగాదె నీకు**
**దశరథాత్మజ రామ దగ్గర దీయక**
**నుంటి వేయపకీర్తియుర్విలోన**
**వాడుకుందురుగాన వాసవవందిత**
**రక్షించుయికనైన రాజతిలక**
**భక్తసులభుండవని చాల ప్రస్తుతింతు**
**కటకటాయెంతవేడిన కరుణలేదు** (అ.ప్ర.ప.84)

భక్త్యావేశంతో, తన్మయత్వంతో పొగిడిన పద్యాలు కొన్ని ఉన్నాయి.

సీ. **ఒక దిక్కు పరమేష్టి ఒక దిక్కు రుద్రుండు**
**ఒక దిక్కు ఇంద్రుండు వరుసగొల్వ**
**ఒక దిక్కు సనకాదులొకదిక్కు బుధజనుల్**
**ఒక దిక్కు మునివర్గమొకదెసను**
**కిన్నరకింపురుష గీర్వాణులొకవంక**
**ఒకవంక దిక్పాలకోత్తములును**
**ప్రహ్లాదనారదపరమ భాగ్యోత్తముల్**
**మ్రొక్కిసేవింతురునొకవంక**
**పఠనవీరలు చేయగ పరమపురుష**
**నాలకింపుచునున్నావు నారసింహ** ( అ.ప్ర.ప.111)

ఈ శతకంలో అక్కడక్కడ వ్యాకరణ, ఛందో దోషాలున్నాయి. అయినా పద్య రచనలో మంచి ప్రవేశం కలదని చెప్పవచ్చు. భాషాపరంగా సరళ గ్రాంథికంవాడాడు. ఒకచోట "లలితాకార సలాము నీకు' అని ఉర్దూ పదాన్ని ప్రయోగించాడు. కృష్ణదాసుగారి రచన ఇంకేమైనా లభిస్తే తన గురించిన సమాచారం లభిస్తుందేమో చూడాలి.



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11 (55) హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# సహజ సాహితీ సర్వజ్ఞులు - పెనుగొండ శ్రీనివాసులు

**సుప్పని సత్యనారాయణ,** తెలుగు ఉపన్యాసకులు, బాన్సువాడ ఫోన్ : 9492626910

తెలంగాణ పునర్నిర్మాణ దశలో భాగంగా మరుగున పడిన సాహిత్య చరిత్రను, అజ్ఞానతంగా దాగివుండి తమ ప్రతిభతో తెలంగాణను సుసంపన్నం చేసి ఈ నేల కోసం, ఈ భూమి కోసం ఈ సంస్కృతీ వికాసం కోసం ఎందరో మహామహులు జీవన పర్యంతం మాతృభూమి గొప్పతనాన్ని పరివ్యాప్తం చేసి అజరామరులైనవారు లెక్కకుమిక్కిలి ఉన్నారు. అటువంటి మహనీయులను తెలంగాణ కల సాకారమై విజయ ప్రస్థానమును, అరవయేండ్ల తండ్లాటల బద్ధ కష్టాన్ని, గోసను యాది జేసుకొని, చరిత్రను పునర్లిఖించే పరంపరలో ఈరోజు తెలంగాణ అడుగులు వేస్తోంది.

వృత్తిరీత్యా, ప్రవృత్తి రీత్యా సహజంగా అబ్బిన సాహిత్య సౌరభంతో జీవించింత కాలం తెలంగాణ వైభవమును అటు తెలుగు ప్రాభవమును తనువెల్లా లేపనం చేసుకొని తెలుగు కళామతల్లి సేవలో తరిస్తూ, నిరంతర సాహిత్య పిపాసతో జీవించిన కవి, తెలంగాణ మట్టిలో మాణిక్యం, సుప్రసిద్ధ రచయిత శ్రీ పెనుగొండ శ్రీనివాసులు.

పూర్వపు నిజామాబాద్ జిల్లా ప్రస్తుతం కామారెడ్డి జిల్లా, బాన్సువాడ మండల కేంద్రముకు సమీపాన నాడు "బోరలపురము"గా పిలువబడే నేటి 'బోర్లం' అనే మారుమూల గ్రామంలో శ్రీమతి పెనుగొండ లక్ష్మీబాయి, నారాయణ దంపతులకు 8.6.1943న నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించిన పుత్రరత్నం శ్రీ పెనుగొండ శ్రీనివాసులు.

చిన్నప్పటినుండి చదువంటే అమితాసక్తి గల శ్రీనివాసులు ప్రాథమిక విద్యనుండి ఉన్నత విద్యవరకు బోర్లం గ్రామంలోనే అభ్యసించారు. చదువులో ఎప్పుడూ ప్రథమశ్రేణిలో వుండే శ్రీనివాసులు చిరుప్రాయంనందే అటు విద్యార్థుల, ఇటు గురువుల మనసును దోచుకుని, వారి అభిమానాన్ని చూరగొన్నాడు. హెచ్.ఎస్.సి. ముగిసాక 1970లో బి.ఓయల్ 1974లో ఎం.ఏ తెలుగు, 1983లో బి.ఇడిలో పట్టభద్రులైనారు.

చిరుప్రాయమునందే తెలుగున్నా, తెలుగు సాహిత్యమన్నా అమితాసక్తి గల శ్రీనివాసులు తెలుగు ఉపాధ్యాయునిగా స్థిరపడాలనే దిశలో తన కృషిని సాగించి 1961లో తెలుగు ఉపాధ్యాయునిగా వృత్తిని చేపట్టి తన ఉద్యోగ జీవితాన్ని కొనసాగించినాడు. తాను విధి నిర్వహించినటువంటి పాఠశాలల్లో విద్యార్థులకు అనేకరకాల కళలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, పద్యపఠనం వంటి ప్రక్రియలపై చిన్న చిన్న అవగాహన సదస్సులు నిర్వహించేవాడు. అంతేకాక తానేది చేసిన నవీన ధోరణిని అనుసరించి, తనకంటూ ఒక ప్రత్యేకత కలిగి ఉండాలని పరితపించే శ్రీనివాసులు విద్యార్థుల చేత పూర్వకాలమానికి సంబంధించిన స్టాంపులు, నాణెములు సేకరింపజేసేవారు. పాఠశాలల్లో సందర్భానుసారంగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడమే కాకుండా, సేకరించిన స్టాంపులను ప్రముఖుల కోరిక మేరకు వివిధ వేదికలపై ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేసేవాడు.

అలా పలువురి అభిమానాన్ని, ఆదరణను పొందుతూ నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి చేతులు మీదుగా 'ఉత్తమ రాష్ట్ర ఉపాధ్యాయుడు'గా అవార్డును కూడా అందుకున్నారు. వీరు 2001 జూన్ నెలలో ఉపాధ్యాయునిగా పదవీ విరమణ పొందినారు. కేవలం అటు ఉపాధ్యాయునిగానే కాకుండా కుటుంబంలో వంశ పారంపర్యంగా వస్తున్న చేనేత కులవృత్తి తన తండ్రి నారాయణగారి ద్వారా సంక్రమించిన మూలికా ఆయుర్వేద వైద్యవిద్యను అభ్యసించి, అద్భుతమైన చికిత్స చేయడం ఆరంభించారు. ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన అనేక గ్రంథాలను అధ్యయనం చేయడం, వాటి ద్వారా రోగులకు సరియైన వైద్యం చేసి ఎటువంటి రోగాన్నైనా నయం చేసే విధంగా ఆయుర్వేద వైద్య విధానంలో చక్కని ప్రతిభను కనబరిచారు శ్రీనివాసులుగారు. ఆరోజులలో తనను ఆశ్రయించి వచ్చే రోగుల నుండి నయాపైసా ప్రతిఫలాపేక్ష లేకుండా ఉచితంగా అనేకరకాల మందులను పంపిణీ చేసి వ్యాధి సకాలంలో నయమయ్యేటట్లు తగువిధంగా చికిత్స చేసేవారు. అదేమాదిరి మనుషులకే కాకుండా పశువైద్యం కూడా కొనసాగిస్తూ నోరులేని మూగ జీవాల పట్ల ప్రేమను పెంచుకొని వాటికి కూడా చికిత్స చేసిన కరుణామూర్తి శ్రీనివాసులుగారు

శ్రీనివాసులు నిత్య సాహిత్య పిపాసి. చిన్నప్పటి నుండే తెలుగుపట్ల అమితాసక్తి గల వీరు సాహిత్యానికి సంబంధించి ఛందస్సు, వ్యాకరణ ప్రక్రియలపై గట్టిపట్టును సంపాదించడమే కాక రామాయణ, భారత, భాగవత కావ్యాలను నిరంతరం అధ్యయనం చేసేవారు. సందర్భానుసారంగా చిన్న చిన్న పద్యాలు, పాటలు రాయడం వీరికి బాల్యం నుండే అబ్బింది. భవిష్యత్తులో తాను రచించిన రచనలు పలువురికి హితమును కలిగించే విధంగా సార్థకమవ్వాలనే ప్రయత్నంలో సఫలీకృతులై శతక రచనకు మొదట శ్రీకారం చుట్టారు.

ఈయన రచనలు

1. సమస్యాపూరణములు (అముద్రితము) 2. బసవలింగ శతకం (ముద్రితం) 3. శ్రీ భక్త మార్కండేయ శతకం (ముద్రితం) 4. శ్రీ

శబరిమాత శతకం (ముద్రితం) 5. పంతులయ్య శతకం (అముద్రితం).

వంటి పలురకాల శతకములే కాకుండా అముద్రితములైన పెక్కు పద్యములను వీరు రచించినారు. వారి ఇష్టదైవమైన శ్రీ ఆది బసవేశ్వరుడు, శ్రీ భక్త శబరి మాతలను స్తుతిస్తూ శతక కావ్యములను రచించి తెలుగు భాషకు వన్నె తెచ్చేవిధంగా భాషామతల్లి గళసీమ నలంకరింపజేసిన సహజ సాహితీ సర్వజ్ఞులు శ్రీ శ్రీనివాసులుగారు.

**రచనాశైలి**

సమకాలీన సమాజము యొక్క స్థితిగతులను, మానవీయ విలువలను ఎప్పటికప్పుడు తన పద్యాలలో నిక్షిప్తపరుస్తూ పాఠకాళికి అందించడం జరిగింది. పల్లె వాతావరణము నుండి వచ్చినటువంటి శ్రీనివాసులుగారు బోర్లం గ్రామం చుట్టూ వుండే పచ్చని పంట పొలాలు, ప్రకృతి అందాలు గ్రామముకు సమీపాన గల బసవన్నగుట్ట వంటి ప్రదేశములను నిత్యం సంచరిస్తు వాటి అందమును తనివితీరా సమీపమునుండి ఆస్వాదించి తన్మయత్వమును చెందేవారు. అందుకు పరాకాష్టగా 'బసవలింగ శతకము'కు శ్రీకారం చుట్టారు.

**"పండితుడని యన్న ప్రతిభ నాలో లేదు**
**భక్తితోడ మిమ్ము ప్రస్తుతింతు**
**పరమ పుణ్య తపసి పలికించి పద్యముల్**
**శరణు దివ్య చరిత శబరిమాత"** అంటూ తాను రచించిన శతకము యొక్క ఆరంభంలోనే ఈవిధముగా 'శరణు దివ్య చరిత శబరిమాత' అనే మకుటంతో వినమ్ర నివేదనను వ్యక్తపరుస్తాడు రచయిత.

**"ఆటలాడు చిన్ననాటి వయసులోనె**
**భజన జేసి రామ ప్రభుని జూడ**
**తెలియగోరినావు తేజంబు నిండార**
**శరణు దివ్య చరిత శబరిమాత!"** అంటూ అవధూత శ్రీ భక్త శబరిమాత (తాడ్వాయి) యొక్క సమగ్ర జీవిత చరిత్రను సులభమైన ఆటవెలది శైలిలో అత్యంత హృద్యంగా, రమణీయంగా ఈ శతకమును రచించి శబరిమాత భక్తి తత్త్వమును పాఠకాళికి అందిస్తు ఈ శతక కుసుమమును శ్రీ శబరిమాతకే అంకితమివ్వడం జరిగింది.

**"శ్రీనివాసుడనెడి చెల్వగు నామంబు**
**తల్లిదండ్రులిడిరి తనివిదీర**
**మారుపేరు జాడ మరియొప్ప పెనుగొండ**
**శరణు దివ్యచరిత శబరిమాత"** అంటూ తన ఊరు, పేరు జీవన ప్రస్థానమును పద్యములలో చెప్పడమే కాకుండా, తాను అల్పుడనని వేద విద్యల సారమును తానెరుగనని, కవిత్వంపై మక్కువతో వాగ్దేవిపై భక్తితో అలా చెప్పానే తప్ప తాను కవితా మర్మమునెన్నడూ కనలేదని, అంత విజ్ఞాన వంతుడను కానని సమర్థించుకోగల వినయశీలి రచయిత.

తాను రచించిన శతకములన్నీ భక్తి, వైరాగ్య తత్వము ఉట్టిపడే విధంగా ఉంటాయంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఈ పరంపరలోనే బసవలింగ శతకము, శ్రీ భక్త మార్కండేయ శకతము వచ్చినాయి. మార్కండేయస్వామి పుట్టు పూర్వోత్తరాలు, పద్మశాలి వంశ ఆవిర్భావమును ఈ శతకములో వివరిస్తాడు రచయిత.

**"పుణ్యమైనట్టి బోరల పురములోన**
**వెలసియున్నట్టి బసవని వేడ్కమీర**
**దలచి రచనకు బూనితి ధైర్యముగను**
**పరమ భక్త మార్కండేయ ప్రభువరేణ్యు!"** అనే మకుటంతో మార్కండేయ శతకం ఆరంభమవుతుంది. ఈ శతకమున మార్కండేయస్వామి యొక్క సమగ్ర జీవిత చరిత్ర 'తేటగీతి' పద్యశైలిలో రచించారు రచయిత.

**"సంపదలు గల్గి గర్వంబు సరగహెచ్చె**
**దాన ధర్మంబు లోపించె మనావులలొ**
**ఆత్మబోధంబు కరువయ్యె నవనిలోన**
**పరమ భక్త మార్కండేయ ప్రభువరేణ్య!"** మానవులు సంపద వ్యామోహంలో పడిన తరువాత మానవీయ విలువలను దాన ధర్మములను ఏవిధముగా మరచిపోతున్నారో చెప్పినారు.

**"నిముసము మాయమయ్యెడి నీటిబుగ్గ**
**వంటి దేహంబు మృత్యువు వెంట నుండు**
**కాలమును వృథాగావించ మేలు లేదు**
**పరమభక్త మార్కండేయ ప్రభువరేణ్య!"** అంటూ మానవ జీవన మర్మమును చెబుతూ జీవితం నీటి బుడగ వంటిదని, క్షణమాత్రమేనని, కాలమును క్షణం కూడా వృథా చేయకుండా ఎప్పటికప్పుడు సద్వినియోగపర్చుకోవాలనే వాస్తవమును తేటతెల్లం చేయగల తెలంగాణ మట్టి గట్టి కవి శ్రీ పెనుగొండ.

రచన ఎటువంటి ప్రక్రియకు చెందినదైనా సరే తన కృతుల ద్వారా సమాజహితమును కాంక్షించి ఓ అనధికార శాసనకర్తగా అటు కప్పిపుచ్చుట యందు కవిగా, విప్పి చెప్పుటయందు విమర్శకుని గా తనదైన శైలిలో అద్భుతమైన ప్రతిభను కనబరిచాడు రచయిత.

ఉపాధ్యాయునిగా, వైద్యునిగా, కవిగా, రచయితగా, విమర్శకుని గానే కాకుండా స్టాంపులు, నాణెముల సేకరణలో కూడా ప్రముఖ పాత్ర వహించి అద్వితీయ ప్రతిభను కనబరిచారు.

నిజాం కాకతీయుల కాలం నాటివి, ఇంకా అనేక దేశాల కరెన్సీ, స్టాంపులను సేకరించి రాష్ట్ర, జాతీయస్థాయి వరకు లెక్కకు మిక్కిలి వేదికలపై ప్రదర్శనలు ఏర్పాటు చేసి, పలువురు ప్రముఖుల మన్ననలను పొందదంతో పాటు అనేక సన్మాన సత్కారములను అందుకున్నారు. తాను సేకరించిన స్టాంపులను, నాణెములను

ఎప్పటికప్పుడు భద్రపరుస్తూ భావితరాలకు అందివ్వాలనే సదుద్దేశంతో తన దినచర్యలో భాగంగా అనుసరించడం నిజంగా కొనియాడదగ్గ విషయం.

**చివరి రోజుల్లో**

ఉత్తమ ఉపాధ్యాయునిగా, ఆయుర్వేద వైద్యునిగా, కవిగా, రచయితగా, స్టాంపుల సేకరణకర్తగా, బహుముఖ ప్రజ్ఞాపాటవాలు కలిగిన శ్రీనివాసులుగారు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా స్టాంపులు, నాణెములు సేకరణలో బంగారు వెండి పతకాలను పొంది సాహితీపరంగా అనేక వేదికలపై ప్రముఖులచేత అనేక సత్కారాలు, సన్మానాలు పొందినారు. 22.07.2011న తన 68వ యేట పరమపదించినారు. వీరి మరణానంతరం వీరి కుమారుడైన పెనుగొండ లక్ష్మీనారాయణ తండ్రిగారి సాహిత్యాన్ని తాను సేకరించిన నాణాలు, స్టాంపులు భద్రపరచి భవిష్యత్తులో ప్రదర్శనలు ఇస్తు, వారి సాహిత్యమును గ్రంథాలయంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు.

పని ఏమైనప్పటికీ బ్రతికినంతకాలం తెలుగు సాహిత్యముకు ఎనలేని సేవ చేసిన శ్రీ పెనుగొండ శ్రీనివాసులుగారు తెలంగాణ మట్టిలోని అణువణువునా తన రచనల ద్వారా అజరామరంగా నిలిచిపోతారన్నది జగమెరిగిన సత్యం. ఇకనైనా తెలంగాణ సాహిత్య అకాడమీ ఇటువంటి రచయితలను ముందు తరాలకు పరిచయం చేసే క్రమంలో సరియైన వేదికను కల్పిస్తుందని ఆశిద్దాం.

# తలెత్తుకొని బ్రతకాలి...!

తప్పు చేయ రాదు తల వొంచ గను రాదు
నీతి బాట నెపుడు వీడ రాదు
ఖ్యాతి పొందు కెపుడు కరముల చాచాలి
మంచి మనిషి గాను మసల వలెను!

తొత్తుపనుల నెపుడు త్రోసి రాజను నీవు
మత్తు కిలను లొంగి మర్చి పోయి
చేయరాదునీవుచేటుకార్యములను
మంచితనము తోడ మన్ననందు!

బాంచె బ్రతుకు కెపుడు బానిస కావద్దు
కొంచె బుద్ధి వలదు కొంచ మైన
బుద్ధిబలము చేత పోరాడి జీవించు
సంఘమందునీవుసమతపెంచు!

నెత్తి గోగి నీవు నెనరు కోర కెపుడు
దాస్యరీతి తోడ దయను వలదు
ఆత్మ గౌర మందు నలరారు నెప్పుడు
సత్యమార్గమందు సాగు ముందు!

చేతిచాప కెపుడు చిల్లిగవ్వ కొరకు
కష్టపడి నీవు కాసు పొందు
ఇష్టపూర్తి గాను యిచ్ఛలు తీర్చుకో
అవని యందు బహుగ హాయి నొందు!

పెద్ద చిన్న చూసి ప్రేమలు చూపుము
గౌరమిచ్చి యిలను గౌర మొందు
ధర్మ మార్గ మందు దండిగా సాగుము
నిర్భయముగ నిలను నిశ్చలముగ!

కూలినాలి చేయ కూర్ఛిపు వలదులే
కాపురంబు నడుప కదల వలెను
భుక్తి కొరకు తపన పొందుము కష్టము
జీవితంబు సాగు దిగులు లేక!

ఉన్నవాడికైనభువినలేనివాడికినైన
కోటి విద్యలన్ని కూటి కొరకె
అవసరాని కిలను నందితే రూకలు
పదిలమౌను బ్రతుకు పచ్చగాను!!



**చితోజు పద్మావతి**
**మహబూబ్ నగర్,**
**ఫోన్ : 8464 954 860**

# అష్టాదశ శక్తి పీఠాలు




శ్రీ శాంకరీదేవి శ్రీలంకను వెలసి
భక్తులు కోరెడు ఫలములిచ్చు
కామాక్షిదేవిగా కాంచీపురంబున
తలచినంతనె తాను తరలివచ్చు
శ్రీ శృంఖలాదేవి చేరి ప్రద్యుమ్నలో
బంధనాశనిగాను వాసికెక్కె
చాముడిగా తల్లి సర్వ ప్రదాయియై
మైసూరునందున మాన్యతగొనె
జోగులాంబాదేవి యోగంబు గూర్చుచు
నాలంపురంబున నలరుచుండు
శ్రీ భ్రమరాంబయై శ్రీశైలమందున
కరుణతో వీక్షించి కాచుజనుల
శ్రీ మహాలక్ష్మిగా చిన్మయరూపాన
కొల్హాపురమునందు కొలువదీరె
ఏకవీరాదేవి శోకాపహారిణి
నాందేడున వెలసె నరులగాన
శ్రీమహాకాళిగా కామితములు దీర్చ
ఉజ్జయినీపురి నుదయమొందె
పురుహూతికాదేవి పుత్రసంతతి నిచ్చి
పీఠాపురమ్మున పేరు తెచ్చె
శ్రీ గిరిజాదేవి చింతల దీర్చగా
ఒఢ్రదేశమునందు నుద్భవించె
మాణిక్యదేవియై మహిమాన్వితమ్మైన
దక్షవాటిక నిల్చె ధరణిగావ
కామరూపిణిగాను కరుణించ భక్తుల
గౌహతిలో నిల్చె మంగళప్రదముగా
మాధవేశ్వరి మాత మంగళ ప్రదముగా
భుక్తి ముక్తికి తోడ బుద్ధినిచ్చు
శ్రీ వైష్ణవీదేవి శీత శైలమునందు
జ్వాలాముఖీ ఖ్యాతి జయము గూర్చు
మంగళరూపిణి మాంగల్య గౌరిగా
గయలోన వసియించి ఘనత గూర్చు
శ్రీ విశాలాక్షి కాశీపురమందున
నిరతాన్నదాత్రిగా నెనరుగాంచె
శ్రీ సరస్వతియు కాశ్మీరమునందున
జ్ఞానదాత్రి నిల్చె జయమునీయ
అంబ సతియె తాను నష్టాదశంబుల
శక్తి పీఠములను జననమంది
భక్త జనులకెపుడు భాగ్యంబు గూర్చెడి
అష్టదశ పవిత్ర యాదిశక్తి!

**జ్ఞాన ప్రసూనాశర్మ ఎల్లకంటి**
**కద్దాల, ఫోన్ : 9493112429**

# కలల తుపాకీ

తుపాకి పట్టాల్సిన
నా చేతుల్లో
కలం పెట్టావు...
కలాన్ని
మరిచిపోమన్నావు...
సంకెళ్ళు వేసి
సమాజంలోకి
నెట్టావు..
కలను మరిచి
బంధాలను
బలపరచలేకపోతున్న....
బరువెక్కిపోతుంది
నా హృదయం
కలను మర్చిపోతున్నాననే
వేదనతో....
దేశానికి బలంగా
ఉండవలసిన దానిని
బలహీనురాలునైనాను....
శత్రువులపై యుద్ధం
చేయవలసిన నేను
నిరంతరం నా మనసుతో
యుద్ధం చేస్తున్నాను....
కలం పట్టి
కవిత్వం
రాయమటున్నావు....
నా కలం
నన్ను ప్రశ్నిస్తుంది..
కలను విడిచి
కవిత్వం రాస్తున్నావని...?



**బొంత అశ్విని**
**ఎం.ఏ., తెలుగు ఫైనల్, ఆర్ట్స్ కళాశాల,**
**ఫోన్ : 7675 922 423**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# మట్టి ముత్యాల హారం – దండకడియం

**పెద్దోజు నరేష్,** మరిపెడ బంగ్లా, మహబూబాబాద్ జిల్లా. ఫోన్ : 7989909661

కవిత్వం రాయడానికి ఎంతో కష్టపడాల్సిన అవసరం లేదు అని ప్రకృతిలో మన కంటికి కనిపించేవన్నీ కలంతో కాగితంపై ఉంచితే చాలు. లేనిది ఉన్నట్లు చూపించాల్సిన పనిలేదు. కాలం మారుతుంది. కవిత్వం మారుతుంది, అవసరాలు, ఆలోచనలు మారుతున్నాయి. కాబట్టి ఒకే వర్ణనను పట్టుకు వెళ్ళడం సబబుగా అనిపించదు. అలాగే సమాస భూయిష్టమైనటువంటి క్లిష్ట పదజాలము వాడవల్సిన అవసరం కూడా లేదు. సంస్కృత భాష ప్రభావం ఎక్కువగా ఉన్న కాలంలో నన్నయ్య, పాల్కురికి వంటివారు జాను తెలుగును, పల్లె తెలుగును సాహిత్యంలో చొప్పించే ప్రయత్నం చేశారు. ఆధునిక కాలంలో ఉన్న మనం అలాంటి ఎన్నో పల్లె పదాలను వాడక జన వ్యవహారం నుంచి కనుమరుగయ్యే పరిస్థితులలో గోపాల్ ఈ పల్లె పదాలలో కవిత్వం రాయలను కోవడం సాహసమే, మనలో చాలమంది విద్యవంతులు ప్రామాణిక భాష వైపు మొగ్గు చూపుతున్నారు తప్పులేదు కాని తద్వారా కొన్ని భావాలు, వాటిలోని ఆంతర్యము గుండెకు తగలక పైన తెలిపోతుంది. అలాంటి సందర్భాలలో గోపాల్ వాడిన పదాలు పాఠకుల హృదయాలను తడితో తట్టి లేపుతాయి.

హంగు ఆర్భాటాలు లేకుండా అచ్చమైన తెలంగాణపల్లె అందాలను వడబోసి మానవ సంబంధాలను మట్టి పదాలలో మానవీయ తీగలతో అల్లిన కవిత్వపు పందిరి. ఒక మనిషి మరో మనిషితో మాట్లాడు తున్నట్టు సహజంగా మనసులోని ఆర్తిని అలవోకమైన పదాలతో గోడు వెళ్ళబోసుకొని బరువును దించుకున్నట్లుగా గోపాల్ కవిత్వం ఉంటుంది. మానవ సంబంధాల మీద ఎంతో మంది కవులు వచ్చారు. కాని తనకంటూ ప్రత్యేకతను కల్పించుకొని తనదైన దృష్టి కోణంలో కనిపిస్తుంది. కవిత్వం చదువుతుంటే ఒక్కొక్క పదం పావురంగా పలకరిస్తాయి. మనసుకు హత్తుకొని సరికొత్త అనుభూతిని కలిగిస్తాయి. జీవితానుభావాల లోతుల్ని తట్టి లేపుతాయి. సమాజం దృష్టి పరిణామ శీలమైనది ఒకే కోణంలో చూడరాదు, దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది అంటారు. కాని గోపాల్ దృష్టి అనుభవైక పూర్వమైనదిగా తన జీవితాను భావాల సాహిత్యపు పేటీగా మలచుకున్నాడు.

వచనాన్ని కవిత్వాన్ని వేరు చేసేది భాష. వచనంలో చెప్పే విషయమే ప్రధానం కవిత్వానికి వచ్చేసరికి విషయంతో పాటు ఎంచుకున్న వస్తువులో పరకాయ ప్రవేశం చేసి విషయాన్ని ఒక ఆర్ద్రతతో ఉద్వేగ భరితంగా చెప్పినట్లుగా కవి కవిత్వంలో కనిపిస్తుంది. కవిత్వంలో ఏం చెప్పాలి, ఎలా చెప్పాలి అనేవి రెండు ముఖ్యమైన అంశాలు. ఏం చెప్పాలనేది కవి స్వేచ్ఛకు, జీవితంపై అతని అవగాహనకు సంబంధించింది. తను చూసిన అనేక అంశాలను, అనుభవాలను వాటిలోని వైరుధ్యాలను తను కవిత్వ వస్తువుగా తీసుకొని మట్టి పరిమాణాలను అద్ది "దండ కడియం" ను చేసి సామాజిక శ్రమ సౌందర్యాన్ని తెలియచేసే కవిత్వ సంపుటి.

గోపాల్ కవిత్వపు బలం పల్లీయతనంలో ఉంది. మానవ సంబంధాల మీద ఉంది. ఇది వరకు కవులు రాసినాగాని తనదైన దృష్టి కోణం కనిపిస్తుంది. బహుజన కవిత్వపు ఊట కవిత్వంలో ఉంది. ఒక బహుజన తండ్రి కట్టెలు కొట్టుకుంటూ ఏ విధంగా ఉంటాడో మనం అర్థం చేసుకోవచ్చు నాన్న గొడ్డలి అనే కవితలో....

**"మా ఇంట్లోని పేదరికాన్నంతా**
**కొంచెం కొంచెంగా నరుక్కుంటూ వచ్చింది**
**బాల్యంలో నాల్గు అక్షరాలను తిన్నానంటే**
**మా నాయనకిది నాయనలాగ**
**తోడు నడవడం వల్లనే"**

పేదరికంలో వృత్తిని నమ్ముకొని శ్రమైక సౌందర్యంలో జీవితాన్ని నెట్టుకొచ్చే విధానాన్ని అక్షరబద్ధం చేశాడు కవి. గోపాల్ కవిత్వాన్ని భావుకత నిలబెడుతుంది. సరళంగా చెప్పనే చివర ముగింపులో ఆ విషయాన్ని బలంగా చెప్పడం కనిపిస్తుంది.

**"చీకటిని మేస్తున్న**
**చుక్కల మందను కాసేటందుకు**
**ఎల్లిపోయినవంట"**

ఇన్ని రోజులు గొర్లను కాసే తాత చివరకు చుక్కలమందను కాసేందుకు వెళ్ళిపోవడం, చుక్కలు చీకటిని మేయడం ఎంతో చక్కని ఊహ. జీవితానికి దగ్గరగా ఉన్న ఊహలు. ఒకచోట "అమ్మను ఒక పచ్చనాకుల జమ్మికొమ్మతో పోలుస్తాడు ఇది ఎంతో భావుకత కలిగిన వాక్యం.

**"పొద్దు పొద్దున్నే**
**తామర మొగ్గలను సిగలో ముడుచుకున్న**
**చెరువమ్మ ముఖం చూసినంకనే**
**సూరీడు ఏడు గుర్రాల బండి కడుతాడు"**

దండకడియంలోని భావుకత ఎలాంటిదో ఈ వాక్యాలలో స్పష్టంగా కనిపిస్తుంది.

'లేనిచోట' అనే కవితలో నాయనమ్మ చనిపోవుటయే మంచిది అన్నాడు. ఎందుకు మంచిదైతది చూడండి. ఎంత చక్కని ఊహాత్మకంగా ఉందో, అందులోనే ఎంత ఆవేదన ఉందో, అసలు ఎంత చక్కని పదాల పొసగు కనిపిస్తుందో చూడండి . ముసలి వాళ్ళు మన బ్రతుకులకు మూలవాసాలు. వారు లేకుంటే మనం లేము. ప్రపంచీకరణ నేపథ్యంలో ఎవరికి వారే యమున తీరే. ఎవరి

గురించి ఎవరు ఆలోచించే తీరిక లేదు. డబ్బుకు లోకం దాసోహం అన్నట్లు నిత్య దైనందిక యాంత్రిక జీవనంలో ఎవరికి వారే అలాంటి పరిస్థితులలో నిన్ను ఎవరు పట్టించుకుంటారు. ఇది రంగుల మాయ ప్రపంచం ఇక్కడ ఆప్యాయతలకు స్థానం లేదు అంటాడు. చూడండి.

**"సీరియళ్ళ సోకులో పడి**
**పొయ్యి మీద పొంగుతున్న పాలలాగే**
**నిన్ను కూడా నేల పాలు చేయకముందే**
**సూర్యచంద్రులకు పాలియ్యదానికి**
**సర్ర సర్ర నడిచి పోవడమే మంచిదైంది"**

సూర్యచంద్రులకు పాలియ్యదానికి ఎంత చక్కని ఆర్ద్రతను, ఆవేశాన్ని నాయనమ్మ పోయిన దుఃఖపు చుక్కలను అక్షరాలలో అద్దాడు.

గోపాల్ వాక్యం గుండె తడి ఉన్న కవిత. గుండె లోతుల్లో జ్ఞాపకంగా పదిల పరుచుకున్న నాన్న జ్ఞాపకాల గంపను నాన్నను తలచుకొని దించుకుంటాడు. ఎదకు అయిన మానని గాయాన్ని తలచుకొని కంటిలోని నీళ్ళతో తన గుండెలను ఏవిధంగా తడుపు కుంటాడో చూడండి.

**"నాన్నా...**
**నువ్వు గుర్తొచ్చినప్పుడల్లా....**
**కళ్ళు మూసుకొని**
**నిన్ను నా కన్నులనిండా నింపుకుంటాను**
**కన్నీళ్ళొస్తున్నా ఇష్టంగా తల్చుకుంటూ**
**వాన వెలిసిన తరువాత**
**తడిసిన తంగేడు మొక్కనవుతాను"**

గాయాలని ప్రకృతితో (జ్ఞాపకాల)తో తడుముకుంటూ తనకు తానుగా మిగిలిపోతాడు.

దండ కడియంలో మొత్తం పల్లీయ సంస్కృతి కనబడుతుంది.

**"పది మందిల తిరిగినప్పుడు**
**గొల్ల పెద్దయ్య మనువడిని అని చెప్పుకోవడమంటే**
**నీ దండని ముద్దాడిన దండకడియాన్ని**
**ముద్దుపెట్టుకున్నట్టే ఉంటది"**

ఈ 'దండ కడియం' సంస్కృతి, ఆచార జీవన శైలిని ప్రతిబింబి స్తుంది. స్త్రీలు, పురుషులు కూడా సమానంగా ఆభరణాలు ధరిస్తారు. ఒక అనుభవాల అనుబంధాల సమ్మేళ్య జీవన శైలి కలిగిన కవిత. ఇది బహుజనుల కవిత నాటి సంస్కృతిని అద్దం పట్టే కవిత. తాతకు వారసుడు అంటే మనవడె కదా! నేను పెద్ద గొల్ల మనువడిని అని చెప్పుకోవడం అంటే నీ దండ కడియాన్ని ముద్దుపెట్టుకోవడం అంటాడు. తెలంగాణతనం ప్రతిబింబించే శైలి నిర్మాణం ఉంది కవితలో. కవిత్వం అంటే తనివితీరా అనుభవించడం. అందుకే గోపాల్ అనుభవైక జీవన కవి. తన లోకానుభవ రూపమే తన కవిత్వపు పట్టుగొమ్మ. చక్కని పద చిత్రాలు వేస్తాడు. అవి కళ్ళముందు కదలాడుతున్నట్లుగా పదాలతో వాక్యాలను నిర్మిస్తాడు గోపాల్.

**"కమ్మలు కుదువ బెట్టి**
**నా నాల్కమీద అక్షరాన్ని గీసిన**
**మా అమ్మ ఒక సుక్కల ముగ్గు**
**మట్టి పూత పూసిన గోడల మీద**
**నిండుగ నవ్వే సున్నపు ధార"**

నాటి స్త్రీ జీవన విధానం ఆమె చేసే బండెడు చాకిరి చేస్తూ అలసి పోకుండా ఆనాటి స్త్రీల నిత్య దైనందిక జీవనాన్ని కళ్లకు చూపించాడు. మళ్ళీ కవితలోనే అమ్మను కుందెన పాట అని పచ్చనాకుల జమ్మి అని ఎంత చక్కని పద చిత్రాలు వేశాడో చూడవచ్చు. యాదవ స్త్రీల సంస్కృతిని ఏవిధంగా ఉందో చెప్తాడు. కుడివైపు కొంగు వేసుకుంటారు. అందుకే ఈ కవిత శీర్షిక "బువ్వ చేతి కొంగు" అని పేరు పెట్టాడు. బంగారం కదూ అనే కవితలో అక్క గురించి ఇప్పుడున్న ప్రేమ వ్యామోహంలో చిక్కి శవాలైన అక్కల గురించి రాశాడు.

**"వాడిదేం పోయింది**
**ఎక్కడికెళ్ళినా కాలరేగరేసి**
**నాల్గు మూరల ఆడపూలను కొనుక్కుంటాడు"**

నేటి మహిళలపై జరుగుతున్న దాష్టికాల గురించి దుఃఖ భరితుడు అవుతూ ఈ కవిత రాశాడు.

**"ఈ ఊపిరి తాడు**
**తొందరగా తెగిపోకుండా ఉండటానికి**
**ఈ నడక**
**ఇలా మధ్యలోనే ఆగిపోకుండా ఉండటానికి**
**కొన్ని ప్రేమలు, కొంత పరిమళం కావాలి"**

గోపాల్ కవిత్వ అంతరార్థం అంత ఇదే. తను కోరుకునేది ఇదే.

**"అయ్య ధర్మ ప్రభువుల్లారా!**
**నన్ను ఉరితీసిన మీ చేతులతోనే**
**ఇంకా మా వాడల్లో రాజ్యమేలుతున్న**
**ఈ ఆకలిని కూడా ఉరి తీయండి"**

మామిడి పండ్లను దొంగతనం చేసిన నేరానికి ఒక పేదవాడిని ఉరితీసిన సంఘటనకు చలించి పోయి రాసిన కవిత "వెలిమామిడి". సామాజిక విషయాల పట్ల గోపాల్ చూపు ఎలాంటిదో ఈ కవిత చెబుతుంది.

గోపాల్ కవిత్వంలో గ్రామీణ జీవన సంస్కృతి, మానవ సంబంధాలు, స్త్రీల ఆచార వ్యవహారాలు యాంత్రిక జీవనం అక్షర బద్ధం చేశాడు. దండ కడియం అంతా గోపాల్ ఆత్మకథలా కనిపిస్తుంది. తన జీవితానికి ఆసరగా నిలచిన వారిని ఎవ్వరిని మరచి పోలేదు జీవితం పట్ల కృతజ్ఞత కలిగిన కవి గోపాల్ **"కవిత్వం అంటే అన్నం పెట్టదు నాయన నిజమే కాని నన్ను బ్రతికిస్తుంది. అమ్మ అంటాడు"** ఏడంత్రాల మల్లె కవితలో. కవిత్వం గోపాల్‌ను బ్రతికిస్తుంది. ఆ బ్రతుకు నేపథ్యం అంతా దండ కడియంలోనే కనిపిస్తుంది.




**పరిణత వాణి (9వ సంపుటం)**
ప్రధాన సంపాదకులు – ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
సంపాదకులు – డా. జె. చెన్నయ్య
వెల : 250 /-
**ప్రతులకు :** తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, హైదరాబాద్ – 500 001.
ఫోన్ : 040 – 2475 3724




**వ్యాస పూర్ణిమ (ప్రసంగాలు – వ్యాసాలు)**
డా. సి. నారాయణ రెడ్డి.
సంపాదకులు : సి. గంగ, డా. జె. చెన్నయ్య
వెల : 200 /-
**ప్రతులకు :** వరేణ్య క్రియేషన్స్, ప్లాట్ నెం. 61, డాలర్ హిల్స్, మణికొండ, హైదరాబాద్ – 500 089





**రాజన్న సిరిసిల్ల జిల్లా సమగ్ర స్వరూపం**
**నాగర్ కర్నూల్ జిల్లా సమగ్ర స్వరూపం**
**నిజామాబాదు జిల్లా సమగ్ర స్వరూపం**
సంపాదకులు – డా. జె. చెన్నయ్య
వెల : 300 /-
**ప్రతులకు :** తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, హైదరాబాద్ – 500 001. ఫోన్ : 040 – 2475 3724









**పూర్ణ చంద్రోదయం**
**(డా. జి.వి. పూర్ణచందు సాహిత్యానుశీలన** – సంపాదకులు :
ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్.
వెల : 350/- **ప్రతులకు :** విజేత బుక్స్, 24-14-45, 2 వ ఫ్లోర్, సాయిసిడెన్సీ, కుందేటి వారి వీధి, బావాజీ పేట, విజయవాడ – 3. ఫోన్ : 9848687652



**భారతీ ప్రశ్న (నక్షత్రమాల) మరియు సైనిక శతకము**
– అష్టకాల నరసింహరామ శర్మ
వెల : 80/-
**ప్రతులకు :** రచయిత, 19-56/3/సి, ఆదర్శ నగర్, రోడ్ నెం. 1, ప్రశాంత్ నగర్, సిద్ధిపేట.
ఫోన్ : 9440008863

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర – సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు – పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర – శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు – చరిత్ర – సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు – సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
**editormusi@gmail.com**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 11 (62) హైదరాబాద్ సెప్టెంబర్ : 2022

# ఘర్ ఘర్ కీ జీఎస్టీ




రేపు
చెట్టుమీదుంచి పావురం ఎగిరిపోవాలంటే
పన్ను వసూలు చేస్తరేమో !
చెరువుకాడ
చేపలకు గాలాలేయాలంటే
ముక్కుపిండి రకం వసూలు చేస్తరేమో !
రచ్చకట్టకాడ
చాటింపు దరువులు మండాలంటే
చిటుకు చిటుకుకు శిస్తు వసూలు చేస్తరేమో!
ఏమో
నాడు జుట్టుకు పన్ను
నేడు కుంకుమ బొట్టుకు
పొరుకాటకు సుంకమే
పూలబుట్టకు కూడ దండగే
పాలప్యాకెట్ చూడంగనే
అంగిజేబు కాలిపోతున్నది
కాయగూరల తీగలు వాడిపోతున్నవి
పండ్లచెట్లు
కాత పూత మడిసిపెట్టుకున్నవి
ఆసుపత్రులు
కాన్పులకు తలుపులు మూసేసినవి
కన్నుతెరిస్తే ట్యాక్స్ కన్నుమూస్తే కర్
బతుకుదెరువిప్పుడు
కోడిరెక్కల్లా కొట్టుకుంటున్నది
చెట్టుకు కట్టేసి కోరడాతో వాతలుపెట్టినట్లుంది
అన్నింటికి పన్నుల్లా
చావడానికి కూడ కొంత విషమివ్వండి
దానికి సొమ్ము వసూలు చేయండీ
పుణ్యాత్ములు
పేరేమో పెద్దదాయే చేతులేమో కత్తులాయే !
సూర్యుడుదయిస్తడు
గంటగంటకింత కట్టాల్సిందే
వెన్నెల కురుస్తది
గజానికింత చెల్లించాల్సిందే




మనిషి వయసు పెరుగుతది
కిలోలలెక్కన రుసుం కట్టాల్సిందే !
దీపంలో బత్తి వెలుగనంటున్నది
పొయ్యి మండనంటున్నది
తూము తెరుచుకోనంటున్నది
కిటికి రెక్కలు మూసుకుంటున్నది
అక్షరం పురుడు పోసుకోనంటున్నది
పైకం చెల్లించేదాక అనువాదం కానంటున్నది
స్మశానం కాడ
ఆధునిక వీరభాహుడు కొరడా చేతపట్టిండు
సినిమా గేటుకాడ
అమ్రీష్ పూరి గుత్పచేతపట్టిండు
మోర్, మార్ట్ , మార్కెట్ , ట్రెండ్స్
బిగ్ బజార్ లు తల్వార్ లు తిప్పుతున్నవి
ఘర్ ఘర్ కీ జీఎస్టీ
జబర్ దస్తి జీఎస్టీ..

**వనపట్ల సుబ్బయ్య**
ఫోన్ : 9492765358


ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం
మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?
అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?
మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.
సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్థారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.
7416 106 106
www.ferty9.com
IUI
IVF
ICSI
IMSI
HSG
ఫర్టీ 9
హాస్పిటల్ మరియు
పరిశోధన కేంద్రం
మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...
విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్

1